గురువారం
20-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 178
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## రైళ్లపై రెండేళ్లలో 7,971 దాడులు

న్యూఢిల్లీ: రైళ్లపై రాళ్ల దాడులకు సంబంధించి 2023 నుంచి 2025 ఫిబ్రవరి వరకు మొత్తం 7,971 కేసులు నమోదైనట్లు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. 4,549 మంది అరెస్టు అయినట్లు చెప్పారు. రాళ్ల దాడులకు కారణాలు తెలుసుకోవడం కోసం నిజనిర్ధారణ కమిటీ నివేదిక కోరారా అని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నకు వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. '2023, 2024, ఫిబ్రవరి 2025 వరకు వందేభారత్ సహా వివిధ రైళ్లపై 7,971 రాళ్ల దాడులు జరిగాయి. ఈ ఘటనలలో 4,549 మందిని అరెస్టు చేశాం' అని అన్నారు. దాడులతో దెబ్బతిన్న రైళ్ల మరమ్మతుల కోసం రూ.5.79 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

# సంక్షేమానికి ప్రాధాన్యం

**రాష్ట్ర బడ్జెట్ రూ.3,04,965 కోట్లు**

- శాసనసభలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క
- రెవెన్యూ వ్యయం - రూ.2,26,982 కోట్లు
- మూలధనం వ్యయం - రూ.36,504
- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి రూ.40,232 కోట్లు
- ఆరు గ్యారెంటీలకు రూ.56,084 కోట్లు

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క బుధవారం శాసనసభలో రాష్ట్ర ఆర్థిక పద్దును ప్రవేశపెట్టారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,04,965 కోట్ల అంచనా వ్యయంతో తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టింది. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి రాష్ట్ర తలసరి ఆదాయం, అప్పులు, రెవెన్యూ వ్యయం, మూలధన వ్యయంపై మాట్లాడారు. ఈసారి సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా ఉంది. రాష్ట్రం అప్పులు రూ.5,04,814 కోట్లుగా ఉంది. శాసనసభలో మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం 1.43 గంటల పాటు సాగింది. గత ప్రభుత్వ పాలనలో ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని, తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్నామని భట్టి తెలిపారు. ప్రజలకు నిజాలు చెప్పకపోతే స్వార్థపరులు చెప్పేవే నిజమని అనుకుంటారని అభిప్రాయపడ్డారు. మార్పు తెచ్చేలా బాధ్యతాయుత పాలన అందిస్తామని తెలిపారు. ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్... రాష్ట్ర బడ్జెట్ కు ఆమోదం తెలిపింది. ఉదయం 11.04 నిమిషాలకు ఉపముఖ్యమంత్రి సభలో బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. అయితే గతంలో ఎప్పుడూ

- మిగతా 2 లో

### నిధుల కేటాయింపు ఇలా...

| | |
|---|---|
| రూ.40,232 కోట్లు | షెడ్యూల్డ్ కులాల సంక్షేమం |
| రూ.31,605 కోట్లు | పంచాయతీరాజ్ & గ్రామీణం |
| రూ.24,439 కోట్లు | వ్యవసాయం |
| రూ.23,373 కోట్లు | నీటిపారుదల |
| రూ.23,108 కోట్లు | విద్య |
| రూ.21,221 కోట్లు | ఇంధనం, |
| రూ.17,677 కోట్లు | మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, |
| రూ.17,169 కోట్లు | షెడ్యూల్డ్ తెగల సంక్షేమం |
| రూ.12,393 కోట్లు | ఆరోగ్యం |
| రూ.11,405 కోట్లు | వెనుకబడిన తరగతుల సంక్షేమం |
| రూ.5,907 కోట్లు | రోడ్లు & భవనాలు |
| రూ.5,734 కోట్లు | పౌర సరఫరాలు |
| రూ.3,591 కోట్లు | మైనార్టీ సంక్షేమం |
| రూ.3,527 కోట్లు | పరిశ్రమలు |
| రూ.2,862 కోట్లు | మహిళలు-శిశు సంక్షేమం |
| రూ.1,674 కోట్లు | పశుసంవర్ధకం |
| రూ.1,023 కోట్లు | అడవులు, పర్యావరణం |
| రూ.900 కోట్లు | యువజన సేవలు |
| రూ.775 కోట్లు | పర్యాటకం |
| రూ.774 కోట్లు | సమాచార సాంకేతికత |
| రూ.465 కోట్లు | క్రీడలు |
| రూ.371 కోట్లు | చేనేత |

### పేదల బడ్జెట్ ప్రవేశపెట్టాం: మల్లు భట్టి విక్రమార్క

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల బడ్జెట్ అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని అన్నారు. బడ్జెట్‌లో విద్యార్థుల

- మిగతా 2 లో

### బడ్జెట్ ఉగాది పచ్చడిని తలపించింది: కూనంనేని

విశాలాంధ్ర-హైదరాబాద్: బడ్జెట్‌పై అనేక ఆశలు ప్రజల్లో ఉన్నాయని... వాస్తవంగా ఆశలు నెరవేర్చే విధంగా మార్గం చూపే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదని సీపీఐ శాసన సభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఆయన

- మిగతా 2 లో

### బడుగు, బలహీన వర్గాలకు దగా: బీఆర్ఎస్

విశాలాంధ్ర-హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు. బడుగు, బలహీన వర్గాలను మోసం చేసేలా ఈ బడ్జెట్ ఉందని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు ఆరు గ్యారెంటీల ఊసే లేదని విమర్శించారు. శాసనసభ వాయిదా పడిన అనంతరం

- మిగతా 2 లో

## దివి నుంచి భువికి సునీతా విలియమ్స్

- ఫ్లోరిడా సముద్ర జలాల్లో క్షేమంగా దిగిన 'క్రూ డ్రాగన్'
- అంబరాన్నింటిన సంబరాలు

అంతా అనుకున్నట్లే జరిగింది...నాసా పక్కా ప్రణాళిక విజయవంతమైంది. సాంకేతిక సమస్యల కారణంగా తొమ్మిది నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉండిపోయిన శాస్త్రవేత్తలు భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ భువిపై సురక్షితంగా అడుగుపెట్టారు.

2లో

## ఇజ్రాయిల్ కట్టడికి తక్షణ చర్యలు

**అంతర్జాతీయ సమాజానికి సీపీఐ విజ్ఞప్తి**

న్యూఢిల్లీ: గాజాలో ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణహోమాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) జాతీయ సమితి తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మార్చి 18, 2025న గాజాపై ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల ఫలితంగా మహిళలు, పిల్లలు సహా 400 మందికి పైగా పలస్తీనియన్లు దుర్మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేసింది. అక్టోబర్ 7, 2023 నాటి నుండి పలస్తీనియన్ల మరణాల సంఖ్య 62 వేలు దాటింది. వీరిలో అత్యధికులు అమాయక పౌరులే. ఆందోళన కలిగిస్తున్న ఈ సంఖ్య... కొనసాగుతున్న సంఘర్షణ తీవ్రతకు నిదర్శనం. పలస్తీనియన్లపై జరిగిన మారణహోమంగా గుర్తించబడింది. ఈ దారుణ మారణకాండను ఆపేలా ఇజ్రాయిల్‌ను కట్టడి చేయడానికి తక్షణ, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని సీపీఐ అంతర్జాతీయ సమాజానికి, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి పిలుపునిచ్చింది. ప్రపంచ సంస్థల నిరంతర నిష్క్రియాపర్వం, మౌనం... దురాక్రమణదారుడి (ఇజ్రాయిల్)ని ప్రోత్సహించడమే కాకుండా అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కుల ప్రాథమిక సూత్రాలను కూడా క్షీణింపజేస్తోంది. ఈ తీవ్రమైన సమస్యపై భారత ప్రభుత్వం మౌనం కొనసాగించడం పట్ల తీవ్ర నిరాశ చెందుతున్నట్లు తెలిపింది. న్యాయం,

- మిగతా 2 లో

## హైదరాబాద్‌లో మెక్‌డొనాల్డ్ గ్లోబల్ సెంటర్

### సీఎం రేవంత్‌తో సంస్థ సీఈఓ చర్చలు

విశాలాంధ్ర-హైదరాబాద్: అమెరికాకు చెందిన మల్టీ నేషనల్ సంస్థ మెక్ డొనాల్డ్స్.. తెలంగాణ ప్రభుత్వంతో కీలక ఒప్పందం చేసుకుంది. సంస్థ విస్తరణలో భాగంగా మెక్ డొనాల్డ్స్ ఇండియా గ్లోబల్ ఆఫీస్ ను హైదరాబాద్ లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. 2,000 మంది ఉద్యోగులతో మెక్ డొనాల్డ్ గ్లోబల్ ఇండియా ఆఫీసును ప్రారంభించనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం అసెంబ్లీలోని ఛాంబర్లో మెక్ డొనాల్డ్స్ చైర్మన్, సీఈవో క్రిస్ కెంప్కెజెన్స్కితో పాటు సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తమ గ్లోబల్ ఆఫీస్ ఏర్పాటుకు సంబంధించి మెక్‌డొనాల్డ్స్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో పెట్టుబడుల ఒప్పందం చేసుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. మెక్‌డొనాల్డ్స్ ప్రతినిధుల బృందంలో సీఈవో తో పాటు గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు స్కై ఆండర్సన్, చీఫ్ గ్లోబల్ ఇంపాక్ట్ ఆఫీసర్ జాన్ బ్యానర్, గ్లోబల్ ఇండయా హెడ్ దేశాంత కైలా

- మిగతా 2 లో

## ఆర్టీసీ ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల ఆగ్రహం
- ఆర్టీసీ పరిరక్షణ, కార్మిక సమస్యలపై హామీలు అమలు చేయాలని డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్: పర్యావరణ పరిరక్షణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా రవాణ వ్యవస్థ అయిన ఆర్టీసీని దొడ్డి దారిన ప్రైవేటీకరించేందుకే ఎలక్ట్రికల్ బస్సులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఆరోపించారు. అనేక వ్యవ ప్రయాసలు తట్టుకుంటూ రాష్ట్ర ప్రజలకు సురక్షిత, సుఖవంత ప్రయాణం అందిస్తున్న ఆర్టీసీకి కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో బుధవారం సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో ఆర్టీసీని పరిరక్షిద్దాం- ప్రజా సేవను కొనసాగిద్దాం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ స్వాగతం పలికారు. తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, నూతనంగా ఎన్నికైన సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి.నరసింహారావు, సీపీఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసుఫ్, వామపక్ష పార్టీలు నాయకులు జానకి రాములు (ఆర్ సి.హెచ్.మురహరి (ఎస్‌ఎం.హన్ లైన్), కె.గోవర్ధన్ (న్యూడెమోక్రసీ), ఆర్టీఏసీ చైర్మన్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇ.వెంకన్న, కో-చైర్మన్, థామస్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయ్య నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.కాంతయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం, ఆర్టీసీ జేఏసీ

- మిగతా 2 లో

## ట్రంప్‌నకు దెబ్బ మీద దెబ్బ

2లో

### బెంగాల్‌లో వామపక్ష ఫ్రంట్

కేరళలో మొట్ట మొదటి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని 1959లో అధికారం నుంచి తొలగించిన తరవాత పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో సుదీర్ఘ కాలం వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వాలు కొనసాగాయి. పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ఫ్రంట్ 1977 నుంచి మొదలుకుని 2011 దాకా వరసగా ఏడు విడతలు అధికారంలో ఉంది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

### అత్యంత సంపన్న ఎమ్మెల్యే బీజేపీ నేత

న్యూఢిల్లీ: దేశంలోనే అత్యంత ధనిక ఎమ్మెల్యేగా మహారాష్ట్ర బీజేపీ నేత పరాగ్ షా గుర్తింపుపొందారు. ముంబైలోని ఘాట్కోపర్ తూర్పు నియోజకవర్గం నుంచి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన అస్తి విలువ రూ.3400 కోట్లు. ఎమ్మెల్యేల ఆర్థిక, నేర, రాజకీయ నేపథ్యానికి సంబంధించి అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విశ్లేషణలో ఈ విషయం వెల్లడైంది. సంపన్న ఎమ్మెల్యేల జాబితాలో కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రెండో స్థానంలో ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.1413 కోట్లుగా ఏడీఆర్ పేర్కొంది.

### స్పేస్‌ఎక్స్‌తో వొడాఫోన్ చర్చలు

ముంబై: ప్రముఖ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా తన నెట్‌వర్క్ సేవల్ని మరింత మెరుగు పర్చుకొనేందుకు దిశగా ఏరోస్పేస్ కంపెనీ స్పేస్‌ఎక్స్‌తో చర్చలు జరుపుతోంది. ఈ విషయాన్ని కంపెనీ తన ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ద్వారా వెల్లడించింది. తన సర్వీస్ నాణ్యతను మెరుగుపర్చుకొని, టెలికాం సేవల్ని మరింత విస్తరించడానికి స్పేస్‌ఎక్స్‌తో పాటు ఇతర శాట్‌కామ్ ప్రొవైడర్లతో చర్చలు జరుపుతున్నట్లు వొడాఫోన్ ఐడియా తెలిపింది.

### రూ.92 వేల చేరువకు పసిడి

న్యూఢిల్లీ: దేశీయంగా బంగారం ధర పెరుగుతూనే ఉంది. అంతర్జాతీయ డిమాండ్‌తో ఇటీవల రూ.90 వేల మార్కును దాటింది. తాజాగా రూ.92 వేలకు చేరువైంది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన ధర బుధవారం రూ.700 పెరిగి రూ.91,950కి చేరినట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో 10 గ్రాముల ధర రూ.91,150గా ఉన్నట్లు బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర మంగళవారం రూ.91,250గా ఉండగా.. బుధవారం రూ.700 పెరిగి రూ.91,950కి చేరింది.

### ఇదీ లోకం!

గుర్తుంచుకోండి, ప్రజల జేబుల్లోకి పాలన అందిస్తాం!

# ట్రంప్‌నకు దెబ్బ మీద దెబ్బ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి డొనాల్డ్ ట్రంప్ దుందుడుకు చర్యలకు పాల్పడుతున్నారు. ఇష్టారీత్యా ఉత్తర్వులు జారీచేస్తూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు.దీంతో ఆయన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లలో కొన్ని కోర్టుల వరకు వెళ్లాయి. ఇదే క్రమంలో ఫెడరల్ కోర్టు విచారించిన మూడు కేసుల్లో ఆయనకు ఎదురు దెబ్బ తగిలింది. గ్రీన్ బ్యాంక్ సంబంధిత నిధుల రద్దునకు ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని ఫెడరల్ కోర్టు నిలిపివేసింది. ట్రాన్స్‌జెండర్లను సైన్యం నుంచి నిషేధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులనూ కొట్టివేసింది. అటు యూఎస్ ఎయిడ్ మూసివేత దిశగా చర్యలను ఆపేయాలని ఆదేశించింది.

**గ్రీన్ బ్యాంక్ నిధులు రద్దు చేయలేరు...**

'గ్రీన్ బ్యాంక్' నిధులు 14 బిలియన్ డాలర్లను రద్దు చేయాలనుకున్న ట్రంప్ ప్రభుత్వానికి ఫెడరల్ కోర్టు అడ్డుకున్నది. నిధులను రద్దు చేసేందుకుగాను, దారి మళ్లించేందుకుగానీ వీల్లేదని ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో బైడెన్ ప్రభుత్వం మూడు వాతావరణ సంస్థలకు కేటాయించిన ఈ నిధిని రద్దునకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమైంది. అయితే పర్యావరణ సంరక్షణ సంస్థకు కేటాయించిన నిధులనునెలా నిలిపివేస్తారని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి టోన్యా చుట్కన్ అడ్డు చెప్పారు. ఈ నిధిని ప్రభుత్వానికిగానీ ఇతరులకుగానీ మళ్లించేందుకు వీల్లేదని కచ్చితంగా చెప్పారు. ఈపీఏ తరపున డబ్బుకు జవాబుదారీగా ఉన్న సిటీబ్యాంక్‌కూ ఆ మేరకు ఆదేశాలిచ్చారు. అయితే నిధుల విషయంలో అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు ఈపీఏ అడ్మినిస్ట్రేటర్ లీ జెల్డిన్ ఆరోపణలనూ న్యాయమూర్తి తోసిపుచ్చారు. రెండు పక్షాల వాదనలు విన్న జడ్జి చుట్కన్... జెల్డిన్ ఆరోపణలను రుజువు చేసేందుకు సరిపడ ఆధారాలు లేవన్నారు. ఒక్క రోజులో ట్రంప్ యంత్రాంగానికి వ్యతిరేకంగా ఉత్తర్వులు జారీచేసిన మూడవ జడ్జిగా జస్టిస్ చుట్కన్ నిలిచారు. ఇదిలావుంటే, డిపోర్టేషన్ ఫ్లైట్‌లను తాత్కాలికంగా స్టే విధించిన సుప్రీంకోర్టు సీజే జాన్ రాబర్ట్స్ అభిశంసనకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పిలుపుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ట్రాన్స్‌జెండర్లపై నిషేధానికి తిరస్కృతి**

అమెరికా సైన్యం నుంచి ట్రాన్స్‌జెండర్లను నిషేధించడంపై ఫెడరల్ కోర్టులో ట్రంప్‌నకు ఎదురుదెబ్బ తగిలింది. సమానత్వ సూత్రాన్ని ఉదహరిస్తూ ట్రాన్స్‌జెండర్లపై నిషేధాన్ని కోర్టు తిరస్కరించింది. మహిళల క్రీడా పోటీల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనడాన్ని కూడా ట్రంప్ నిషేధించారు. అయితే సైన్యంలో నిషేధంపై కొందరు కోర్టుకు వెళ్లగా ట్రంప్‌కు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. రాజ్యాంగంలోని ట్రాన్స్‌జెండర్‌ల హక్కులను అధ్యక్షుడు అడ్డుకోరాదని కోర్టు తెలిపింది. మానవులంతా సమానమని చెబుతూ ట్రంప్ ఉత్తర్వులను ఫెడరల్ కోర్టు కొట్టివేసింది.

**యూఎస్ఎయిడ్ మూసివేతకూ నిరాకరణ**

ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ సారథ్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీకి ఫెడరల్ కోర్టులో చుక్కెదురైంది. యూఎస్ఎయిడ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్ల తొలగింపుపై దాఖలైన వాజ్యంపై విచారణ చేపట్టిన న్యాయస్థానం... యూఎస్ ఎయిడ్ మూసివేతకు నిరాకరించింది. ఆ దిశగా సాగే పనులను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. ఇలా చేయడం రాజ్యాంగాన్ని అనేక విధాలుగా ఉల్లంఘించడమేనని జడ్జి థియోడర్ చువాంగ్ వెల్లడించారు. యూఎస్ ఎయిడ్ మూసివేతపై వెనక్కు తగ్గాలని ట్రంప్ యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

# అవినీతి కేసులో ఇస్తాంబుల్ మేయర్ సహా 100 మంది అరెస్టు

## టర్కీ కమ్యూనిస్టు పార్టీ ఖండన

ఇస్తాంబుల్: ఒక అవినీతి కేసు టర్కీలో సంచలనంగా మారింది. అవినీతి ఆరోపణలతో ఇస్తాంబుల్ మేయర్ అక్రమ్ ఇమాంగ్లు అరెస్టు అయ్యారు. జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు సహా 100 మందిని కూడా టర్కీ అధికారులు ఆదేశాల మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారణం చెప్పకుండా ఇమ్మాంగ్లును పోలీసులు అరెస్టుచేశారని ఆయన మీడియా సలహాదారు మూరత్ ఓంగున్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. తన ఇంటిని వందల మంది పోలీసులు చుట్టుముట్టారని ఇమ్మాంగ్లు కూడా 'ఎక్స్' మాధ్యమంగా వెల్లడించారు. అయితే ఒత్తిళ్లకు తలొగ్గనని, ధైర్యంగా నిలబడతానని ప్రకటించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆయన ఇంటిని పోలీసులు సోదా చేశారు. ఈ మేరకు స్థానిక మీడియాలో బుధవారం వార్తలు వచ్చాయి. అయితే అసమ్మతి స్వరాలను ఎర్డోగన్ ప్రభుత్వం అణచివేయాలని చూస్తోందని, ఇందులో భాగంగానే నాటకీయ పరిణామాల నడుమ ఇస్తాంబుల్ మేయర్ అక్రమ్ ఇమాంగ్లును అరస్టు చేసిందని టర్కీ కమ్యూనిస్టు పార్టీ ఆక్షేపించింది. ఏకేపీ (అధికార పార్టీ) నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని టర్కీ ప్రజలకు పిలుపునిచ్చింది. అక్రమ్ ఇమాంగ్లుతో పాటు జర్నలిస్టు ఇస్మాయిల్ సయ్‌మజ్ సహా 100 మందిని అదుపులోకి తీసుకోవడం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ఇస్తాంబుల్‌లో అత్యవసర పరిస్థితి విధించే దిశగా ఈ నిర్ణయాలు తీసుకోవడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపింది. అరెస్టు చేసిన అందరినీ తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని టర్కీ కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది.

# కెన్నడీ హత్యపై కీలక పత్రాల విడుదల

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ హత్యకు సంబంధించిన కీలక దస్త్రాలను ట్రంప్ ప్రభుత్వం బయట పెట్టింది. అమెరికా నేషనల్ ఆర్కైవ్స్ అండ్ రికార్డ్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారిక వెబ్‌సైట్‌లో ఆ పత్రాలను పొందుపర్చారు. కెన్నడీ హత్యకు సంబంధించిన దాదాపు 80 వేల పత్రాలను విడుదల చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన క్రమంలో తాజా పరిణామం జరిగింది. కెన్నడీ హత్యకు సంబంధించిన 2,400 కొత్త రికార్డులను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ఇటీవల గుర్తించింది. 1963 నవంబరు 22న అమెరికా 35వ అధ్యక్షుడు జాన్ ఎఫ్.కెన్నడీ హత్యకు గురయ్యారు. ఇదిలావుంటే, ఈ పత్రాలను విడుదల చేసి ట్రంప్ పారదర్శకతతో కూడిన నవ శకానికి నాంది పలికారని అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ అన్నారు. ఎలాంటి సవరణలు లేకుండానే కెన్నడీ హత్య రహస్యాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు.

# ఇజ్రాయిల్ కట్టడికి తక్షణ చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

వలసవాద వ్యతిరేక పోరాటం పట్ల చారిత్రక నిబద్ధత కలిగిన భారతదేశం... పలస్తీనా ప్రజల దుస్థితి పట్ల ఉదాసీనంగా ఉండకూడదు. భారత ప్రభుత్వం తన మౌనాన్ని వీడాలి. కొనసాగుతున్న హింసను ఖండించాలి. పలస్తీనాకు మద్దతు ఇవ్వాలని సీపీఐ విజ్ఞప్తి చేసింది. స్వేచ్ఛ, న్యాయం, స్వయం నిర్ణయాధికారం కోసం పలస్తీనా ప్రజలకు అచంచల సంఘీభావంగా నిలుస్తామని ప్రకటించింది. పలస్తీనా ప్రజలకు తమ మద్దతు, సంఘీభావం తెలియజేయాలని భారత ప్రజలను సీపీఐ కోరింది.

# ఆర్టీసీ ప్రైవేటీకరణకు కేంద్రం కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు చల్లారాంరెడ్డి, సత్యపాల్, జ్యోతి , భరత్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ఆర్టీసీకి సంబంధించి ప్రధానంగా మూడు సమస్యలు ఉన్నాయన్నారు...మొదటిది ఆర్థిక సమస్యలు, రెండవది యూనియన్ల పునరుద్ధరణ, మూడవది ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ అని వివరించారు. ఇప్పుడు మరింత పెద్ద సమస్య దొడ్డి దారిన ఆర్టీసీని ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం అన్నారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో తీసుకువస్తున్న ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్రాల్లో అతి పెద్ద ప్రజా రవాణా సంస్థలైన ఆర్టీసీకి కాకుండా కార్పొరేట్ సంస్థలకు మాత్రమే కేటాయించడాన్ని ఆయన తప్పుబట్టారు. దీంతో ఆర్టీసీ... బస్సులను అనివార్యంగా అద్దె రూపంలో తీసుకుని వాటికి డబ్బులు చెల్లించాల్సి పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం సైతం ఏమి చేయలేని పరిస్థితి నెలకొందని... దీంతో ఆర్టీసీ సంస్థకు అద్దెలు మరింత భారంగా మారతాయని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గనుండడంతో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ సమస్యలన్నింటికి పరిష్కారంగా కేంద్రం ప్రభుత్వం సబ్సిడీ కింద ఇస్తున్న ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ సంస్థలకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నిత్యం లక్షలాది మందిని సురక్షితంగా గమ్యస్థానాల చేరవేయడంతోపాటు ప్రత్యక్షంగా 41 వేల మందికి ఉద్యోగాలు, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఆర్టీసీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రజా రవాణ వ్యవస్థ అయిన రైల్వేకు డీజిల్ పన్ను 4 శాతం ఉంటే, పేద ప్రజలకు అతి తక్కువ చార్జీలతో రవాణాను అందిస్తున్న ఆర్టీసీ నుంచి మాత్రం 18 శాతం వసూలు చేయడం అన్యాయమన్నారు. ఆర్టీసీ బస్సులకు టోల్ మినహాయింపులతో పాటు 5 ఏళ్ల పాటు ట్యాక్స్ హాలిడేను ప్రకటించాలని కోరారు. అదే విధంగా ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి వారికి న్యాయం చేయాలని, యూనియన్లను పునరుద్ధరించడం ద్వారా వారికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నెల్లికంటి సత్యం మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాలకు ప్రయాణ సౌకర్యాలను అందిస్తున్న అతి పెద్ద సంస్థ ఆర్టీసీని ప్రభుత్వం పరిరక్షించాలన్నారు. ఇందుకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆర్టీసీని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. కేంద్రం ఒక ఎలక్ట్రిక్ బస్సుకు రూ.40 లక్షల వరకు సబ్సిడీ ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ట్యాక్స్ మినహాయింపు ఇస్తున్న నేపథ్యంలో ఈ బస్సులను ఆర్టీసీకి కేటాయిస్తే ఇటు సంస్థకు అటు ప్రజలకు మరింత మెరుగైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందన్నారు. ఆర్టీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారం చేపట్టి 15 నెలలు కావస్తున్నా ఆర్టీసీ విలీనం ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినా...ఆ సమస్యను నేటికి పరిష్కరించలేదని, దీంతో చిన్న చిన్న తప్పులకే అధికారులు ఉద్యోగులను తొలగించి, వారి కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి... తమ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె బాట పడతామని వారు హెచ్చరించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ... ఆర్టీసీ పరిరక్షణతో పాటు కార్మిక సమస్యల పరిష్కారానికి ఇచ్చిన ప్రతి హామీ నేరవేర్చాలని వివిధ వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు.

# పేదల బడ్జెట్ ప్రవేశపెట్టాం

(మొదటిపేజీ తరువాయి)

కాస్మొటిక్ చార్జీలను 200 శాతం పెంచామని ఆయన తెలిపారు. ఎకరాకు రైతు భరోసా రూ. 12 వేలు, రైతు కూలీలకు ఇందిరమ్మ రైతు భరోసా కింద రూ. 12 వేలు, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సుమారు 57 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. త్వరలో గ్రూపు-1, గ్రూపు-2, గ్రూపు-3 అభ్యర్థులకు నియామక పత్రాలు ఇస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నామని ఆయన వివరించారు. యువ వికాసం పథకం కింద లబ్ధిదారులకు రూ. 4 లక్షల ఆర్థిక సాయం చేయబోతున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రాల్లో విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి ఏడాది రెండు చీరలు ఇస్తామని తెలిపారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలను ప్రభుత్వం ఆదుకుంటోందని ఆయన వెల్లడించారు. సంక్షేమం, అభివృద్ధితో ముందుకు సాగుతున్నామని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక వ్యవస్థ భ్రష్టు పట్టిందని విమర్శించారు.

# దివి నుంచి భువికి సునీతా విలియమ్స్

న్యూఢిల్లీ: అంతా అనుకున్నట్లే జరిగింది...నాసా పక్కా ప్రణాళిక విజయవంతమైంది. సాంకేతిక సమస్యల కారణంగా తొమ్మిది నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉండిపోయిన శాస్త్రవేత్తలు భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌లను భువిపై సురక్షితంగా అడుగుపెట్టారు. దాదాపు 9 నెలలపాటు అంతరిక్షంలోనే ఉండిపోయిన వీరిద్దరూ మరో ఇద్దరు వ్యోమగాములతో కలిసి సురక్షితంగా పుడమిని చేరారు. ఐఎస్ఎస్ నుంచి బయల్దేరిన క్రూ డ్రాగన్ వ్యోమనౌక బుధవారం తెల్లవారుజామున 3: 27 గంటలకు ఫ్లోరిడా తీరానికి చేరువలో సముద్ర జలాల్లో దిగింది. గంటకు 17 వేల మైళ్ల వేగంతో భూమివైపు ప్రయాణించిన డ్రాగన్ క్యాప్సుల్ క్రమంగా వేగాన్ని తగ్గించుకుంటూ వచ్చింది. గంటకు వేగం 116 మైళ్లకు చేరుకున్నాక పారాచూట్లు తెరచుకున్నాయి. 4 పారాచూట్ల సాయంతో వేగాన్ని మరింత తగ్గించుకొని క్యాప్సుల్ సురక్షితంగా సముద్ర జలాల్లో దిగింది. నాసా సిబ్బంది అక్కడికి చేరుకొని చిన్న చిన్న బోట్ల సాయంతో దానిని ఓ నౌకపైకి తీసుకొచ్చి... ఒడ్డుకు చేర్చారు. అనంతరం వ్యోమగాములను హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలించారు. అక్కడ వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. భూ గురుత్వాకర్షణ శక్తికి తిరిగి సర్దుబాటు అయ్యేలా నిపుణులు వారికి తోడ్పాటు అందిస్తారు. గతేడాది జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ప్రణాళిక ప్రకారం వీరు 8 రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. నాటినుంచి సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌లోనే ఉండిపోయారు. తొమ్మిది నెలల్లో అనేక ప్రయత్నాల అనంతరం స్పేస్ఎక్స్ క్రూ డ్రాగన్‌లో ఐఎస్ఎస్ నుంచి బయల్దేరారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 10.15 గంటలకు అన్‌డాకింగ్ ప్రక్రియ చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున ఇంజిన్లను మండించి క్రూ డ్రాగన్‌ను భూవాతావరణంలోకి పునఃప్రవేశపెట్టారు. దీని ల్యాండింగ్ దృశ్యాలను నాసా ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఊహించని సవాళ్లు, చారిత్రాత్మక క్షణాలతో నిండిన ఈ మిషన్ విజయవంతంగా ముగియడంతో ప్రపంచవ్యాప్తంగా ఆనందం వెల్లివిరిసింది. వ్యోమనౌక సేఫ్ ల్యాండింగ్‌తో నాసా, స్పేస్-ఎక్స్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. 286 రోజుల తర్వాత సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ మరో ఇద్దరు వ్యోమగాములు సురక్షితంగా పుడమిని చేరినట్లు నాసా ప్రకటించింది. దివి నుంచి భువికి చేరిన వారిలో సునీతా విలియమ్స్, విల్మోర్‌తో పాటు స్పేస్ఎక్స్ క్రూ-9 వ్యోమగామి నిక్ హేగ్, రష్యన్ వ్యోమగామి అలెగ్జాండర్ గోర్బునోవ్ ఉన్నారు. ఈ వ్యోమగాముల బృందానికి నాసా అభినందనలు తెలిపింది. ఈ యాత్ర సక్సెస్ కావడంలో స్పేస్ఎక్స్‌ది అద్భుత పాత్ర అని నాసా కొనియాడింది. సునీతా విలియమ్స్, విల్మోర్‌లు సురక్షితంగా.. ఆరోగ్యంగా ఉన్నారని పేర్కొంది. ప్రశాంత వాతావరణం అనుకూలించడంతో డ్రాగన్ కాప్సూల్ అన్‌డాకింగ్, ల్యాండింగ్ ప్రక్రియ సజావుగా సాగిందని.. ఎటువంటి ఇబ్బంది తలెత్తలేదని వివరించింది.

**ఉల్లాసంగా...ఉత్సాహంగా...**

స్పేస్ క్యాప్సూల్ నుంచి బయటికి వస్తూ సునీత నవ్వుతూ అభివాదం చేశారు. అందరికీ హాయ్ చెబుతూ.. చాలా ఉల్లాసంగా కనిపించారు. ఆమెలో ఎలాంటి ఆందోళన కనిపించలేదు. చాలా ఉత్సాహంగా.. ఆనందంగా ఉన్నట్లు వీడియోను బట్టి తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**అంబరాన్నంటిన సంబరాలు**

సునీత క్షేమంగా భూమిపైకి రావడంతో భారత్‌లో అనేక చోట్ల ప్రజలు టపాసులు కాలుస్తూ... మిఠాయిలు పంచుకుని సంబరాలు చేశారు. సునీత పూర్వీకుల గ్రామం గుజరాత్‌లోని ఝూలాసన్‌లో ఆమె బంధువులు, గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు, బాణసంచా కాల్చుతూ నృత్యాలు చేశారు. అంతకుముందు ఆమె సురక్షితంగా భూమిని చేరుకోవాలని గ్రామంలోని దేవాలయంలో పూజలు నిర్వహించి యజ్ఞం చేశారు. భారత సంతతికి చెందిన న్యూరోఅనాటమిస్ట్ దీపక్ పాండ్యా, స్లొవీన్ అమెరికన్ ఉర్సులైన్ బోనీలకు 1965 సెప్టెంబర్ 19న ఒహాయోలో సునీత జన్మించారు. పాండ్యా దంపతులకు ముగ్గురు సంతానం కాగా... సునీత చిన్న కుమార్తె. దీపక్ పాండ్యా గుజరాత్‌లో జన్మించారు. మసాచుసెట్స్‌లో 1983లో హైస్కూల్ విద్య, 1987లో యూఎస్ నావల్ అకాడమీ నుంచి బీఎస్సీ, 1995లో ఫ్లోరిడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో సునీత ఎమ్మెస్సీ పూర్తి చేశారు. 1997లో మిలటరీలో చేరిన సునీత...30 రకాల విమానాలను 3 వేల గంటలు నడిపిన అనుభవం పొందారు. 1998లో నాసా వ్యోమగామిగా ఎంపికయ్యారు.

**రాష్ట్రపతి, ప్రధాని సహా ప్రముఖుల అభినందన**

భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ సురక్షితంగా భూమిని చేరుకోవడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సహా వివిధ రంగాలకు చెందిన అనేకమంది హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఆమెకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు ప్రజలంతా స్వాగతం పలుకుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. 'సునీతా విలియమ్స్ సురక్షితంగా అంతరిక్ష కేంద్రం నుంచి భూమికి చేరుకోవటం చాలా సంతోషం. నాసా వ్యోమగాములు విజయవంతంగా భూమికి చేరటానికి కృషిచేశారు. సునీత, ఇతర వ్యోమగాముల పట్టుదల, అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి. వారి చారిత్రాత్మక యాత్ర సంకల్పం, టీమ్ వర్క్, అసాధారణ ధైర్యానికి ప్రతీక' అని రాష్ట్రపతి అన్నారు. 'వెల్‌కమ్ బ్యాక్ సునీత. మీ అపరిమిత ధైర్యం, స్ఫూర్తికి ఇన్నాళ్లూ పరీక్ష ఎదురైంది. అయినా సునీతా విలియమ్స్, మిగతా వ్యోమగాములు పట్టుదల అంటే ఏంటో మరోసారి ప్రదర్శించారు. వారి అచంచలమైన సంకల్పం కోట్లాది మందికి స్ఫూర్తి. సునీతతో పాటు మిగిలిన వ్యోమగాములను సురక్షితంగా భూమిపైకి తీసుకువచ్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేసిన వారిపట్ల గర్వపడుతున్నాం. అభిరుచి, సాంకేతికత కలగలిస్తే ఎలాంటి అద్భుతాలు జరుగుతాయో వారు చూపించారు' అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో మెక్‌డొనాల్డ్ గ్లోబల్ సెంటర్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. మెక్‌డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీస్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావటంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ గ్లోబల్ సెంటర్ కోసం వివిధ రాష్ట్రాలు పోటీ పడుతున్న సందర్భంలో మెక్ డొనాల్డ్ సంస్థ తెలంగాణను తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎంచుకోవటం గర్వంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గత 15 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వివరించారు. సంస్థకు అవసరమైన శిక్షణ నైపుణ్యమైన ఉద్యోగులను నియమించుకునేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. యూనివర్సిటీని స్కిల్ జోన్ గా ఉపయోగించుకొని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి గ్లోబల్ ఆఫీస్ లోనే కాకుండా, దేశ విదేశాల్లో తమ ఆఫీసులు, అవుట్ లెట్లలో ఉద్యోగాలు కల్పించాలన్నారు.

మెక్‌డొనాల్డ్స్‌కు అవసరమైన మొత్తం వ్యవసాయ ఉత్పత్తులను స్థానిక రైతులు సమకూర్చేలా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. దీంతో రైతుల ఆదాయం పెరుగుతుందని, రాష్ట్ర వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. బెంగళూరు లాంటి ఇతర సిటీలతో పోలిస్తే హైదరాబాద్‌లో ప్రతిభావంతులైన నిపుణులతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన జీవన ప్రమాణాలున్నాయని మెక్ డొనాల్డ్ సీఈవో క్రిస్ కెంప్‌క్జెన్స్కీ అన్నారు. అందుకే హైదరాబాద్ ను తమ గ్లోబల్ ఇండియా ఆఫీస్ సెంటర్ గా ఎంచుకున్నట్లు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా మెక్ డొనాల్డ్స్ నిర్వహిస్తున్న కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. ప్రస్తుతం తెలంగాణలో 38 మెక్‌డొనాల్డ్స్ అవుట్ లెట్లున్నాయి. ప్రతి ఏడాది మరో 3 లేదా 4 కొత్త అవుట్ లెట్లను విస్తరించే ప్రణాళికలున్నాయన్నారు. కొత్తగా గ్లోబల్ ఇండియా ఆఫీసు ఏర్పాటుతో రాష్ట్రంలోని యువతకు ప్రత్యక్షంగా పరోక్షంగా మరిన్ని ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# సంక్షేమానికి ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

లేని విధంగా షెడ్యూల్ కులాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. అదేవిధంగా గ్రామీణాభివృద్ధి, నీటి పారుదల, వ్యవసాయం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ అధిక నిధులు కేటాయించింది. ఈ సందర్భంగా ఆయన సభను ఉద్దేశించి ఆర్థికమంత్రి భట్టి మాట్లాడుతూ తెలంగాణ తలసరి ఆదాయ వృద్ధిరేటు 9.6 శాతం ఉందని వెల్లడించారు. ప్రస్తుత ధరల ప్రకారం జీఎస్‌డీపీ రూ.16,12,579 కోట్లు కాగా, గతేడాదితో పోలిస్తే వృద్ధిరేటు 10.1 శాతం నమోదైంది. జీఎస్‌డీపీ వృద్ధిరేటు జీడీపీ వృద్ధిరేటు కంటే ఎక్కువ ఉందని తెలిపారు. జీఎస్‌డీపీ వృద్ధి రేటు 10.1 శాతం, జీడీపీ వృద్ధి రేటు 9.9 శాతంగా అంచనా వేశారు. దేశ జీడీపీ రూ.3,31,03,215 కోట్లు కాగా, 2024-25 ఏడాది తలసరి ఆదాయం రూ.3,79,751గా ఉందని అన్నారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా వస్తున్న మార్పుల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటూ, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని భట్టి పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, తెలంగాణ స్థూల రాష్ట్ర ఉత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం పదహారు లక్షల పన్నెండు వేల ఐదు వందల డెబ్బై తొమ్మిది కోట్ల రూపాయలు (16,12,579 కోట్లు). గత సంవత్సరంతో పోలిస్తే వృద్ధిరేటు 10.1 శాతంగా నమోదైంది. ఇదే సమయంలో దేశ జీడీపీ మూడు కోట్ల ముప్పై ఒక్క లక్షల మూడు వేల రెండు వందల పదిహేను కోట్ల రూపాయలు (3,31,03,215 కోట్లు) కాగా, వృద్ధిరేటు 9.9 శాతంగా ఉంది. తలసరి ఆదాయం విషయానికి వస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో, ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం 3,79,751 కాగా, వృద్ధి రేటు 9.6 శాతం ఉందన్నారు. దేశ తలసరి ఆదాయం రూ.2,05,579 కాగా వృద్ధి రేటు 8.8 శాతం. దేశ తలసరి ఆదాయంతో పోల్చితే తెలంగాణ తలసరి ఆదాయం ఒక లక్షా డెబ్బై నాలుగు వేల ఒక వంద డెబ్బై రెండు రూపాయలు (రూ.1,74,172), అంటే 1.8 రెట్లు ఎక్కువగా ఉందని వివరించారు. రాష్ట్రంలో వివిధ రంగాల వృద్ధి రేటు విషయానికి వస్తే 2024-25లో తెలంగాణ జోడింపబడిన స్థూల విలువలో సేవా రంగం 66.3 శాతం, పారిశ్రామిక రంగం 16.4 శాతం, మరియు వ్యవసాయ, అనుబంధ రంగాలు 17.3 శాతం వాటాను కలిగి ఉన్నట్లు వెల్లడించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలు జీఎస్డీపిలో తక్కువ వాటా కలిగి ఉన్నప్పటికీ, రాష్ట్ర మొత్తం శ్రామిక రంగంలో 42.7 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్నాయన్నారు. ఉచిత కరెంట్, రైతు భరోసా, పంట రుణ మాఫీ, నీటి పారుదల ప్రాజెక్టులపై పెట్టుబడులు వంటి ప్రభుత్వ పథకాలు రైతాంగానికి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాయన్నారు. అదే సమయంలో వ్యవసాయ రంగాన్ని పటిష్టవంతం చేసేందుకుగాను, పండ్ల తోటలు, పశు సంరక్షణ, చేపల పెంపకం వంటి అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో శ్రామికశక్తి 68.7 శాతం ఉండగా, దేశీయ సగటు 64.3 శాతం మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఇందులో మహిళల ఉపాధి శాతం 52.7 శాతం ఉండగా, ఇది దేశ సగటు 45.2 శాతం కంటే అధికంగా ఉందన్నారు. మహిళలు, వెనుకబడిన వర్గాలకు తెలంగాణ ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఎంతగా విజయవంతమయ్యిందో ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయని వివరించారు. ప్రజల హృదయాలను ప్రతిబింబించేలా మా ప్రభుత్వ విధానాలు రూపొందించామన్నారు. రైతులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, దినసరి కూలీల నుండి ఐటీ నిపుణుల వరకు ప్రతి ఒక్కరినీ మా అభివృద్ధి పథకాలు బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులుగా, తెలంగాణ భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశం బాధ్యత మనపై ఉందని చెప్పారు. సమిష్టి కృషితో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు, దేశానికే తలమానికంగా తెలంగాణ నమూనాను ఉంచేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ ఉజ్వల భవిష్యత్ మనందరి ఉమ్మడి బాధ్యతగా గుర్తెరగాలని సవినయంగా మనవి చేస్తూ, ఈ బృహత్తర యజ్ఞంలో అందరి సహకారం కావాలని కోరారు.

**అసెంబ్లీ రేపటికి వాయిదా**

తెలంగాణ శాసనసభ శుక్రవారానికి వాయిదా పడింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు సభ తిరిగి ప్రారంభం అవుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన పథకాల బడ్జెట్ కేటాయింపుల విషయానికి వస్తే ఆరు గ్యారంటీల పథకం కింద మొత్తం రూ.56,084 కోట్లు కేటాయించింది. అమలులో ఉన్న రైతు భరోసాకు రూ.18వేల కోట్లు, చేయూత-14,861, ఇందిరమ్మ ఇళ్లు-12,571, మహాలక్ష్మి-4,305, గృహ జ్యోతి (200 యూనిట్లు ఉచిత పవర్)-2,080, సన్న రకం వరి రైతులకు బోనస్-1,800, రాజీవ్ ఆరోగ్య శ్రీ-1,143, మహాలక్ష్మి పథకం కింద ఎల్పీజీ సబ్సిడీ-723, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా-600 కోట్ల చొప్పున కేటాయించారు. అలాగే విద్యుత్ సబ్సిడీ కింద రూ.11,500 కోట్లు, రాజీవ్ యువ వికాసం-6,000 స్కాలర్‌షిప్‌లు & స్టైఫండ్‌లు-4,452, కల్యాణలక్ష్మి / షాదీ ముబారక్-3,683, ఎస్డీఎఫ్, సీడీపీ నిధులు-3,300, బియ్యం సబ్సిడీ -3,000, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్-2,900, డైట్-2,659, పారిశ్రామిక ప్రమోషన్ కోసం ప్రోత్సాహకాలు-1,730, రైతులకు బీమా-1,589, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు- 1,511, గ్రామాల్లో 100శాతం సోలారైజేషన్-1,500, కొత్త ఇంధన విధానాన్ని ప్రోత్సహించడంతో సహా గ్రీన్ ఎనర్జీ-1,000, నగరాభివృద్ధి-1,000, పర్యాటక ప్రాజెక్టులు-721, ఇందిర గిరి జల వికాసం-600, విశ్వవిద్యాలయాలకు మౌలిక సదుపాయాలు-500, ఆర్ అండ్ బి, పీఆర్ కింద రోడ్ల అభివృద్ధి & నిర్వహణ-500, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి సహాయం-రూ.100 కోట్ల చొప్పున బడ్జెట్‌లో నిధులు కేటాయించారు.

# బడుగు, బలహీన వర్గాలకు దగా

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడారు. ఒక్క మాటలో చెప్పాలంటే భట్టి విక్రమార్క సుదీర్ఘ ఉపన్యాసం విన్న తర్వాత మాకు అర్థమైందంటే ఆరు గ్యారెంటీలు గోవిందా గోవిందా అని అర్థమైంది. ఆరు గ్యారెంటీలకు పాతరేశారని స్పష్టంగా అర్థమైంది. ఇది కాంగ్రెస్‌కు రెండో బడ్జెట్. ఈ బడ్జెట్‌ను చూసిన తర్వాత మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ. 2500 నూరు రోజుల్లో ఇస్తామని ఓట్లు వేయించుకుని గెలిచి... ఇప్పుడు మమ్మల్ని మోసం చేస్తున్నారని మహిళలు మండిపడుతు న్నారు. మహిళలు నిరాశలో ఉన్నారు. 4 వేల పెన్షన్ ఇస్తామని చెప్పి పెద్ద మనషులు మోసం చేశారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో నేతన్నలకు పెద్దపీట వేస్తూ రూ. 1200 కోట్ల బడ్జెట్ పెడితే.. ఇవాళ రూ. 370 కోట్లకే పరిమితమైపోయింది. ఆటో డ్రైవర్లు 100 మందికి పైగా ఆత్మహత్య చేసుకున్నారు. వారికి చెప్పిన ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు గురించి అతిగతీ లేదు. వారి గురించి ఒక్క మాట లేదు. స్విగ్గీ, జొమాటో, ఇతర యాప్స్ ద్వారా ఫుడ్ డెలివరీ చేసే బాయ్స్‌కు గిగ్ వర్కర్స్ బోర్డు పెడుతామని చెప్పి మోసం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం చేసి 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు. వారికి ఇంకా ఎక్కువ మేలు, న్యాయం చేస్తామన్నారు. వారి గురించి ఒక్క మాట కూడా బడ్జెట్‌లో చెప్పలేదు. పీఆర్సీ, డీఏల గురించి ప్రస్తావించలేదు. ఆడబిడ్డలకు తీరని తీవ్రమైన అన్యాయం జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. కరోనా వైరస్ కంటే కాంగ్రెస్ వైరస్ ప్రమాదం.. ఇది బడ్జెట్ ద్వారా స్పష్టంగా కనబడుతుందన్నారు.

# బడ్జెట్ ఉగాది పచ్చడిని తలపించింది

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ...కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాకుండా... కేవలం అప్పులపై ఆధారపడి రాష్ట్రాన్ని నడపాలంటే సాధ్యం కాని పని అన్నారు. కేంద్రానికి పన్నులు రాష్ట్రం నుంచి రూపాయి వెళ్తే రాష్ట్రానికి 42 పైసలు మాత్రమే వస్తున్నాయన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రం ఉత్తర ప్రదేశ్‌కి మాత్రం 10 రూపాయలు ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అన్ని చేయాలంటే అల్లాఉద్దీన్ అద్భుత దీపం కావాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలలో పోటీలు పడి వాగ్దానాలు చేశారని... ఇచ్చిన హామీలు అన్ని అమలు చేయాలంటే రూ.5 లక్షల కోట్ల బడ్జెట్ కూడా సరిపోదన్నారు. ఇప్పటికే రూ.8 లక్షల కోట్లకు అప్పు చేరుకుందని, ఉన్నంతలో ప్రాక్టికల్‌గా ప్రభుత్వం బడ్జెట్ తీసుకొచ్చిందన్నారు. రుణమాఫీ ఇప్పుడు ఉండదు కాబట్టి ప్రభుత్వానికి కలసి వస్తుందని... రూ.56 వేల కోట్లు హామీల అమలు కోసం పెట్టారన్నారు. ఇది కొంత బెటర్‌మెంట్ అని, ఇరిగేషన్‌కు రూ.23,354 కోట్లు మాత్రమే పెట్టారని... అన్ని పూర్తి కావాలంటే ఈ నిధులు సరిపోవన్నారు. కాళేశ్వరం పునర్నిర్మాణం చేయాలంటే ఇంకా ఎక్కువ అవుతుందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కి రూ.2,900 కోట్లు మాత్రమే కేటాయించారని... వాస్తవానికి రూ.11,600 కోట్లు కేటాయించాలన్నారు. వైద్య రంగానికి కేవలం 6శాతం మాత్రమే కేటాయింపులు చేశారని అవి కూడ సరిపోవన్నారు. విద్యారంగానికి 7.5శాతం మాత్రమే కేటాయింపులు చేశారని, కనీసం బడ్జెట్‌లో 20శాతం నిధులివ్వాల్సి ఉందని కూనంనేని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కేటాయింపులు బాగానే చేసిన ఖర్చు చేస్తారా లేదా చూడాలన్నారు. బడ్జెట్ చేదు, తీపీ కలగలుపుగా ఉగాది పచ్చడిగా మాదిరిగా ఉందన్నారు. ఆదాయ మార్గాలు ప్రభుత్వం వెతుక్కోవాలని, జర్నలిస్టులకు పని భద్రత లేదన్నారు. ప్రతి వర్గానికి ఆర్థికంగా, ఉద్యోగ భద్రత ప్రభుత్వం కల్పించాలని, సగం మందికి బడ్జెట్ ఫలితాలు అందవని తాను భావిస్తున్నట్లు తెలియజేశారు.

## ప్రజల ఆశలకు అనుకూలంగా లేని రాష్ట్ర బడ్జెట్

విశాలాంధ్ర - ఖమ్మం : రాష్ట్ర ఆర్థిక మంత్రి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఈరోజు ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆశలకు తగ్గటుగా లేదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. 304965 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజల ఆశలు నెరవేర్చడానికి సరిపోదని ఉన్నంతో ప్రాక్టికల్‌గా బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికి ఆచరణలో ప్రజల ఆశల నెరవేర్చేవిధంగా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో మార్గం చూపించలేదన్నారు. హామీల అమలు కోసం 56 వేల కోట్లు కేటాయించిడం ఆహ్వానించదగి నప్పటికీ మిగిలిన హామీల అమలు నెరవేర్చేపరిస్థితి లేదన్నారు ఇరిగేషన్‌కు సాగునీటి రంగానికి 23 వేల 354 కోట్లు మాత్రమే కేటాయించడం వలన ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయ్యే పరిస్థితి లేదన్నారు. విద్యా రంగానికి 7.5% వైద్య రంగానికి కేవలం 6% కేటాయించడం ఆ రంగాలను చిన్న చూపు చూసారు అన్నారు. ఇప్పటికే 8 లక్షల కోట్లకు చేరుకున్న అప్పు మళ్ళీ అప్పుల పైన ఆధారపడితే రాష్ట్రన్ని నడపడం సాధ్యం కాదని కేంద్రం నుంచి పన్నులలో వాటాని ఎక్కువ సదించెందుకు గట్టి కృషి చేయాలన్నారు. వ్యవసాయ రంగానికి 24 వేల 439 కోట్లు కేటాయించిన ఎక్కువ భాగం రైతుబంధుకే పోతుందని పంటల భీమా పథకం, పంటలకు బోనస్‌కు వ్యవసాయ రంగాన్ని గట్టు ఎక్కించేందుకు ఈ నిధులు సరిపోవన్నారు. ఎస్‌సి, ఎస్‌టి లకు కేటాయింపులు బాగాన్ని చేసినప్పటికి ఖర్చు చేస్తారో లేదో అనుమానం వ్యక్తం చేసారు. మొత్తం మీద బడ్జెట్ ఆశ నిరాశ చేదు తీపి కలయికగా ఉందన్నారు.

## విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర - కొమురం భీం : పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిసిడివో శకుంతల అన్నారు. బెజ్జూర్, చింతలమానపల్లి మండలాల్లోని కుంటలమానపల్లి బాబాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలను జిసిడివో శకుంతల ఏటిడిఓ కమర్ హుస్సేన్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు పలు సలహాలు సూచనలు తెలిపారు. పరీక్షలు అంటే భయపడవద్దని పట్టుదలతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని. విద్యార్థులకు హాల్ టికెట్ నెంబర్లు అందజేశారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు.

## సంక్షేమానికి కేటాయింపులు తగ్గడం శోచనీయం

విశాలాంధ్ర - ఖమ్మం : సంక్షేమ రంగానికి బడ్జెట్లో కేటాయింపులు తగ్గడం శోచనీయమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. బడ్జెట్‌పై జిల్లా ప్రజలు అనేక ఆశలు పెంచుకున్నా రని ఆశలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన జరగ లేదని ఆయన తెలిపారు. బడ్జెట్‌పై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పక్షాన సురేష్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ఈ బడ్జెట్ దోహదం చేసే దిశగా లేదన్నారు. గత బడ్జెట్తో పోల్చినప్పుడు వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెరిగినా రైతు భరోసాకే సగం బడ్జెట్ సరిపోతుందని గ్రామ పంచాయతీలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న వేళ పంచాయతీరాజ్ శాఖకు నిధుల కేటాయింపు తగ్గించడం శోచనీయమన్నారు. నీటిపారుదల శాఖకు కేటాయించిన బడ్జెట్ను చూస్తే సీతారామ ప్రాజెక్టు నిర్మాణం మరి కొంత కాలం జాప్యం జరిగే అవకాశం కనిపిస్తుం దన్నారు. బడ్జెట్లో అంకెల గారడీ లేకపోయినా వాస్తవ కేటాయింపులు ఆశించిన స్థాయిలో లేవన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ముందు మహిళలకు పేద, మధ్యతరగతి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేవిధంగా బడ్జెట్ రూపకల్పన చేసి ఉండాల్సి ఉందన్నారు. మరో పక్క కేంద్రం వివక్ష ప్రదర్శిస్తున్న తరుణంలో హామీల అమలు కూడా ఒక సవాల్ గానే మారుతుందని సురేష్ అభిప్రాయపడ్డారు. సంక్షేమ రంగాలకు కేటాయించిన దానిలో ఎటువంటి కోతలు లేకుండా చూడాలని సురేష్ కోరారు. వ్యవసాయ, వైద్య, విద్య, సంక్షేమ రంగాలకు కేటాయింపులపై కమ్యూనిస్టు పార్టీ అసంతృప్తి వ్యక్తం చేస్తుందని ఆయన తెలిపారు.

## బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

విశాలాంధ్ర - ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే విద్యార్థి వ్యతిరేక బడ్జెట్ గా అనిపిస్తోందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం గిరి ప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 7.57శాతం నిధులు కేటాయించడం విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి తెలుస్తోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ గత సంవత్సరం ఈ సంవత్సరానికి 0.2 శాతం మాత్రమే కేటాయించడం దారుణం అన్నారు. సుమారుగా 11,600 కోట్ల రూపాయలను కేటాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం అధిక నిధులు కేటాయించి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ జిల్లా ఉపాధ్యక్షులు కౌశిక్ జిల్లా నాయకులు మనోజ్ గణేష్ ప్రతాప్ గోపి సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సభలు ప్రజలకు గొప్ప అవకాశం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ప్రకృతి - ఆరోగ్య మహాసభలు కొత్తగూడెంలో జరగడం జిల్లా ప్రజలకు గొప్ప అకాశమని ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు, జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు అన్నారు. ఈనెల 23 ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో జరుగనున్న ప్రకృతి ఆరోగ్య మహాసభల కరపత్రాలను, ఆశ్రమ సభ్యులతో కలిసి, బుధవారం ఆయన తన చాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలందరికీ, శారీరక, మానసిక, సామాజిక ఆరోగ్యాన్ని, ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ విషయాలను తెలియచేసేందుకు ఈ సభలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సభలలో ప్రకృతి కవి జయరాజు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ కరపత్రాల ఆవిష్కరణలో, సభల కో-ఆర్డినేటర్ జి.సుగుణారావు, గ్రీన్ అంబాసిడర్ మొక్కల వెంకటయ్య, శోభారాణి, దయానందసాగర్, బంగారి శంకర్, టి.రాయాలింగు, కె.రమేష్ బాబు, తుంపురు శివ, ముబారక్, దశరథ్‌లు పాల్గొన్నారు.

# పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి : కలెక్టర్

విశాలాంధ్ర -జిల్లా బ్యూరో మహబూబాబాద్: రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని, పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యకి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్రాఫ్ లోన్స్ 69.50 శాతం, అగ్రికల్చర్ టర్మ్ లోన్స్ 107.44 శాతం, స్వయం సహాయక సంఘాల రుణాలు 109.48 శాతం లక్ష్యాలను పూర్తి చేశారన్నారు. పూర్తి స్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలని, రుణ పంపిణీ లక్ష్యాన్ని అధిగమించాలని అన్నారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోతున్నాయని అన్నారు. ఆర్బీఐ ఎల్.డీ.ఓ సాయి చరణ్ రెడ్డి, డీఆర్డీఓ మధుసూదన రాజు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సత్యనారాయణమూర్తి, నాబార్డు ఏజీఎం చంద్రశేఖ, డి ఏ ఓ విజయనిర్మల, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డి హెచ్ ఓ మరి యాన్న, మెప్మా పీడీ విజయ, ట్రైబల్ వెల్ఫేర్ దేశి రామ్ నాయక్, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ శ్రీమన్నారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ రుసుము వసూలు ప్రక్రియ వేగవంతం చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమురం భీం : లే-అవుట్ భూముల క్రమబద్ధీకరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఎల్ ఆర్ ఎస్-2020 పథకంలో అర్హులైన అభ్యర్థుల నుండి రుసుము వసూలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి వార్డు అధికారులు, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులతో అర్హులైన అభ్యర్థులలో ఈనెల 31వ తేదీ వరకు రుసుము చెల్లించే వారికి కల్పించే 25 శాతం రుసుము మినహాయింపు అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ ఆర్ ఎస్-2020 పథకంలో భాగంగా లే-అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అర్హత కలిగిన ప్రతి అభ్యర్థులకు సమాచారం అందించి సకాలంలో రుసుము చెల్లించే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి సందర్శించి విద్యార్థులకు కల్పించిన వసతులు, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-తొర్రూరు: తెలంగాణ అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్,ఎస్సీ వర్గీకరణ బిల్లులను ఆమోదించి, రాష్ట్రంలో నిరుద్యోగ యువతి యువకులకు శిక్షణ ఇచ్చి ఆర్థికంగా రుణ సదుపాయం కల్పించి, వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి రాజీవ్ యువవికాస్ పథకం తెచ్చినందు హర్షం వ్యక్తం చేస్తూ పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి అనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్‌ల ఆధ్వర్యంలో తొర్రూరు డివిజన్ కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో బుధవారం కాంగ్రెస్ శ్రేణులు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బిసీ మంత్రి పొన్నం ప్రభాకర్, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలకు అన్ని విధాలు అని న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డిల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, పెదగాని సోమయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు మంగళపల్లి రామచంద్రయ్య, జీనుగా సురేందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలు పింగిలి ఉష, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు గంజి దేవేందర్ రెడ్డి, తాళ్లపల్లి బిక్షం గౌడ్, బచ్చలి లక్ష్మణ్, వెంకన్న యాదవ్, దొంగరి శంకర్, వెన్నెం సోమిరెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్, ముదసాని సురేష్, గూడేల్లి రామచంద్రయ్య, వెంకట్ రెడ్డి, నాగిరెడ్డి, జలీల్, అరవింద్, వెలుగు మహేశ్వరి, సహదేవ్, మోకాటి వెంకన్న, రమేష్ నాయక్, మేఘ్యా నాయక్, శ్రీనివాస్ గౌడ్, దీకొండ మధు, రోహిన్ కుమార్, అమల పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్ ఇఫ్తార్ విందు

### సింగరేణి ఏరియా జియం షాలేం రాజు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ప్రపంచంలోనే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన భారత దేశంలో కుల మతాలకు అతీతంగా సోదరాభవంతో కలిసి మెలిసి జీవించి నప్పుడే సమాజం శాంతి సామరస్యలతో మనుగడ సాగిస్తుందని సింగరేణి కొత్తగూడెం ఏరియా జియం షాలేం రాజు అన్నారు. చుంచుపల్లి మండలం రుద్రంపూర్ లోని మస్జిద్ ఏ ఖుభాలో జమాతే ఇస్లామి హింద్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జియం మాట్లాడుతూ శతాబ్దాల నుండి ఒకరి పండుగలను మరోకరు గౌరవించుకునే సంస్కృతి, సాంప్రదాయం కూడా మన భారత దేశంలోనే కొనసాగుతుందన్నారు. రంజాన్ మాసంలోని కఠోరమైన ఉపవాసాలు మనిషిలో ఆకలి దప్పుల బాధలు తెలుస్తాయని, తద్వారా వ్యక్తి నిర్మాణం, న్యాయం ధర్మం తోటి వారిపట్ల ఆప్యాయత, అనురాగాలు పెంపొందుతాయాన్నారు. మరో అతిధి యస్.ఓ.టు జియం కోటి రెడ్డి మాట్లాడుతూ మతాలు వేరైనా మనమంతా భారతీయులమన్నారు. రంజాన్ ఉపవాసాలు మానవతా విలువలు పెంచే కఠోరమైన ఆచరణ అన్నారు. జెఐహెచ్ అధ్యక్షుడు షేఖ్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ ఏడాదికి ఒకసారి వచ్చే రంజాన్ ఉపవాసాలు మనిషి లోని అహంకారాన్ని పోగొట్టి తోటి వారి కష్టాలను గమనించే ఆచరణాత్మకమైన విధానం నేర్పుతుందన్నారు. దైవం వైపు ఋజు మార్గం చూపే బోధనలు, ఆచరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐయన్టియుసి ఏరీయా ఉపాధ్యక్షుడు రజాక్, కరుణాకర్, రావూరి శంకర్, గూడెల్లి యాకయ్య, షమీం, అలం, సోనూ బాయ్, షబ్బీర్, రబ్బానీ, కరీం తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం : సీఐ

విశాలాంధ్ర - పినపాక : గంజాయి రహిత సమాజం లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఈ.బయ్యారం సిఐ వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం మండలంలోని క్రాస్ రోడ్‌లో గల ఎక్సలెంట్ స్కూల్ విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగే లక్ష్యాలను పెట్టుకొని క్రమశిక్షణతో ముందుకంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రధానంగా మన చుట్టూ గంజాయి, డ్రగ్స్ వంటివి విక్రయించే లేదా వాడుతున్న వారుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గంజాయి సాగు, వినియోగం, రవాణాకు పాల్పడితే తీవ్రమైన శిక్షలు అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## 15 క్వింటాళ్ల పీడీయస్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలపరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రవీంధర్ తెలిపారు. అనంతరం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బక్కయ్యగూడెం గ్రామం నందు పీడీయస్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతుండగా ఎస్ఐ తన సిబ్బందితో కలసి 15 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని, TS 08DP TR 5888 నెంబర్ గల ట్రాలీ వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నారు. పిండిపోలు పర్వతాలు, నాగులపాటి అన్నారం గ్రామం పెన్ పహాడ్ మండలం ప్రస్తుత నివాసం తాళ్ళగడ్డ, మిర్యాలగూడ టౌన్, నల్గొండ జిల్లా, పాలకీర్తి రమణ, భర్త శ్రీను, కంభంపాడు గ్రామం, మేడారం మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుత నివాసం తాళ్ళగడ్డ, మిర్యాలగూడ టౌన్, నల్గొండ జిల్లా ఇద్దరినీ పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకి పంపిస్తున్నట్లు తెలిపారు. దాచేపల్లికి చెందిన ఇద్దరు నేరస్తులు లింగయ్య, అశోక్‌లు పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## సమన్వయంతో విధులు నిర్వర్తించాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: అందరు సమన్వయంతో క్రమశిక్షణ, ప్రణాళికబద్ధంగా విధులను నిర్వర్తించాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. బుధవారం రామగుండం కమిషనరేట్ ఏఆర్ సిబ్బంది, అధికారులకు కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రజా దర్బారులో కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పాల్గొని, ఏఆర్ పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను వెంటనె పరిష్కరించే విధంగా చూస్తామని అన్నారు. ఎలాంటి సమస్య ఉన్న దర్బార్‌లో చెప్పడం ఇబ్బందిగా ఉంటే ఆఫీస్‌కి వచ్చి నేరుగా కలిసి చెప్పవచ్చు అన్నారు. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని కోరారు. వ్యక్తిగత కారణాలతో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లు చాలా ప్రమాదకరమని, కొన్ని సందర్భాల్లో ఒత్తిళ్లు తట్టుకోలేక క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకునే ముందు కుటుంబం గురించి ఆలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, వామన మూర్తి, సంపత్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సాయిస్ఫూర్తి విద్యార్థులు

విశాలాంధ్ర - సత్తుపల్లి : జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ బుధవారం విడుదల చేసిన బీటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలలో మండల పరిధిలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఊటుకూరు శేషారత్న కుమారి తెలిపారు. కళాశాల విద్యార్థులు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కళాశాల ఘనతను పునరావృతం చేసారని అన్నారు. హైటెరో అధినేత, రాజ్యసభ సభ్యుడు, కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారధి రెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విత వర్చువల్‌గా మాట్లాడుతూ బీటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించారు. కళాశాల సెక్రటరీ కరస్పాం డెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పట్టుదల ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. కళాశాల సైన్స్ హ్యుమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ షేక్.మీరాసాహెబ్, పరీక్షల విభాగాధిపతి డాక్టర్ పాముల.శేఖర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్, సియస్ఈ విభాగాధిపతి డాక్టర్ షేక్ యాకూబ్ విద్యార్థులను అభినందించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ

విశాలాంధ్ర -జిల్లా బ్యూరో మహబూబాబాద్: ఆన్లైన్ బెట్టింగ్స్, సైబర్ క్రైమ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలని, అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. బుధవారం జిల్లాలోని నర్సింహులపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ, సిబ్బంది బస చేసే ప్రాంతాలు, స్టేషన్ గదులు పరిశీలించి, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. తదుపరి దర్యాప్తు వేగవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ఉండాలని, ప్రతి కేసును నిష్పక్షపాతంగా, నాణ్యతతో దర్యాప్తు చేయాలని ఎస్ హెచ్ ఓ కు సూచనలు ఇచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ నుంచి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటించాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

## విద్యారంగానికి నిరాశ మిగిల్చిన బడ్జెట్

### సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం : గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు భిన్నంగా ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఆశాజనక బడ్జెట్ను ప్రవేశ పెట్టిందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాష అన్నారు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వం అంకెల గారడీ బడ్జెట్ తప్ప పేదలకు విరిగిందేమి లేదన్నారు. ప్రస్తుత బడ్జెట్ వాస్తవానికి దగ్గరలో ఉందన్నారు. గత బడ్జెట్ కంటే రూ.14,505 కోట్లు తగ్గుదలతో బడ్జెట్ ప్రెవేశపెట్టడం ఇందుకు నిదర్శనమని సాబీర్ చెప్పారు. అసెంబ్లీలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆయన స్పందిస్తూ ఆరు గ్యారంటీలకోసం 56 వేల కోట్లు కేటాయించడం ఆహ్వానించదగిన విషయమన్నారు. వ్యవసా రంగానికి బడ్జెట్ పెంచి, సాగునీటి ప్రాజెట్లులకు కేవలం రూ.23వేల కోట్లు మాత్రమే కేటాయించడం సరైంది కాదన్నారు. విద్య, వైద్య రంగాలకు, సంక్షేమ రంగానికి ఈ బడ్జెట్ లో కూడా అన్యాయం చేశారని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రం రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోందన్నారు. అప్పులు తెస్తేనే రాష్ట్ర నడిచే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. ఎస్సి ఎస్టీ లతోపాటు ఆయా రంగాలకు కేటాయించిన బడ్జెట్లోని ప్రతి పైసా పూర్తి స్థాయిలో ఖర్చుచేస్తేనే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరిస్తారన్నారు.

## కంటి సమస్యలకు పోషకాహారాన్ని తీసుకోవాలి

విశాలాంధ్ర - గార్ల : విద్యార్థులు ఆకుకూరలు, క్యారెట్ లాంటి సరైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటే కంటి సమస్య నుండి బయటపడే అవకాశం ఉందని మండల వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయలో కంటి పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జరిగిన ప్రత్యేక కంటి చూపు స్క్రీనింగ్ పరీక్షలు చేయడం జరిగిందన్నారు. అందులో 21 (రిఫ్రాక్టివ్ ఎర్రర్) కంటి చుపు సమస్యతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించినట్లు చెప్పారు. దానిప్రకారం 21 మందికి కంటి అద్దాలను అందించటం జరిగిందని తెలిపారు. ముగ్గురు విద్యార్థులు ఇతర తీవ్ర కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ పంపడం జరిగిందన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు అందుబాటులోని సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యమంలో ఆర్‌బిఎస్‌కె వైద్యులు డాక్టర్ సాయి లక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ ఉషా రాణి, డాక్టర్ కోట్య నాయక్, సిబ్బంది తారా, సుందర్ లాల్, లెవిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ సందీప్‌ను సన్మానించిన ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ -1 పరీక్షా ఫలితాల్లో 502.5 మార్కులను సాధించిన ఇల్లందు ఎస్సై సందీప్ ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఇల్లందు పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూనే కష్టపడి మంచి ఫలితం సాధించిన సందీప్ ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సాధారణ వ్యవసాయ కుటుంబం నుండి వచ్చి ప్రస్తుత పోటీ ప్రపంచంలో మంచి ప్రతిభ కనబరిచి సందీప్ భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయిలో ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి చంద్రభాను, ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో పేదలకు ఒరిగిందేమీ లేదు : న్యూడెమోక్రసీ

విశాలాంధ్ర - కొత్తగూడెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశట్టిన బడ్జెట్‌లో పేదలకు విరిగింది ఏమిలేదని సిపిఐ ఎమ్ఎల్ న్యూడేమోక్రసి జిల్లా సహా కార్యదర్శి గౌని నాగేశ్వరరావు విమర్శించారు. బుధవారం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు అన్యాయం చేసారన్నారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 304965 కోట్లు కేటాయిస్తే దీంట్లో రైతులకు, విద్యా ఉపాధికి, వైద్యానికి అతి తక్కువ బడ్జెట్ కేటాయించడం దారుణమన్నారు. ఏజెన్సీ పోడు భూములకు ఉపయోగపడే సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి పనులు చాలా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. పూర్తిగా అవడానికి బడ్జెట్ కేటాయించలేదన్నారు. కార్మిక, పారిశ్రామిక రంగంగా పేర్కొందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకి మొండి చేయి చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదన్నారు. దీనితో పేదలకు ఒరిగింది ఏమీ లేదని అన్నారు. రోడ్లు భవనాల పేరుతో కేటాయించిన నిధులు సరిపోవన్నారు. ఈ బడ్జెట్‌లో రోళ్ళపాడు రిజర్వాయర్ ప్రాజెక్టు, తుమ్మలచెరువు రిజర్వాయర్, సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రత్యేక నిధులను కేటాయించాల్సి ఉండగా దగా చేసారని విమర్శించారు.

## కులాంతర వివాహం చేసుకున్న జంటకు రక్షణ కల్పించాలి

విశాలాంధ్ర - ఇల్లందు : కులాంతర వివాహం చేసుకున్న జంటకు ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం రక్షణ కల్పించాలని టిఎంఆర్పిఎస్ నాయకులు కోరారు. మానుకోట జిల్లా కేసముద్రం మండలంలోని క్యాంపు తండాకి చెందిన దారావత్ మమత తొ అదే గ్రామానికి చెందిన కందిపాటి తరుణ్ మాదిగకు కులాంతర వివాహం జరిగింది. కొంతకాలంగా ప్రేమించుకుంటున్న వీరు మంగళవారం ఇల్లందులోని చెరువు కట్ట పెద్దమ్మ తల్లి దేవాలయంలో ఎమ్మార్పీఎస్ మహిళా కమిటీ, స్థానిక యూత్ కమిటీ ఆధ్వర్యంలో కులాంతర వివాహం చేసుకున్నారు. అనంతరం మమత తల్లిదండ్రులు, బంధువుల నుండి ప్రాణ భయం ఉందని తరుణ్ మాదిగ అన్నారు. గతంలో కులాంతర వివాహం చేసుకున్న జంటని పరువు హత్య జరిపిన సందర్భం ఉందని మేజర్లైన ఈ జంట ఇల్లందు కోర్టు న్యాయమూర్తికి, ఇల్లందు పోలీసులకు బుధవారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ జంటకు జిల్లా కలెక్టర్, ఎస్పీ రక్షణ కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు వంగూరి దేవమ్మ, బోశాల ఉపేంద్ర, బొజ్జ రాణిలు కోరుతున్నారు.

సంపాదకీయం

# అంతరిక్ష చరిత్రలో మరో మైలు రాయి

భారత సంతతికి చెందిన సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్ బుధవారం అర్థ రాత్రి అంతరిక్షం నుంచి భూమి మీదకు చేరుకోవడం మానవ పట్టుదలకు నిదర్శనం. మామూలుగా అయితే వారు అంతరిక్ష పరిశోధనా కేంద్రంలో వారం రోజులే ఉండాల్సింది. కానీ సాంకేతిక కారణాల వల్ల తొమ్మిది నెలలు అంతరిక్షంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఇంత సుదీర్ఘ కాలం అంతరిక్షంలో చిక్కుపడి పోయినా వారు ఏ క్షణంలోనూ ధైర్యం కోల్పోలేదు. అక్కడ ఉన్నంత కాలం ఏవో పరీక్షలు, ప్రయోగాలూ చేస్తూనే ఉన్నారు. వారి దృఢ దీక్ష, చేసిన ప్రయోగాలు భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు ఉపకరిస్తాయి. ముందు అనుకున్నట్టు ఈ వ్యోమగాములు ఇద్దరూ ఎనిమిది రోజులే అంతరిక్షంలో ఉండాల్సింది. కానీ సాంకేతిక కారణాలవల్ల మరో 278 రోజులు ఉండిపోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఈ వ్యోమగాములు భూమి చుట్టూ 4,576 సార్లు ప్రదక్షిణం చేశారు. 195 మిలియన్ కిలోమీటర్ల మేర ప్రయాణించారు. సునీత విలియమ్స్ భారత సంతతికి చెందిన వారు. ఆమె తండ్రి దీపక్ పాండ్యా దశాబ్దాల కిందట అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడిపోయారు. సునీతా విలియమ్స్ సురక్షితంగా చేరుకున్నందుకు భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) అధిపతి వి.నారాయణన్ అభినందించారు. ఆమె పడ్డ కష్టం, గడించిన అనుభవం, చూపిన నైపుణ్యం, చేసిన ప్రయోగాలు ఉపయోగపడతాయని ఆయన అన్నారు. వీరిని అంతరిక్షం నుంచి తీసుకు రావడానికి మరో వ్యోమ నౌకలో వెళ్లిన నిక్ హేగ్, రాస్కోస్మోస్, అలెగ్జాండరు గుర్బనోవ్ కూడా సురక్షితంగా తిరిగి వచ్చారు. 2023లో సునీత తన పూర్వీకుల స్వస్థలమైన గుజరాత్ వెళ్లినప్పుడు ప్రధానమంత్రి మోదీని కలవలేదు. ఆమె సొహ్రాబుద్దీన్ కేసుతో సంబంధం ఉన్న హరేన్ పాండ్యాకు బంధువు. సునీత గుజరాత్‌లో గడిపిన ఒక రోజంతా హత్యకు గురైన హరేన్ పాండ్యా భార్య జాగ్రుటి పాండ్యాతోనే గడిపారు. అంతరిక్షంలో చిక్కుకు పోయినప్పటికి సునీత, బుచ్ విల్మోర్ ఏ మాత్రం ఆత్మ స్థైర్యం కోల్పోలేదు. అపారమైన ఆశావాదం ప్రదర్శించలేదు. ఈ రెండూ లేనప్పుడు శాస్త్ర పరిశోధనలు ఎలా సఫలమవుతాయిగనక. అంతరిక్షంలో దిగబడిపోయిన సమయాన్ని ఈ వ్యోమగాములు ఒక అవకాశంగా మార్చుకుని శాస్త్ర ప్రయోగాల్లో నిమగ్నమయ్యారు. గమనించవలసిన విషయం ఏమిటంటే మన దేశంలో సకల వ్యవహారాలను, కడకు శాస్త్ర ప్రయోగాలనూ మోదీ ఘనతగా మలచడానికి ప్రయత్నిస్తారు. కానీ సునీత, విల్మోర్ తిరుగు ప్రయాణంపై ప్రత్యక్ష ప్రసారం చేసినప్పుడు నాసా వ్యాఖ్యాత రాబ్ నావియస్ ఎలాంటి భావోద్వేగాలకు లోనుకాకుండా ప్రశాంతంగా వ్యాఖ్యానం కొనసాగించారు. తొమ్మిది నెలల పాటు వ్యోమగాములిద్దరూ అంతరిక్షంలో ఉండడం రికార్డులను బద్దలు కొట్టే వ్యవహారం ఏమీ కాదని రాబ్ వ్యాఖ్యానించారు. ఇంతకు ముందు కూడా అంతరిక్ష యాత్రికులు 289 రోజుల నుంచి 371 రోజులు అంతరిక్షంలో గడిపిన ఉదంతాలు ఉన్నాయని ఆయన విడమర్చారు. అంతరిక్షంలో మానవ సంచారం లేని రోజు ఒక్కటి కూడా ఉండదు. వచ్చే నవంబర్ లోనే అంతరిక్ష పరిశోధనా కేంద్రంలో మనిషి ఉండడానికి సంబంధించి 25 ఏళ్లు పూర్తి కానున్నాయి. మన దేశమూ అనేక అంతరిక్ష ప్రయోగాలు చేసింది. మోదీ అధికారంలోకి వచ్చే దాకా ఇవన్నీ కేవలం అంతరిక్ష పరిశోధకులకు పరిమితమైన అంశాలుగానే ఉన్నాయి. రాజకీయ నాయకుల హడావుడి ఎక్కడా కనిపించలేదు. కానీ మోదీ ప్రధానమంత్రి అయిన తరవాత శాస్త్రవేత్తల సాఫల్యాన్ని కూడా మోదీ ఘన విజయంగా చెలామణి చేయడం మొదలైంది.

2019 ఆగస్టు 20వ తేదీన చంద్రయాన్ 2 ప్రయోగం జరిగిన సమయాన్ని గుర్తు చేసుకుందాం. అప్పుడు చంద్రయాన్ ప్రయోగం జరగడాన్ని మోదీ తన సొంత ప్రచారం కోసం మహత్తర అవకాశంగా వినియోగించుకున్నారు. చంద్రయాన్ ప్రయోగాన్ని దేశ వ్యాప్తంగా ఉత్సాహపూరిత అంశంగా మార్చేశారు. శాస్త్ర విజయాలపై గర్వించడం వేరు. ఇది తమ ప్రతాపమే అన్నట్టుగా ప్రచారం చేసుకోవడం వేరు. కానీ చంద్రయాన్ 2 ప్రయోగం మోదీ ఘనత అని ప్రచారం చేశారు. చంద్రయాన్ 2 ప్రయోగ సమయంలో ఇస్రో కెమెరాలు ప్రధానమంత్రి మోదీ ముఖాన్ని చూపించడం మీద ఎక్కువ శ్రద్ధ చూపాయి. చంద్రయాన్ 2 ప్రయోగం విఫలమైంది. ఆ రోజు ప్రయోగ వైఫల్యం గురించి అప్పటి ఇస్రో అధిపతి శివన్ ప్రధానమంత్రి మోదీకి వివరిస్తున్న దృశ్యాలు పదే పదే చూపించారు. శివన్ బుజం మీద చేయి వేసి శివన్‌ను అనునయిస్తున్న దృశ్యాలూ ప్రధానంగానే చూపించారు. చంద్రయాన్ ప్రయోగ సమయంలో వెళ్లకూడదని కూడా మోదీకి సలహా ఇచ్చారు. కానీ మోదీకి ప్రచారార్భాటం ఎక్కువ కనక వెళ్లనే వెళ్లారు. ప్రధానమంత్రే స్వయంగా ప్రయోగ సందర్భంలో హాజరైనప్పుడు ప్రయోగ విశేషాలు చూపడం మీద దృష్టి కేంద్రీకరించకుండా మోదీ ముఖారవిందాన్ని పదే పదే చూపడానికే కెమెరాలను వినియోగించుకున్నారు. మోదీ శివన్‌ను ఓదార్చడంతో సరిపెట్టుకోలేదు. చంద్రయాన్ ప్రయోగ వైఫల్యానికి బాధ్యత తనదే అని నిఖిల్ కామత్‌కు ఇచ్చిన పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో చెప్పుకున్నారు. దీన్ని సునీత, విల్మోర్ అంతరిక్షం నుంచి తిరిగి వస్తున్నప్పటి ప్రత్యక్ష ప్రసారంతో పోల్చి చూడొచ్చు. ఆ సందర్భంలో ప్రత్యక్ష ప్రసార వ్యాఖ్యాత ఒక్క సారి కూడా ట్రంప్ పేరు కానీ ఎలాన్ మస్క్ పేరుగానీ ఎత్తనే లేదు. నిరంతరం ఆ వ్యోమ నౌక భూమికి చేరుకుంటున్న వైనం గురించే చెప్పారు. చంద్రయాన్ వైఫల్యం మోదీ తన ఖాతాలో ఎందుకు వేసుకున్నారో తెలియదు. అది సఫలమై ఉంటే మరెంత హడావుడి చేసే వారో! చంద్రయాన్ వైఫల్యం రాజకీయ, పరిపాలనా పరమైన వైఫల్యం కాదుగా! మన అంతరిక్ష పరిశోధనల్లోనూ అనేక వైఫల్యాలున్నాయి. వాటికి బాధ్యత తమదేనని అప్పటి ప్రధానమంత్రులెవరూ చెప్పలేదు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలవల్ల షేర్ మార్కెట్‌లో జనం లక్షలు కోట్లు కోల్పోతున్నప్పుడు, మంటల్లో నెలల తరబడి అగ్ని జ్వాలలు చెలరేగుతున్నప్పుడు వాటికి మోదీ బాధ్యత స్వీకరించలేదుగా. నిజానికి అవి రాజకీయ, పరిపాలనా పరమైన వైఫల్యాలు. వీటి బాధ్యత కచ్చితంగా ప్రభుత్వాధినేతగా మోదీదే. కానీ అలాంటి సందర్భాలలో ఆయన బాధ్యత నుంచి తప్పించుకుంటారు. చంద్రయాన్ 3 ప్రయోగిస్తున్నప్పుడు మోదీ దక్షిణాఫ్రికాలో ఉన్నారు. అయినా మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ప్రయోగంలో భాగస్వాములయ్యారు. త్రివర్ణ పతాకాన్ని అటూ ఇటూ ఊపుతూ కనిపించారు. ఆ సమయంలోను ఇస్రో కెమెరా సగం తెరమీద చంద్రయాన్ ప్రయోగాన్ని, మరో సాగం మోదీ జెండా ఊపడాన్ని చూపించింది. చంద్రయాన్ ను విజయవంతంగా ప్రయోగించిన క్షణంలోనూ మోదీ ముఖమే చూపించారు. ఈ ప్రయోగం సఫలం కావడం అమృత కాలంలో కురిసిన అమృత వర్షం అని ఉపన్యాసమూ ఇచ్చారు. మోదీ దృష్టిలో కాదేదీ ప్రచారార్హం.

# వక్రబుద్ధిని మార్చుకోని పాక్

పార్థసారథి

మీరు పెరట్లో పాములను పెంచుతూ అవి పక్క ఇంటివాళ్లని మాత్రమే కాటేయాలని ఆశిస్తే అంతకంటే పొరపాటు ఉండదని అమెరికా విదేశాంగ శాఖ మంత్రిగా పనిచేసిన హిల్లరీ క్లింటన్ ఓ సందర్భంలో పాక్ పైన వ్యాఖ్యానించారు. పాక్‌లో ఇప్పుడు వరుసగా జరుగుతున్న సంఘటనలను చూస్తూంటే ఆమె చేసిన వ్యాఖ్యలు ఎంత సమంజసమైనవో అర్థం అవుతుంది. తీవ్రవాదులను పెంచి పోషించిన పాక్ ఇప్పుడు దాని విషఫలితాలను అనుభవిస్తోంది. ఆర్థిక సంక్షోభానికి తోడు శాంతి భద్రతల సమస్య, పాక్ సైన్యం తుడిచిపెట్టుకుపోవటం వంటివి కలవరపరుస్తున్నాయి. సొంత ఇంటిని చక్కదిద్దుకోలేని పాక్ భారత్ పైన బురద చల్లుతోంది. ఈ అకృత్యాల వెనక భారత్ హస్తం ఉందని నిందిస్తోంది.

అసలు పాక్‌లో ఏం జరుగుతోందో చూద్దాం. అయిదు రోజుల వ్యవధిలో బెలూచిస్తాన్‌లో రెండు అతి పెద్ద సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ రెండు సంఘటనలు పాక్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఐఎస్ఐని అపహాస్యం చేసేలా ఉన్నాయి. పాక్ మిలటరీ ఈ ప్రాంతంలో పట్టు కోల్పోతున్నదని అర్థం అవుతోంది. బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ పాసింజర్ రైలును హైజాక్ చేసి 36 గంటలపాటు ప్రయాణికులను బందీలుగా చేసి పాకిస్థాన్‌ను గడగడలాడించింది. ఈ సంఘటనలో 31 మంది పాక్ సైన్యం మరణించారు. ఇదే సంస్థ అయిదు రోజుల తర్వాత మరో విధ్వంసకర సంఘటనకు పాల్పడింది. కనీసం 7 బస్సులు, రెండు కార్లతో వెళుతున్న పారామిలటరీ కాన్వాయ్ పైన ఆత్మాహుతి దాడి చేసింది. ఇందులో పాక్ సైన్యం మొత్తం 90 మంది మరణించారు.

ఈ సంఘటనకు సంబంధించిన వీడియోని బీఎల్యే విడుదల చేసింది. కాన్వాయ్ పైకి ముందుగా ఆత్మాహుతి బాంబర్ ప్రవేశించటంలో పెద్ద ఎత్తున పేలుడు సంభవించింది. ఆ తర్వాత బస్సు నుంచి మంటలు చెలరేగాయి. ఆ తర్వాత తీవ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. బెలూచిస్తాన్ లోని నోషికి జాతీయ రహదారిపైన ఈ సంఘటన గగుర్పాటు కలిగించేలా ఉంది.

ఈ రెండూ కాకుండానే పాకిస్తాన్‌లో ఈ నెల 15 వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో లష్కరే తొయిబా మాస్టర్ మైండ్ అబుఖతల్ లేదా ఖతల్ సింధీ హతుడయ్యాడు. లష్కరే తొయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కి ప్రధాన అనుచరుడు. జమ్మూకశ్మీర్‌లో అనేక విధ్వంసాలకు సూత్రధారి. భారత్ వాంటెడ్ లిస్టులో ఉన్న తీవ్రవాది. సయీద్, ఖతల్ కి ఏదో మీటింగుకు వెళ్లి తిరిగివస్తూండగా వారిపైన దాడిజరిగింది. ఈ దాడిలో సయీద్ తృటిలో తప్పించుకోగలిగాడు. పాకిస్తాన్ ఆర్మీ, ఎల్టీ సేనల రక్షణలోనే ఈ ఇద్దరు నేతలు బయట తిరుగుతారు. ఇలా వరసగా సాగుతున్న సంఘటనలతో పాక్ అతలాకుతలం అవుతోంది. రైలు హైజాక్ సంఘటనలో బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ వెనక తాలిబాన్లు చోదకశక్తిగా పనిశారని... దీని వెనక మాస్టర్ మైండ్ భారత్ అని, తమ దేశాన్ని అస్థిరపరచటానికి నిరంతరం పనిచేస్తోందని పాక్ అవాకులు చెవాకులు పేలింది. ఈ ఆరోపణలను భారత్ విదేశాంగ శాఖ ఖండించింది. పక్క దేశాలను నిందించటం మానేసి ముందు మీ అంతర్గత సమస్యలను చక్కదిద్దుకోమని సలహా ఇచ్చింది. మరో వైపు భారత ప్రధాని మోదీ కూడా దీనిపైన మాట్లాడారు. ఎమ్ఐటీకి చెందిన రీసెర్చి సైంటిస్టు లెక్స్ ఫ్రిడ్‌మాన్‌తో నిర్వహించిన పాడ్ కాస్ట్‌లో పాక్‌తో స్నేహసంబంధాలను పెంచుకోవటానికి తాము ఎంతగా ప్రయత్నించినా, ఆ దేశం వంచిస్తోంది. భారత్‌పైన ప్రచ్ఛన్న యుద్ధం చేస్తోందని ఆరోపించారు. పాక్ టెర్రర్‌కి కేంద్రంగా మారింది. దాని వల్ల ఒక్క భారత్ మాత్రమే కాదు. ప్రపంచ దేశాలన్నీ దాని విషఫలాలను అనుభవిస్తున్నాయని చెప్పారు. తాను ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తున్నప్పుడు, సార్క్ దేశాల అధ్యక్షులందరినీ ఆహ్వానించాను, అందులో భాగంగా పాక్ ను పిలిచామని చెప్పారు. విదేశాంగ విధానంలో సమూలంగా మార్పునకు మేం చేసిన ప్రయత్నాలకు ప్రపంచం అంతా స్పందించింది. పాక్ విషయంలో ఆశించిన ఫలితాలను రాలేదని విచారం వ్యక్తం చేశారు.

99088 92065

# బ్యాంకుల్లో సిబ్బంది కొరత

సీహెచ్ వెంకటాచలం

సిబ్బంది కొరతతో బ్యాంకులు కొట్టుమిట్టాడుతున్నాయి. గత పదేళ్లుగా చూసుకుంటే అధికారులు మినహా క్లర్క్‌లు, సబ్ స్టాఫ్ సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. గత నెల 10వ తేదీ లోక్‌సభలో సీపీఐ సభ్యుడు వి సెల్వరాజ్ అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి సమాధానం ఇస్తూ బ్యాంకులలో సిబ్బంది కొరతలేదనీ, 95 శాతం సిబ్బంది పనిచేస్తున్నారని అసత్యాలు చెప్పారు. వాస్తవానికి ప్రభుత్వరంగ బ్యాంకుల శాఖలలో క్లర్కులు, సబ్‌స్టాఫ్ తదితర పోస్టులు చాలా ఎక్కువగా ఖాళీగా ఉన్నాయి. ఖాళీలను భర్తీ చేయాలని ఏఐబీఈఏ (అఖిల భారత ఎంప్లాయిస్ యూనియన్) సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకున్న నాధుడులేడు. ఖాళీల భర్తీతో పాటు, ఇతర సమస్యల పరిష్కారానికి బ్యాంకు ఉద్యోగ సంఘాలు సమ్మెకు సిద్ధమవుతున్నాయి. ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదు. పైపెచ్చు 95 శాతం సిబ్బందిని భర్తీ చేశామని లోక్‌సభ సాక్షిగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి అబద్దాలు చెపుతున్నారు. బ్యాంకుల్లో క్లర్కుల సిబ్బందిని చేర్చుకోవడం తగ్గించినట్టు అన్ని శాఖల్లో పనిచేసే వారందరికీ తెలుసు. అంతేకాదు సబ్‌స్టాఫ్‌ను, పార్ట్‌టైం ఉద్యోగులను చేర్చుకోవడంపై నిషేధం విధించారు. అంతేకాదు ముఖాముఖంగా ఇచ్చే ఆదేశాల మీద కూడా రిక్రూట్ చేసుకోవడం లేదు. ఈ కారణాలన్నింటి వల్ల ఆయా శాఖలలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. ఫలితంగా తక్కువగా ఉన్న సిబ్బంది రోజువారీ పనిని పూర్తిచేయలేకపోతున్నారు. పర్యవసానంగా చాలా శాఖల్లో తాత్కాలిక, క్యాజువల్ సిబ్బందిని చేర్చుకొని పనిచేయించుకుంటున్నారు. 95 శాతం సిబ్బందిని చేర్చుకున్నామని మంత్రి పంకజ్ చౌదరి చెప్పిన సమాధానం కేవలం అబద్ధమే.

మంత్రి సమాధానం మేరకు 2011-2024 మధ్యకాలంలో 1,72,980 అధికారులు అదనంగా వచ్చి చేరగా, క్లర్కుల సంఖ్య 5,693, సబ్‌స్టాఫ్ సంఖ్య 29,410 తగ్గిపోయింది. బ్యాంకు ఉద్యోగుల సంఖ్యకు సంబంధించి భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) విడుదల చేసిన వివరాలిలా ఉన్నాయి.

2011-2012ల్లో క్లర్కుల రిక్రూట్‌మెంట్‌తో పోల్చినప్పుడు, 2013-2024లో క్లర్కుల సిబ్బంది 2013-2024 సంవత్సరాలలో పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది.

**క్లర్కుల సంఖ్య 2013 నాటికి 3,98,801**
**క్లర్కుల సంఖ్యా బలం 2024 నాటికి 2,46,965**
**తగ్గుదల 1,51,836**

ఈ సంఖ్యలను పరిశీలించినప్పుడు 1,50,000 క్లర్కుల పోస్టులు, దాదాపు 50,000 సబ్‌స్టాఫ్ (దాదాపు 2 లక్షల ఖాళీలు) ప్రభుత్వరంగ బ్యాంకులలో ఖాళీలు ఉన్నాయి. వాణిజ్యం వృద్ధిపరిచేందుకు, వివిధ ప్రభుత్వ పథకాలు పెంపొందించాలంటే మరింత మంది అవసరమవుతారు. అందువల్లనే ఉద్యోగులు పనిభారంతో ఇబ్బంది పడుతున్నారు. మరో పక్క ప్రైవేటు బ్యాంకులలో సిబ్బంది ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయడంతో పాటు సిబ్బంది సంఖ్యను పెంచుతున్నారు. ప్రైవేట్ బ్యాంకులలో 2011లో 1,71,071సిబ్బంది ఉండగా, ఆ సంఖ్య 2024లో 8,46,530కి చేరింది. క్లర్కులు, వాస్తవ పరిస్థితులు ఇలావుండగా, సబ్‌స్టాఫ్ సిబ్బంది 95 శాతం రిక్రూట్ చేసినట్టుగా మంత్రి ఎలా చెప్పారో తెలియదు. ఇది అంకెల పొరపాటా లేక కావాలని తప్పుడు సమాచారం ఇచ్చారా? ఏదైనా కానివ్వండి. వివిధ శాఖలలో సిబ్బంది కొరత చాలా తీవ్రంగా ఉందని మనకు తెలుసు. ఈ నేపథ్యంలో ఖాళీలన్నీ భర్తీ చేయాలని, డిమాండ్ చేయాలని ఏఐబీఈఏ మార్చి 24, 25 తేదీలలో జాతీయ స్థాయి సమ్మెకు పిలుపునిచ్చింది. సిబ్బంది మొత్తం ఈ సమ్మెలో పాల్గొనాలని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

– ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి

**మంత్రి చెప్పిన సమాధానంలో బ్యాంకులలో పనిచేస్తున్న సిబ్బంది.**

| అధికారులు, సిబ్బంది | 2011 | 2017 | 2024 | 1-1-2024 నాటికి |
|---|---|---|---|---|
| అధికారులు | 2,39,997 | 3,19,685 | 4,12,977 | 4,21,584 |
| క్లర్కులు | 2,54,232 | 2,69,271 | 2,48,539 | 2,48,173 |
| సబ్‌స్టాఫ్ | 1,24,609 | 1,19,288 | 95,199 | 88,851 |
| మొత్తం | 6,18,838 | 7,08,288 | 7,56,715 | 7,58,608 |

| | మంత్రి సమాధానం | | ఆర్బీఐ ఇచ్చి సమాచారం | |
|---|---|---|---|---|
| | 2011 | 2024 | 2011 | 2024 |
| అధికారి పెరిగినవి | 2,39,997 | 4,12,911 | 3,10,961 | 4,05,336 |
| క్లర్క్ తగ్గినవి | 2,54,232 | 2,48,539 | 3,13,537 | 2,46,965 |
| | 5,693 | 66,572 | | |
| సబ్‌స్టాఫ్ | 1,24,609 | 95,199 | 1,51,190 | |
| తగ్గింది | 2,9410 | | | 56,842 |

# బెంగాల్‌లో వామపక్ష ఫ్రంట్

ఆర్వీ రామారావ్

కేరళలో మొట్ట మొదటి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని 1959లో అధికారం నుంచి తొలగించిన తరవాత పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో సుదీర్ఘ కాలం వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వాలు కొనసాగాయి. పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ఫ్రంట్ 1977 నుంచి మొదలుకుని 2011 దాకా వరసగా ఏడు విడతలు అధికారంలో ఉంది. మొదటి అయిదు ప్రభుత్వాలలో జ్యోతిబసు ముఖ్యమంత్రిగా ఉంటే తరవాత రెండు విడతలు బుద్ధదేవ్ భట్టాచార్య ముఖ్యమంత్రిగా ఉన్నారు. వరసగా ఒకే వ్యక్తి అయిదు సార్లు జ్యోతిబసు ముఖ్యమంత్రిగా ఉండడం మన పార్లమెంటరీ చరిత్రలోనే రికార్డు. ఈ ప్రభుత్వాలలో సీపీఐ(ఎం) ఆధిపత్యం ఉండేది. మొదట 1977లో బెంగాల్‌లో వామపక్ష ఫ్రంట్ ఏర్పడినప్పుడు సీపీఐ(ఎం), అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, మార్క్సిస్ట్ ఫార్వర్డ్ బ్లాక్, రెవల్యూషనరీ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా, విప్లవి బాంగ్లా కాంగ్రెస్ వామపక్ష ఫ్రంట్‌లో భాగస్వామ్య పక్షాలుగా ఉండేవి. ఆ తరవాత భారత కమ్యూనిస్టు కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) చేరింది. 2011లో పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలలో వామపక్ష ఫ్రంట్ మెజారిటీ సాధించలేక పోయింది.

వామపక్ష ఫ్రంట్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పడింది. అంతకు ముందు కూడా యునైటెడ్ లెఫ్ట్ ఫ్రంట్, పీపుల్స్ యునైటెడ్ లెఫ్ట్ ఫ్రంట్ లాంటివి ఉండేవి. ఇవి 1967 నుంచి 1971 దాకా అస్తిత్వంలో ఉన్నాయి. 1977 లోక్‌సభ ఎన్నికలకు ముందు కేవలం వామపక్ష పార్టీలతోనే ఫ్రంట్ ఏర్పాటు చేసింది. అంతకు ముందు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మధ్యేమార్గ పార్టీలతో కలిపి ఏర్పాటు చేసిన ఫ్రంట్‌ల అనుభవం రీత్యా కేవలం వామపక్ష ఫ్రంట్ ఏర్పాటు చేయాలని అనుకున్నారు. ఎమర్జెన్సీ సమయంలో తీవ్ర అణచివేత ధోరణి కొనసాగింది. 1977 జనవరిలో ఎమర్జెన్సీ తొలగించారు. ఆ తరవాతే వామపక్ష ఫ్రంట్ ఏర్పడింది. మొదట ఆరు పార్టీలతో ఏర్పడిన వామపక్ష ఫ్రంట్ జనతా పార్టీతో పొత్తు పెట్టుకుని పోటీ చేసింది. వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా కూడా వామపక్ష ఫ్రంట్‌లో చేరాలనుకున్నా ఆ పార్టీని చేర్చుకోలేదు.

జ్యోతిబసు


బుద్ధదేవ్ భట్టాచార్య

1977 లోక్‌సభ ఎన్నికలలో బెంగాల్‌లోని మొత్తం 42 స్థానాలలో వామపక్ష ఫ్రంట్ 26 స్థానాలకు పోటీ చేసింది. ఆ ఎన్నికలలో సీపీఐ(ఎం) 20 సీట్లు, ఫార్వర్డ్ బ్లాక్ మూడు, ఆర్.ఎస్.పి. మూడు స్థానాలకు పోటీ చేశాయి. సీపీఐ(ఎం) 17 స్థానాల్లో, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్.ఎస్.పి. మూడేసి స్థానాల్లో గెలిచాయి. 1977 జూన్‌లో బెంగాల్ శాసనసభ ఎన్నికలు జరిగినప్పుడు జనతా పార్టీతో పొత్తు కుదరలేదు. జనతా పార్టీకి 52 శాతం సీట్లు కేటాయిస్తామని, జనతా పార్టీ నాయకుడు ప్రఫుల్ల చంద్రసేన్‌కు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని సీపీఐ(ఎం) ప్రతిపాదించింది. కానీ జనతా పార్టీ 56 శాతం సీట్లు కావాలని ప్రతిపాదించింది. అందువల్ల వామపక్షఫ్రంట్ ఒంటరిగా పోటీ చేయాలనుకుంది. సీపీఐ(ఎం) 224 సీట్లకు, ఫార్వర్డ్ బ్లాక్, 36, ఆర్.ఎస్.పి. 23 స్థానాలకు, ఎం.ఎఫ్.బి. 3 సీట్లకు, ఆర్.సి.పి.ఐ. 4 స్థాలకు, బి.బి.సి. 2 స్థానాలకు పోటీ చేశాయి. బెంగాల్ శాసనసభలో మొత్త 294 సీట్లు ఉంటే వామపక్ష ఫ్రంట్ 231 స్థానాల్లో విజయం సాధించింది. ఇందులో సీపీఐ(ఎం)కు 178 సీట్లు, ఫార్వర్డ్ బ్లాక్‌కు 25, ఆర్.ఎస్.పి.కి 20, ఎం.ఎఫ్.బికి 3, ఆర్.సి.పి.ఐ.కి 3, ఇండిపెండెంట్‌కు ఒక స్థానం దక్కాయి. వామపక్ష ఫ్రంట్‌కు పోలైన ఓట్లలో 45.8శాతం ఓట్లు దక్కాయి. ఈ విజయం వామపక్ష ఫ్రంట్‌నే ఆశ్చర్యపరిచింది.

1977 జూన్ 21న జ్యోతిబసు ముఖ్యమంత్రిగా వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వం మొదటి మంత్రివర్గ సమావేశంలోనే రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని నిర్ణయించింది. 1977 ఎన్నికల తరవాత సోషలిస్టు పార్టీ వామపక్ష ఫ్రంట్ లో చేరింది. వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడకముందు బెంగాల్‌లో అల్లకల్లోల పరిస్థితి ఉండేది. ఈ పరిస్థితి చక్కదిద్దడానికి వామపక్ష ఫ్రంట్ చాలా శ్రమించవలసి వచ్చింది. పెట్టుబడిదారీ వ్యవస్థలోనే కమ్యూనిస్టు ప్రభుత్వం నడపడం కూడా సవాలుగా తయారైంది. బెంగాల్‌లో పెట్టుబడులు పెట్టడం కోసం బహుళ జాతి గుత్త సంస్థలను ఆహ్వానించడం వామపక్ష ఫ్రంట్‌లోని చిన్న భాగస్వామ్య పక్షాలకు మింగుడు పడలేదు.

భూసంస్కరణలు, పరిపాలనను వికేంద్రీకృతం చేయడం మీద వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. 1977 సెప్టెంబర్ 29న బెంగాల్ భూ (సవరణ) బిల్లు ఆమోదించారు. 1967లోనే హరే కృష్ణ కోనార్, వినయ్ చౌదరి నాయకత్వంలోని కౌలు రైతులకు వారు సాగు చేసే భూమిపై వారసత్వ హక్కు కల్పించారు. 1978 జూన్ 4న మూడు దొంతరుల పంచాయతీ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఆ తరవాత జరిగిన ఎన్నికలలో వామపక్ష ఫ్రంట్ ఘన విజయం సాధించింది. 1978 నుంచి 1982 మధ్య 15 లక్షల మంది రైతులకు దాదాపు 8 లక్షల ఎకరాల భూమి పంపిణీ చేశారు. 1971లో బంగ్లా యుద్ధం తరవాత ఎదురైన శరణార్థుల సమస్యను కూడా వామపక్ష ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొంది. ఆ సమయంలోనె విపరీతమైన వరదలూ వచ్చాయి.

## ఔరంగజేబ్ లాడెన్‌తో సమానం: షిండే

**ముంబై:** మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ సమాధి తొలిగించాల్సిందేనంటూ జరుగుతున్న వివాదం మరింత ముదురుతోంది. ఈ అంశంపై మహారాష్ట్ర శాసనమండలిలో అధికార, విపక్ష సభ్యుల మధ్య బుధవారం గందరగోళం చెలరేగింది. దీనిపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మండలిలో మాట్లాడారు. ఔరంగజేబ్‌ను కొందరు కొనియాడుతుండటంపై ఆరోపణలు చేశారు. ఔరంగజేబ్‌ను ఒసామాబిన్ లాడెన్‌తో పోల్చారు. తమ గడ్డపై ఒసామాబిన్ లాడెన్‌ను పూడ్చిపెట్టేందుకు అమెరికా నిరాకరించిందని, అతని మృతదేహాన్ని సముద్రంలో గుర్తుతెలియని ప్రాంతంలో పడేసిందని చెప్పారు. తద్వారా లాడెన్‌ను ఎవరూ కీర్తించకుండా అడ్డుకట్ట వేసిందని అన్నారు. ఔరంగజేబ్ సమాధిని తొలగించాలని ఓ వైపు హిందూ సంస్థలు డిమాండ్ చేస్తుంటే ఆయనను కీర్తించడం ఏమిటని షిండే నిలదీశారు. 'ఔరంగజేబ్ ఎవరు? మన రాష్ట్రంలో ఆయనన కీర్తించడానికి ఎందుకు అనుమతించాలి? రాష్ట్ర చరిత్రలో ఆయన ఒక మాయని మచ్చ' అని షిండే వ్యాఖ్యానించారు. దేవేంద్ర ఫడ్నవిస్ పాలనను ఔరంగజేబ్ పాలనతో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్ పోల్చడాన్ని తప్పుబట్టారు. ఔరంగజేబ్, ఫడ్నవిస్ ఒకటేనా అని నిలదీశారు. ఔరంగజేబ్ శత్రువుల పట్ల వ్యవహరించిన రీతిలో ఫడ్నవిస్ ఎప్పుడూ ఇతరుల పట్ల వ్యవహరించలేదని అన్నారు.

## హింస సమాజానికి మంచిది కాదు: ఆర్ఎస్ఎస్

**న్యూఢిల్లీ :** మహారాష్ట్రలోని ఖుల్తాబాద్‌లో ఉన్న మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ సమాధిని కూల్చివేయాలనే డిమాండ్లపై కొనసాగుతున్న వివాదం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) బుధవారం స్పందించింది. దాని ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సునీల్ అంబేకర్ మాట్లాడుతూ మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన హింసను ఖండించారు. ఏ రకమైన హింస అయినా సమాజ ఆరోగ్యానికి హానికరం అని అన్నారు. ఇది ఔరంగజేబ్‌కు సంబంధించి జరిగినది కాదని తాను భావిస్తున్నట్లు చెప్పారు.

## డీలిమిటేషన్‌పై ఆగని డీఎంకే ఆందోళన

**న్యూఢిల్లీ:** డీలిమిటేషన్ అంశంపై ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) పార్లమెంటు ఎదుట బుధవారం ఆందోళన చేపట్టింది. డీఎంకే ఎంపీలు కనిమొళి, టి.శివ, దయానిధి మారన్ ఆందోళనలో పాల్గొన్నారు. న్యాయమైన డీలిమిటేషన్ అని రాసిన బ్యానర్‌ను ప్రదర్శించారు. డీలిమిటేషన్‌ను డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. పార్లమెంటు వేదికగా కొన్ని రోజులుగా ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. మార్చి 10న ప్రారంభమైన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 14 వరకు కొనసాగుతాయి. డీలిమిటేషన్ 'సమాఖ్యవాదంపై బహిరంగ దాడి'గా తమిళనాడు సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ చర్యకు వ్యతిరేకంగా ఐక్య రాజకీయ ఫ్రంట్‌కు పిలుపునిచ్చారు. మార్చి 8న స్టాలిన్ ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాలు సహా ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాశారు. ఈ అన్యాయమైన చర్యకు వ్యతిరేకంగా పోరాటంలో తనతో చేరాలని లేఖలో పేర్కొన్నారు. కేరళ సీఎం పినరయి విజయన్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంఝీ సహా ఆయా రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను కోరారు.

### భూమికి ఉద్యోగాల కుంభకోణం

## ఈడీ విచారణకు లాలు

**పాట్నా:** రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) అధ్యక్షుడు లాలూ ప్రసాద్ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు హాజరయ్యారు. భూమి కోసం ఉద్యోగాల కుంభకోణంపై దర్యాప్తునకు సంబంధించి ఆయనకు సమన్లు జారీ అయ్యాయి. అనారోగ్యంతో బాధపడుతున్న 70 ఏళ్ల వ్యక్తి ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పాట్నాలోని ఈడీ బ్యాంక్ రోడ్ కార్యాలయానికి చేరుకుని దాదాపు నాలుగు గంటల పాటు విచారణ తర్వాత ఆ ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. పాటలీపుత్ర నుంచి ఆర్‌జేడీ ఎంపీ అయిన ప్రసాద్ పెద్ద కుమార్తె మీసా భారతి తన తండ్రితో కలిసి వెళ్లారు. ఈడీ కార్యాలయానికి వెళ్లే వీధిలో పెద్ద సంఖ్యలో గుమిగూడిన ఆర్‌జేడీ కార్యకర్తలు ప్రసాద్‌ను ప్రశంసిస్తూ నినాదాలు చేస్తూనే ఉన్నారు. అయితే, తన సరదా ప్రతిభకు పేరుగాంచిన ప్రసాద్, జర్నలిస్టుల నుంచి వచ్చిన ఎటువంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. కారు లోపల నుంచి నిశ్శబ్దంగా వారి వైపు ఊపుతూ కనిపించాడు. మంగళవారం ఈ కేసులో సహ నిందితులుగా పేర్కొనబడిన ప్రసాద్ భార్య రబ్రీ దేవి, పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను ఈడీ దాదాపు నాలుగు గంటల పాటు ప్రశ్నించింది. ఇదిలాఉండగా, లాలూ చిన్న కుమారుడు, వారసుడు తేజస్వి యాదవ్ మరోచోట విలేకరులతో మాట్లాడుతూ 'మమ్మల్ని ఎంత ఎక్కువగా వేధిస్తే, మేము అంత బలంగా మారతాం. రాజకీయాల్లో లేకుంటే, నన్ను ఇందులోకి లాగేవారు కాదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత దర్యాప్తు సంస్థలు ఇప్పుడు బీహార్ వైపు దృష్టి సారిస్తాయని నేను ఊహించాను' అని చెప్పారు. జేడీ(యూ) ఎమ్మెల్సీ, ఆ పార్టీ ప్రతినిధి నీరజ్ కుమార్ మాట్లాడుతూ 'లాలూ ప్రసాద్ తాను విత్తిన పంటనే కోసుకున్నారు. అప్పటి బీహార్ ముఖ్యమంత్రిగా, ఆయన దాణా కుంభకోణంలో పాల్గొన్నారు. ఆయన కోర్టు ద్వారా దోషిగా నిర్ధారించబడి ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడిగా ఉన్నారు. రాజకీయ ప్రతీకార ఆరోపణ నకిలీది. దాణా కుంభకోణంలో సీబీఐ చార్జిషీట్ ఇందర్ కుమార్ గుజ్రాల్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు దాఖలయింది. ఆయనతో ఆర్జేడీ అధినేత అద్భుతమైన సంబంధాలు పంచుకున్నారు' అని తెలిపారు. భూమికి ఉద్యోగాల కుంభకోణం కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ మొదటి పదవీ కాలంలో ఆర్‌జేడీ అధినేత రైల్వే మంత్రిగా ఉన్న కాలానికి సంబంధించినది.

# నాగపూర్ హింస... ఫహీమ్ ఖాన్ అరెస్టు

### 10 పోలీసు స్టేషన్ల పరిధిలో కర్ఫ్యూ

**నాగపూర్/ముంబై:** నాగపూర్ హింసకు సంబంధించి ప్రధాన నిందితుడిగా భావిస్తున్న ఫహీమ్ ఖాన్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ అల్లర్ల వెనుక హింసను 'ప్రేరేపించిన' వ్యక్తి ఫహీమ్ ఖాన్ అని వారు తెలిపారు. మైనారిటీ డెమొక్రటిక్ పార్టీకి చెందిన స్థానిక రాజకీయ నాయకుడు ఖాన్ శుక్రవారం వరకు కస్టడీలో ఉంటాడు. హింసకు సంబంధించి ఇప్పటివరకు 60 మందిని అరెస్టు చేశారు. కాగా, పోలీసులు ఈ హింస ఒక వ్యక్తి లేదా సంస్థ ద్వారా జరిగిందా అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు ఆరు కేసులు నమోదు చేసి 1,200 మందిపై ఫిర్యాదులు నమోదు చేశారు. మిగిలిన వారి కోసం వెతుకుతున్నారు. ఔరంగజేబ్ సమాధికి వ్యతిరేకంగా నిరసనల కారణంగా నగరంలో జరిగిన హింసాకాండ తర్వాత 50 మందికి పైగా వ్యక్తులను అదుపులోకి తీసుకున్న తర్వాత బుధవారం నాగపూర్‌లోని 10 పోలీసు స్టేషన్ల పరిధిలో వరుసగా రెండవ రోజు కర్ఫ్యూ విధించారు. ఇటువంటి సంఘటనలను అదుపులో ఉంచడానికి, రాష్ట్రంలో కలహాలకు దారితీసే చిన్న సంఘటనలను కూడా తీవ్రంగా పరిగణించి, వాటిని మొగ్గలోనే తుంచివేయాలని మహారాష్ట్ర డీజీపీ రశ్మీ శుక్లా జిల్లా ఎస్పీలను కోరారు. రాష్ట్ర పోలీసు చీఫ్ కూడా పోలీసు సిబ్బందిని వీధుల్లో ఎక్కువ మంది పోలీసులు కనిపించేలా చూసుకోవాలని, సరైన బందోబస్తు నిర్వహించాలని కోరారు. కాగా, నాగపూర్‌లోని పాత నగర ప్రాంతంలో సోమవారం జరిగిన హింసలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి విధుల్లో ఉన్న మహిళా పోలీసు అధికారిని అనుచితంగా తాకినట్లు ఆరోపణలు వచ్చాయి. హింసకు సంబంధించి ఒక ఏరియా పోలీస్ స్టేషన్‌లో దాఖలయిన మొదటి సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) ఈ విషయాన్ని పేర్కొంది. నాగపూర్ హింస నిందితుడు, మార్చి 17న సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ప్రారంభమై రాత్రి 11.30 గంటల వరకు కొనసాగిన ఈ సంఘటనలో పోలీసు సిబ్బందితో సహా మరికొందరు మహిళలతో కూడా అసభ్యకరమైన హావభావాలు ప్రదర్శించాడని, అసభ్యంగా ప్రవర్తించాడని వెల్లడించింది. ఎఫ్ఐఆర్, నంబర్ 0115, మార్చి 18న సోమవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విధుల్లో ఉన్న గణేష్‌పేట్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జితేంద్ర బాబూరావు గాడ్గే నమోదు చేశారు. కాగా, నాగపూర్ హింసకు సంబంధించి పోలీసులు 51 మందిని అరెస్టు చేశారు. అదే ఎఫ్ఐఆర్‌లో 51 మంది పేరులేని నిందితులు, 500 నుంచి 600 మంది పేరులేని వ్యక్తుల జాబితా ఉంది. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) క్రిమినల్ లా సవరణ చట్టం-1932, ప్రజా ఆస్తి నష్ట నివారణ చట్టం-1984, మహారాష్ట్ర పోలీసు చట్టం-1951, ఇతర సంబంధిత చట్టాల కింద అనేక ఆరోపణలు ఉన్నాయి. బుధవారం, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు నాగ్‌పూర్ హింస కేసులో 19 మంది నిందితులను మార్చి 21 వరకు పోలీసు కస్టడీకి అప్పగించింది. నాగ్‌పూర్ పోలీసులు నిందితులను కోర్టు ముందు హాజరుపరిచి, తదుపరి దర్యాప్తు కోసం వారి రిమాండ్‌ను కోరుతున్నారు.

## 'వయనాడ్'లో ప్రతి అనాథకు రూ.10 లక్షలు

### విద్య కోసం ఆర్థిక సాయం ప్రకటించిన కేరళ ప్రభుత్వం

**తిరువనంతపురం:** వయనాడ్‌లో 2024, జులైలో కొండ చరియలు విరిగిపడి తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల చదువు బాధ్యతను కేరళ ప్రభుత్వం తీసుకుంది. వారి విద్యకు అయ్యే ఖర్చును భరించేందుకు సిద్ధమైంది. ప్రతి అనాథకు రూ.10 లక్షలు చొప్పున ఆర్థిక సాయాన్ని బుధవారం ప్రకటించింది. 'మెప్పాడి గ్రామంలో తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన ఏడుగురు పిల్లలు ఉండగా, తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు 14 మంది ఉన్నారు. వీరందరి విద్య కోసం రూ.10 లక్షలు చొప్పున కేరళ ప్రభుత్వం అందజేయనుంది' అని సీఎంఓ పేర్కొంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేబినెట్ ఈ మేరకు నిర్ణయించినట్లు తెలిపింది. సీఎండీఆర్ఎఫ్ ద్వారా ఈ సాయాన్ని అందిస్తారని, పిల్లలకు 18 ఏళ్లు వచ్చేంత వరకు ఆ డబ్బు విత్‌డ్రా చేసేందుకు అనుమతి లేదని స్పష్టంచేసింది. ఇప్పటికే మహిళ, శిశు సంక్షేమ శాఖ కొంత సాయాన్ని అందించినట్లు గుర్తుచేసింది. అయితే సంబంధిత పిల్లల సంరక్షకులకు నెలసరి వడ్డీని చెల్లించడం, ఆ డబ్బును సదరు ఖాతాల్లో జమ చేసే బాధ్యతలను వయనాడ్ కలెక్టర్‌కు అప్పగించినట్లు సీఎంఓ తెలిపింది. వయనాడ్‌లోని ముండక్కాయ్, చురల్మాలాలో కొండచరియలు విరిగిపడినప్పుడు బాధితులకు పునరావాసం కోసం జరిగిన భూసేకరణకు భూములు ఇచ్చిన వారికి పరిహారం ఇవ్వాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.26.56 కోట్లను సీఎండీఎంఆర్ఎఫ్ ద్వారా సమకూర్చనున్నట్లు సీఎంఓ వెల్లడించింది. అదే సమయంలో ప్రతిపాదిత టౌన్‌షిప్ ప్రాజెక్టు అమలునకు కొత్త పోస్టుల కేటాయింపు దిశగా కసరత్తు జరుగుతున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది.

## మణిపూర్‌లో ఘర్షణలు...

### గాల్లోకి కాల్పులు

**ఇంఫాల్:** మణిపూర్‌లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తాజాగా చురాచంద్‌పూర్ జిల్లాలో రెండు వర్గాలు రాళ్లు రువ్వుకున్నాయి. కాల్పులకు దిగాయి. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడంతో పాటు గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో కొంతమందికి తీవ్రగాయాలైనట్లు సీనియర్ అధికారి ఒకరు బుధవారం తెలిపారు. మణిపూర్‌లోని చురాచంద్‌పూర్ జిల్లాలో మంగళవారం రాత్రి జోమి కౌన్సిల్, హార్ ఇన్పురు తెగల మధ్య శాంతి ఒప్పందం కుదిరిన కొన్నిగంటల తర్వాత... రెండు వర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. జోమి సంస్థకు చెందిన జెండాను కొందరు దుండగులు కూల్చివేసేందుకు యత్నించారు. ఆగ్రహించిన జోమి వర్గం హార్ వర్గంపై కర్రలతో దాడికి దిగింది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కొంతమంది వ్యక్తులు ప్రత్యర్థులపై కాల్పులు జరపడంతో పాటు ఆస్తులు కూడా ధ్వంసం చేశాయని సీనియర్ అధికారి తెలిపారు. రెండు వర్గాలను నియంత్రించేందుకు భద్రతా దళాలు గాల్లోకి కాల్పులు జరిపాయని అన్నారు. ఎవరిపై కాల్పులు జరిపారో స్పష్టంగా తెలియలేదని అన్నారు. జోమి స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లాలో బంద్‌కు పిలుపునిచ్చింది.

## మా వాదనకు బలం చేకూరింది

### ఈసీ ప్రతిపాదనపై రాహుల్

**న్యూఢిల్లీ:** ఓటరు జాబితాల్లో అనుమానాస్పద పేర్లపై కాంగ్రెస్ లేవనెత్తిన అభ్యంతరాలకు ఎన్నికల సంఘం (ఈసీ) ప్రతిపాదన బలం చేకూరుస్తోందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలిపారు. ఆధార్‌ను ఓటర్ ఐడీలతో అనుసంధానం చేస్తామని ఈసీ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ మేరకు ఓటరు జాబితాల సంస్కరణకు ఈసీ నిపుణులు, 'ఉడాయ్' (భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ)కు నడుమ సాంకేతికపరమైన సంప్రదింపులకు ఎన్నికల సంఘం ప్రతిపాదించిందన్నారు. ఓటరు జాబితాల్లో అసాధారణ చేర్పులు, అనూహ్య తొలగింపుల అంశాన్ని కాంగ్రెస్‌తోపాటు ఇండియా ఐక్యసంఘటన పదే పదే లేవనెత్తినట్లు రాహుల్ 'ఎక్స్' ద్వారా చెప్పారు. 2024 మహారాష్ట్ర విధానసభ, లోక్‌సభ ఎన్నికల ఓటరు జాబితాలను ఫొటోలతో బహిరంగపరచాలన్న తన డిమాండును పునరుద్ఘాటిస్తున్నట్లు తెలిపారు. భారతీయుల్లో ఏ ఒక్కరూ ఓటుహక్కు కోల్పోకుండా, వారి గోప్యతకు భంగం వాటిల్లకుండా ఈసీ హామీ ఇవ్వాలని రాహుల్ డిమాండ్ చేశారు.

## తరుణ్‌రాజ్‌కు రన్యారావు ఆర్థికసాయం

**బెంగళూరు:** దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తరలిస్తూ అరెస్టయిన కన్నడ నటి రన్యారావు కేసులో కీలక విషయాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో మరో నిందితుడు తరుణ్‌రాజ్‌కు ఆమె ఆర్థికసహాయం చేసినట్లు డీఆర్ఐ అధికారుల విచారణలో తేలింది. అతడి బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయస్థానంలో అధికారులు వెల్లడించారు. రన్యారావు పంపించిన డబ్బుతోనే నిందితుడు దుబాయ్ నుంచి హైదరాబాద్ వెళ్లాడని కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా, బ్యాంకాక్, జెనీవాకు బంగారాన్ని అక్రమంగా రవాణా చేసేవారని పేర్కొంది. తరుణ్‌రాజ్ దుబాయ్ వెళ్లినరోజే తిరిగి వచ్చేవాడని ఆరోపించింది. దుబాయ్ నుంచి అక్రమ బంగారాన్ని తీసుకొస్తూ బెంగళూరు విమానాశ్రయంలో కన్నడ నటి రన్యారావు అధికారుల చేతికి చిక్కిన సంగతి తెలిసిందే. ఆమెను మార్చి 3న అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో మరో నిందితుడిగా ఉన్న హోటల్ వ్యాపారి తరుణ్‌రాజ్, రన్యారావు స్నేహితులని అధికారులు పేర్కొన్నారు. వీరిద్దరూ 2023లో దుబాయ్‌లో విరా డైమండ్స్ ట్రేడింగ్ ఎల్ఎల్‌సీ అనే ట్రేడింగ్ కంపెనీని స్థాపించారని, నాటినుంచి వ్యాపార భాగస్వాములుగా కొనసాగుతున్నట్లు విచారణలో తేలింది. తన కుటుంబానికి ఉన్న పలుకుబడిని ఉపయోగించి ఆమె తన వ్యాపారాన్ని అంతర్జాతీయంగా విస్తరించినట్లు తెలిపారు. వీరికి బ్యాంకాక్, జెనీవాలోని ప్రముఖ బంగారు వ్యాపారవేత్తలతో సత్సంబంధాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారినుంచి బంగారు కడ్డీలు కొనుగోలు చేసి... దుబాయ్ ఖాతాల ద్వారా విదేశీ కరెన్సీలో డబ్బు చెల్లించేవారని తెలిపారు.

# నేవీ ఉద్యోగి భార్య కిరాతకం

### 15 ముక్కలు చేసి... డ్రమ్ములో కుక్కి

### మా కుమార్తెను ఉరితీయండన్న తల్లిదండ్రులు

**లక్నో:** ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో సంచలనంగా మారింది. మీరట్‌లో వెలుగుచూసిన ఈ ఘటనపై నిందితురాలి తల్లిదండ్రులు అల్లుడి కుటుంబానికి అండగా నిలిచారు. ఇంతటి ఘాతుకానికి పాల్పడిన తమ కుమార్తెకు ఉరిశిక్ష సరైందన్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం యూపీకి చెందిన సౌరభ్ రాజ్‌పుత్, ముస్కాన్ రస్తోగి 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. అతడు మర్చంట్ నేవీలో పనిచేసేవారు. అయితే తన భార్యకు ఎక్కువ సమయం కేటాయించాలనే ఉద్దేశంతో ఆ ఉద్యోగాన్ని వదిలేశారు. ఇది అతడి కుటుంబానికి నచ్చకపోవడంతో భార్యతో కలిసి బయటకు వచ్చి, వేరు కాపురంపెట్టారు.

2019లో వారికి కుమార్తె జన్మించింది. ఆ సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. ముస్కాన్‌కు సాహిల్‌శుక్లా అనే అతనితో పరిచయం ఏర్పడి అక్రమ సంబంధానికి దారితీసింది. తర్వాత ముస్కాన్-సాహిల్ బంధం గురించి సౌరభ్‌కు తెలిసింది. అవి వారిమధ్య గొడవలకు దారితీసి, వ్యవహారం విడాకుల వరకు వెళ్లింది. కానీ కుమార్తె గురించి ఆలోచించి అతడు వెనక్కి తగ్గారు. తర్వాత మళ్లీ మర్చంట్ నావీలో చేరి... అమెరికా వెళ్లిపోయారు. తన కుమార్తె పుట్టినరోజుకని గత నెల భారత్‌కు వచ్చారు. ఆయన రావడం భార్య ముస్కాన్‌కు నచ్చలేదు. దాంతో అతడి అడ్డుతొలగించుకోవాలని భావించింది. మార్చి నాలుగున అతడికి నిద్రమాత్రలు ఇవ్వడంతో గాఢ నిద్రలోకి వెళ్లిపోయారు. అప్పుడు ప్రియుడు సాహిల్ శుక్లాతో కలిసి అతడిని చంపేసి, 15 ముక్కలుగా కోసి, ప్లాస్టిక్ డ్రమ్‌లో సీల్ చేసింది. సౌరభ్ గురించి పొరుగువారు అడిగితే... హిల్ స్టేషన్‌కు వెళ్లాడని నమ్మబలికింది. తర్వాత నిందితులు ఇద్దరు మృతుడి ఫోన్ తీసుకొని హిల్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఫొటోలు తీసి, సౌరభ్ ఖాతాల్లో పోస్టు చేశారు. అయితే ఎన్నిరోజులైనా తమ కుమారుడితో ఫోన్ మాట్లాడటం వీలుకాకపోవడంతో సౌరభ్ కుటుంబానికి అనుమానం వచ్చింది. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తామే హత్యచేసినట్లు విచారణలో భాగంగా సాహిల్, ముస్కాన్ అంగీకరించారు. అలాగే సిమెంట్ నింపిన డ్రమ్‌లో ముక్కలుగా ఉన్న శరీర భాగాలను గుర్తించారు. వాటిని శవపరీక్షకు పంపారు.

ఈ ఘటనపై ముస్కాన్ తల్లిదండ్రులు మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సౌరభ్ తమ కుమార్తెను గుడ్డిగా ప్రేమించాడని, అతడిని అంతదారుణంగా హతమార్చిన ఆమెకు కఠిన శిక్ష విధించాలని కోరారు. ఆమె జీవించే హక్కు కోల్పోయిందన్నారు. 'హిల్స్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత ముస్కాన్ మా దగ్గరకు వచ్చింది. సౌరభ్‌ను చంపానని చెప్పింది. వెంటనే మేం ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాం. మా కూతురే అన్ని సమస్యలకు కారణం. అల్లుడిని కుటుంబం నుంచి దూరం చేసింది. ఇప్పుడు ఇలాంటి దుస్థితికి చేరింది. వారి కుటుంబానికి న్యాయం జరగాలి. అతడు మాకు బిడ్డలాంటివాడు' అని వాపోయారు. నిందితులకు డ్రగ్స్ వాడే అలవాటు ఉందని, అది కూడా ఈ హత్య వెనక కారణం కావొచ్చని తెలుస్తోంది.

# నిఘా వైఫల్యం వల్లే హింస

### మహారాష్ట్ర సర్కార్‌పై విపక్షాల ధ్వజం

**ముంబై:** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై బుధవారం ప్రతిపక్ష పార్టీలు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. నిఘా వైఫల్యం కారణంగా నాగ్‌పూర్‌లో హింసను నిరోధించలేకపోయారని ధ్వజమెత్తాయి. ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో ఉన్న ఔరంగజేబ్ సమాధిని తొలగించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ చేపట్టిన ఆందోళన సందర్భంగా ఒక వర్గానికి చెందిన పవిత్ర గ్రంథాన్ని దహనం చేశారనే వదంతుల నడుమ సోమవారం రాత్రి నాగ్‌పూర్ నగరంలో పోలీసులపై రాళ్లు రువ్వడంతో హింస జరిగింది. రాష్ట్ర శాసన సభలో ప్రతిపక్ష నాయకుడు విజయ్ వాడేట్టివార్ మాట్లాడుతూ నాగ్‌పూర్ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్వస్థలమని అన్నారు. 'అక్కడ నిప్పు పెట్టింది ఎవరు?... హింస ముందస్తు ప్రణాళిక ప్రకారం జరిగితే, నిఘా వైఫల్యం వల్లే జరిగింది. హింస చెలరేగిన తర్వాత గంటన్నర పాటు పోలీసులు ఎక్కడా కనిపించలేదు' అని ఆయన అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో హోం శాఖ బడ్జెట్ డిమాండ్లపై ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి రెచ్చగొట్టే ప్రకటనలు చేసినప్పటికీ అతనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని వాడేట్టివార్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'ఆయనను రాజీనామా చేయమని ఎందుకు అడగరు?' అని కాంగ్రెస్ నాయకుడు ప్రశ్నించాడు. అంతకుముందు, నాగ్‌పూర్ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే ప్రవీణ్ దాట్కే, హింస సమయంలో మహిళా కానిస్టేబుళ్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని సభలో ఒక సమాచార పాయింట్ ద్వారా చెప్పారు. చర్చలో పాల్గొన్న శివసేన (యూబీటీ) నాయకుడు భాస్కర్ జాదవ్ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. 'కిడ్నాప్, లైంగిక వేధింపుల కేసులు పెరిగాయి. శివసేన మాజీ కార్పొరేటర్ అభిషేక్ ఘోసల్కర్‌ను పట్టపగలు హత్య చేశారు. మాజీ మంత్రి బాబా సిద్ధిక్‌ను కూడా కాల్చి చంపారు' అని ఆయన అన్నారు. మంగళవారం అసెంబ్లీలో మాట్లాడిన సీఎం ఫడ్నవీస్, నాగ్‌పూర్‌లో జరిగిన హింస ముందస్తు ప్రణాళికతో జరిగిన కుట్రగా కనిపిస్తోందని, ఆ గుంపు నిర్దిష్ట ఇళ్లు, సంస్థలను లక్ష్యంగా చేసుకున్నదని అన్నారు.

# షిండే వర్సెస్ ఉద్ధవ్

**ముంబై:** అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి ఏడాది కాకుండానే మహారాష్ట్ర రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. బీజేపీలో చేరేందుకు శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశారంటూ మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏకనాథ్ షిండే చేసిన ఆరోపణలు తీవ్ర దుమారాన్ని రేపాయి. ఈ వ్యాఖ్యలపై ఉద్ధవ్ ఠాక్రే తీవ్రంగా స్పందించారు. షిండే ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. తాను ప్రధాని మోదీతో సమావేశమయ్యానని, ఆ సమయంలో షిండే అక్కడ చెత్తబుట్టలో దాక్కొని ఉంటారని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 2022లో మహారాష్ట్రలో ప్రభుత్వం కూలిన సమయానికి ముందు శివసేన పార్టీలో ఏకనాథ్ షిండే కేవలం చిన్న నాయకుడని ఉద్ధవ్ ఠాక్రే గుర్తు చేశారు. శాసన మండలిలో ఏకనాథ్ షిండే మాట్లాడుతూ న్యూఢిల్లీలో మోదీతో ఉద్ధవ్ ఠాక్రే సమావేశమయ్యారన్నారు. బీజేపీతో తాము మళ్లీ జతకట్టాలనుకుంటున్నట్లు మోదీతో ఠాక్రే చెప్పారన్నారు. కానీ ముంబై తిరిగి వచ్చిన తర్వాత ఉద్ధవ్ తన నిర్ణయం మార్చుకున్నారన్నారు. ఉద్ధవ్ వర్గానికి చెందిన నేత అనిల్ పరబ్‌పైనా ఏకనాథ్ షిండే కీలక ఆరోపణలు గుప్పించారు. నోటీసులు అందుకున్న అనిల్... తనను కేసుల నుంచి తప్పిస్తే బీజేపీలో చేరతానంటూ రహస్య మంతనాలు జరుపుతున్నారని విమర్శించారు. కాగా, షిండే ఆరోపణలను ఉద్ధవ్ తీవ్రంగా ఖండించారు. షిండే తిరుగుబాటును సమర్థించుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. అయినా గతంలో ఏమి జరిగిందో చెప్పే బదులు... అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి ఏం చేశారనే అంశంపై దృష్టి పెట్టాలని షిండేకు హితవు పలికారు.

# పాక్‌కు రక్షణ సమాచారం

### ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి అరెస్టు

**లక్నో:** పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఐఎస్ఐకు దేశ రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై కాన్పూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగిని ఉత్తరప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం అధికారులు అరెస్ట్ చేశారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో జూనియర్ వర్క్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కుమార్ వికాస్ పాకిస్థాన్‌కు చెందిన ఏజెంట్‌తో కలిసి కుట్ర పన్నుతున్నట్లు సమాచారం అందడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. 2025 జనవరిలో ఓ మహిళా పాకిస్థాన్ ఏజెంట్‌తో అతడికి ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడిందని, ఆమె తనను భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌లో ఉద్యోగం చేసే నేహాశర్మగా పరిచయం చేసుకుందని అన్నారు. అనంతరం ఫ్యాక్టరీకి సంబంధించిన సున్నితమైన విషయాలను అందించాలని, అందుకు డబ్బులిస్తానని ఆశ చూపింది. అనంతరం అతడికి వలపు వల విసిరింది. దీంతో అతడు లూడో గేమ్ యాప్‌ను ఉపయోగించి సంస్థకు చెందిన సున్నితమైన పత్రాలు, పరికరాల వివరాలు, మందుగుండు సామగ్రి ఉత్పత్తికి సంబంధించిన డేటా, ఉద్యోగుల సమాచారం వంటివి ఆమెకు చేరవేశాడు. లీక్ అయిన సమాచారం వల్ల భారతదేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వం తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు. జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని ఇదే పాక్ ఏజెంట్ నేహా శర్మకు లీక్ చేస్తున్న ఫిరోజాబాద్‌లో హజ్రత్‌పూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెకానిక్ రవీంద్ర కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మొదట స్నేహం పేరుతో అతడికి ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఆమె అనంతరం అతడికి వలపు వల విసిరి...రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని, లేఖలను తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు కూడా ఉన్నట్లు వెల్లడించారు.

## మృతుల శరీరాల్లో విషపదార్థాలు

### జమ్మూ మిస్టరీ మరణాలపై ప్రభుత్వం

**జమ్మూ:** జమ్మూకశ్మీర్‌లోని బధాల్ గ్రామంలో ఇటీవల కాలంలో మూడు కుటుంబాల్లో 17 మంది అనుమానాస్పద రీతిలో మృతి చెందడం సంచలనం సృష్టించింది. దీనికి సంబంధించిన కేసు హోంశాఖ అధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోంది. తాజాగా దీనిపై అసెంబ్లీలో స్పందించిన ప్రభుత్వం... మృతుల శరీరాల్లో విష పదార్థాల అవశేషాలు ఉన్నట్లు పరిశోధనల్లో గుర్తించినట్లు తెలిపింది. 'బ్యాక్టీరియా లేదా వైరల్ మూలంగా ఆ మరణాలు సంభవించలేదని క్లినికల్ రిపోర్టులు, ల్యాబొరేటరీ పరిశోధనలు, పర్యావరణ విభాగాలు చేసిన విశ్లేషణలు పేర్కొన్నాయి. చనిపోయిన వారు తిన్న ఆహార నమూనాల్లో అల్యూమినియం, కాడ్మియంతోపాటు కొన్ని రకాల రసాయన మూలకాల అవశేషాలు ఉన్నట్లు గుర్తించాయి. సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ చేసిన విశ్లేషణలో క్లోర్‌ఫెనాపైర్ అనే పురుగుమందు అవశేషం ఉన్నట్లు తేలింది. ఈ విష పదార్థాల మూలాలు ఎక్కడివనే దానిపై దర్యాప్తు కొనసాగుతోంది' అని జమ్మూకశ్మీర్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సకీనా ఇటూ వెల్లడించారు. డిసెంబర్ 7, జనవరి 19 మధ్య రాజౌరీ జిల్లాలోని బధాల్ గ్రామంలో 17 మంది అనుమానాస్పద రీతిలో చనిపోయారు. ఇందులో 13 మంది చిన్నారులు ఉన్నారు.

# విశాలాంధ్ర హైదరాబాద్

# బడ్జెట్‌లో జీహెచ్‌ఎంసీకి రూ.3101.21 కోట్లు కేటాయింపు

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హర్షం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర బడ్జెట్‌లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.3101.21 కోట్లు కేటాయించడంపై నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి జిహెచ్ఎంసి ఆర్థిక ఇబ్బందులు గట్టెక్కించేందుకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి వర్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో జిహెచ్ఎంసి ఉద్యోగుల జీతభత్యాలు చెల్లించడం కష్టంగా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బడ్జెట్‌లో 10 వేల కోట్లు కేటాయించడం జరిగిందని, ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ హామీ అమలు చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ద్వారా జిహెచ్ఎంసికి రావాల్సిన 3030 కోట్లు విడుదల చేసినట్లు మేయర్ వెల్లడించారు. ఇట్టి నిధులతో ఉద్యోగుల వేతనాలు మొదటి తేదీన జీతాలు చెల్లింపుతో పాటుగా మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రతి జోన్ కు 25 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మేయర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసికి ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయింపు చేసిన నిధులతో పాటుగా నగర వ్యాప్తంగా ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి హెచ్ సిటీ ద్వారా రూ.7032 కోట్ల అంచనా వ్యాయంతో సుమారు 40 పనులు రోడ్డు వెడల్పు, ఆర్‌ఓబిలు, అండర్ పాసులు, ఫ్లైఓవర్ పనులు చేపట్టి హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. నగర సుందరీకరణకు రూ.150 కోట్లు, వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణాలకు 100 కోట్లు, నాలాల అభివృద్ధికి రూ.585 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు.

## బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పిఎం విశ్వకర్మ, రుణాలను లబ్ధిదారులకు సకాలంలో అందించాలని బ్యాంకర్లను హైదరాబాద్ అదనపు కలెక్టర్ డాక్టర్ ముకుంద రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన డిసిసి, డిఎల్ఆర్సి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. బ్యాంకుల వారీగా రుణ లక్ష్యాలను, సాదింపులను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎం విశ్వకర్మ, ముద్ర, నేతన్న భరోసా రుణాలు అందించాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్‌లో ప్రాధాన్యత రంగం లక్ష్యం 65736.59 కోట్లు కాగా డిసెంబర్ 2024 నాటికీ 67251.91 కోట్లు 102.31% సాధించడం జరిగిందని నాన్ ప్రియారిటీ రంగం లక్ష్యం 251059.04 కోట్లు లక్ష్యం కాగా 235827.97 కోట్లు 93.93% డిసెంబర్ 2024 సాధించడం జరిగిందని తెలిపారు. ఇతర ప్రాధాన్యత రంగాల లక్ష్యం 5978.16 కోట్లు కాగా 1988.42 కోట్లు 33.26 శాతం సాధించడం జరిగిందని అన్నారు. చిన్న, సూక్ష్మ , మధ్యతరగతి పరిశ్రమలకు 59758.43 కోట్ల రుణాలు లక్ష్యం కాగా డిసెంబర్ 2024 నాటికీ 54495.28 కోట్లు 91.19% లక్ష్యం సాధించడం జరిగిందన్నారు. బ్యాంకులు నెలవారీగా లక్ష్య నిర్దేశించుకుని రుణాలను అందించాలని సూచించారు. స్వానిధి ద్వారా ఎస్సీ, ఎస్టి బీసీ మైనార్టీ వర్గాలకు సకాలంలో రుణాలు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్బిఐ ఏజీఎం పల్లవి, నాబార్డ్ డిడిఎం పి.హర్ష రఘురాం, ఎల్డిఒ, జిఎం సుబ్రహ్మణ్యం, బిసి వెల్ఫేర్ డిడి ఆశన్నా, ఎస్.సి కార్పొరేషన్ ఈ.డి రమేష్, జిల్లా పరిశ్రమ కేంద్రం జనరల్ మేనేజర్ పవన్ కుమార్, మైనార్టీ శాఖ అధికారులు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హెచ్-సిటీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం విదితమే. గ్రేటర్‌లో హెచ్ సిటీ ద్వారా మొత్తం రూ. 7032 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులు ప్రారంభించేందుకు కావాల్సిన భూసేకరణ పూర్తి చేసేందుకు బుధవారం అడిషనల్ కమీషనర్ శివ కుమార్ నాయుడు సికింద్రాబాద్ జోన్‌లోని పలు ప్రాంతాల్లో పరిశీలించారు. సికింద్రాబాద్ జోన్‌లోని పాటిగడ్డ ఆర్‌ఓబి, రసూల్ పుర ఫ్లైఓవర్, ఏటిసి చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం, ఆర్.కే పురం, చిలకలగూడ ఆర్‌యుబి పనులకు స్థల పరిశీలన చేసారు. ఈ సందర్భంగా అడిషనల్ కమీషనర్ మాట్లాడుతూ త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ రోహిణి, టౌన్ ప్లానింగ్ అధికారులు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన హైదరాబాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సహాయ కార్యదర్శులు బొడ్డుపల్లి కృష్ణ చింతకింది కుమారస్వామిలతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రతి బడ్జెట్లో 20 వేల కోట్ల రూపాయలు కేటాయిస్తామని ఐదు సంవత్సరాలలో బీసీల సంక్షేమానికి లక్ష కోట్లు ఖర్చు చేస్తామని కాంగ్రెస్ పార్టీ నాడు ప్రకటించిందని, గత బడ్జెట్లో 9,000 కోట్లు మాత్రమే కేటాయించారని, ఈ బడ్జెట్లో 11,405 కోట్లు మాత్రమే కేటాయించారని రెండు సంవత్సరాల బడ్జెట్‌లు కలిపితే 20 వేల కోట్ల అయిందని, రెండు సంవత్సరాలకు కలిపి 40 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా రెండు బడ్జెట్లు కలిపి కేవలం 20వేల కోట్లు మాత్రమే కేటాయించి 50% అన్యాయానికి గురి చేశారని ఆయన అన్నారు. 15% జనాభా కలిగిన ఎస్సీలకు 40,000 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని, ఏడు శాతం జనాభా ఉన్న ఎస్టీలకు 17వేల కోట్లు కేటాయించడాన్ని కూడా హర్షిస్తున్నామని 56% బీసీలకు 11వేల కోట్లు మాత్రమే కేటాయించడాన్ని తీవ్రంగా అక్షేపిస్తున్నామని 48 గంట క్రితం బీసీ రిజర్వేషన్ బిల్లుకు శాసనసభలో ఆమోద ముద్ర వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం 48 గంటలు గడవక ముందే బీసీలను తీవ్ర నిరాశ పరచిందని ఆయన అన్నారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయం : మహేష్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజా పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్ రూపకల్పన జరిగిందని టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ.మహేష్ గౌడ్ అన్నారు. అన్ని రంగాల శ్రేయస్సే పరమావధిగా బడ్జెట్ రూప కల్పన జరిగిందని పేర్కొన్నారు. రైతన్నలు, మహిళలకు లబ్ధి చేకూరే విధంగా బడ్జెట్ రూప కల్పన జరిగిందని చెప్పారు. యువతకు స్వయం ఉపాధి కల్పించే విధంగా బడ్జెట్ కేటాయింపులు జరిగిందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకానికి బడ్జెట్ కేటాయింపులు హర్షంచ దగిన విషయంగా పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఊతం కల్పించే విధంగా బడ్జెట్ రూపకల్పన చేయడం జరిగిందన్నారు. బడ్జెట్లో సాగునీటికి మున్సిపల్ పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభించాలని నిర్ణయించడం, విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది అనడానికి నిదర్శనమన్నారు. దావోస్‌లో 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిన తెలంగాణ పారిశ్రామిక రంగంలో మరింత ప్రోత్సాహానికి 3527 కోట్లు కేటాయించామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించకుండ కఠినమైన చర్యలు తీసుకుందని తెలిపారు. ఎస్సీ సంక్షేమానికి 40,234 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి 17169 కోట్లు వెనకబడిన తరగతుల శాఖకు 11405 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి 3591 కోట్లు కేటాయించి బడుగు బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొన్నారు. ఇప్పటికే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని నిరూపించుకున్నామని తెలిపారు.

## రెండు రోజుల సమ్మెలను విజయవంతం చేయాలి

యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రెండు రోజుల సమ్మెలను విజయవంతం చేయచాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ నాయకులు కోరారు. బుధవారం నారాయణగూడ ఎస్‌బిఐ ఆఫీసర్స్ అసోసియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలు యూనియన్‌ల నాయకులు మాట్లాడారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేట్ రంగ బ్యాంకులు, విదేశీ బ్యాంకులు, సహకార బ్యాంకులు మరియు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులలోని 8 లక్షలకు పైగా ఉద్యోగులు, అధికారులను కలిగి ఉన్న 9 బ్యాంకు సంఘాల ఉమ్మడి సమన్వయ సంస్థ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ అయిన ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్, నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ నేషనల్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఇండియన్ నేషనల్ బ్యాంక్ ఆఫీసర్స్ కాంగ్రెస్, నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాంక్ వర్కర్స్, నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాంక్ ఆఫీసర్స్ యూనియన్‌లు 2 రోజులు ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. మార్చి 23 అర్ధరాత్రి నుండి మార్చి 25 అర్ధరాత్రి వరకు తమ డిమాండ్లు పరిష్కారం కోసం ఆందోళనకు పిలుపునిచ్చింది. బ్యాంకింగ్ రంగంలో వారానికి 5 రోజుల పనిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. భారతీయ బ్యాంకులు దీనికి అంగీకరించి ఒక సంవత్సరం క్రితం ప్రభుత్వానికి సిఫార్సు చేశాయి. కానీ ఇప్పటికీ ఈ సమస్య ప్రభుత్వం వద్ద పెండింగ్‌లోనే ఉంది. అందువల్ల, ఇకపై ఎటువంటి ఆలస్యం లేకుండా బ్యాంకులో 5 రోజుల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన పని తీరు సమీక్ష మార్గదర్శ కాలను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఉద్యోగ భద్రతకు ముప్పు కలిగించే, ఉద్యోగులు, అధికారు ల మధ్య విభజన, వివక్షను సృష్టించే, పని తీరు సమీక్ష చేయాలని కోరారు. బ్యాంకు ఉద్యోగులు అధికారుల భద్రతను కాపాడాలని అసభ్య ప్రవర్తన, దాడుల నుంచి రక్షణ కల్పించా లని కోరారు. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ వద్ద పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించా లని డిమాండ్ చేశారు. కె.ఆంజనేయ ప్రసాద్, రామ్ బాబు, కె.ఎస్.శాండిల్య, ఐ.కృష్ణంరాజు, హత్కర్ శంకర్, వెంకట రామయ్య, ఫణి, అర్జున్ పాల్గొన్నారు.

## సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల ద్వారా రుణాలివ్వాలి: కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లాలో చిన్న వ్యాపారులు, మధ్యతరహా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున వాటిని ప్రోత్సహించేందుకుగాను సూక్ష్మ చిన్న, మధ్యతరహా సంస్థల ద్వారా అధికంగా రుణాలను అందించాలని వివిధ బ్యాంక్ అధికారులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధ్యక్షతన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, వచ్చే రానున్న సీజన్‌లో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు తదితర అంశాలపై ఆయా బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. పూర్తి స్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలని, రుణ పంపిణ లక్ష్యా న్ని అధిగమించాలని తెలిపారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు వెనుకంజలో ఉండిపోతున్నాయని, క్రమం తప్పకుండా సమీక్ష జరుపుతూ, వంద శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్దిదారులకు సకాలంలో రుణాలందించి స్వయంఉపాధికి చేయూతనివ్వాలన్నారు. రుణాలు తీసుకున్న వారు యూనిట్లు స్థాపించారా లేదా అన్నది నిశితంగా పరిశీలించాలని సంబంధిత అధికారు లకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని, సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయవద్దని సూచించారు. ఎస్‌హెచ్‌జి గ్రూపుల యూనిట్ల గ్రౌండింగ్‌లో జాప్యం జరుగుతుందని తెలుపగ, దానిపై కలెక్టర్ స్పందిస్తూ వెంటనే పనులు వేగవంతం చేయాలని సూచించారు. విద్యారుణాలు, గృహనిర్మాణాల రుణాలు తక్కువగా ఇచ్చిన బ్యాంకులు తమకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. మెప్మా ద్వారా స్వయం ఉపాధి కల్పించే పథకాలను, బ్యాంక్ లింకేజీ రుణాలను కూడా త్వరితగతిన గ్రౌండ్ అయ్యే విధంగా చూడాలని బ్యాంకర్లకు తెలిపారు. తదుపరి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ శ్రీదేవి మాట్లాడుతూ ఆర్‌బిఐ గైడ్ లైన్స్ ఆధారంగా అన్నీ బ్యాంకులు తమ పరిధిలో పంట రుణాలను అధికంగా ఇవ్వడంతోపాటు మనీ లెండర్ల వద్ద రైతులు రుణాలు తీసుకున్నట్లయితే వారికి బ్యాంక్ రుణాలు అందించి కాపాడాలని తెలిపారు. లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ కుసుమ, నాబార్డు ఏజీఎం, వ్యవసాయ శాఖ అధికారి నర్సింహ రావు, జిల్లా పరిశ్రమల మేనేజర్ శ్రీలత, మెప్మా పీ.డీ మల్లీశ్వరి, వివిధ బ్యాంకర్లు పాల్గొన్నారు.

## 30 కిలోమీటర్లకు ఒక సాండ్ బజార్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నగరం చుట్టూ ప్రతి 30 కిలో మీటర్లకు ఒక సాండ్ బజారును ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్ ఏరావతారి తెలిపారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్ ఏరావతారి, రాష్ట్ర గనులు భూగర్భ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, డైరెక్టర్ శశాంకలతో కలిసి రాజేంద్ర నగర్ నియోజకవర్గం వట్టినాగుల పల్లిలో సాండ్ బజార్ ను ప్రారంభించారు. చైర్మన్ అనిల్ కుమార్ ఏరావతారి మాట్లాడుతూ దళారులు వారి ఇష్టానుసారం రేట్లు పెంచుతూ మోసాలకు పాల్పడుతున్నారని దీనిని గమనించిన ప్రభుత్వం సన్నా ఇసుకకు రూ.180 లకు అదే విధంగా దొడ్డు ఇసుకకు రూ.1600 లకు చొప్పున ఆన్లైన్లో బుక్ చేసినట్లయితే వారికి ఇసుక పంపడం జరుగుతుందని తెలిపారు. ఇక్కడ నుండి తీసుకెళ్ళే రవాణా చార్జి అదనంగా ఉంటుందని తెలియజేశారు. ఈ ఇసుక 365 రోజులు వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలు చేసుకునే ప్రజలకు అతి తక్కువ ధరలకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు వచ్చి ఈ ధరలను నిర్ణయించిందని ఆయన అన్నారు. ఇష్టానుసారంగా రేట్లు పెంచుతూ ప్రజలకు ఇసుకను అందుబాటులో లేకుండా ఎక్కువ ధరకు అమ్మడాన్ని అరికట్టుటకు ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. టిజిఎండిసి ద్వారా హైదరాబాద్ నగరానికి మూడు ప్రాంతాల్లో సాండ్ బజార్లను ఏర్పాటు చేయడంతోపాటు నగరం చుట్టూ ప్రతి 30 కిలోమీటర్లకు ఒక సాండ్ బజారును ఏర్పాటు చేస్తామని అన్నారు. రాష్ట్ర గనులు భూగర్భ శాఖ డైరెక్టర్ శశాంక మాట్లాడుతూ ఇసుక అనేది ఈ రోజుల్లో నిత్యావసర వస్తువులాగా నగరంలో ఎక్కువగా ఉపయోగంలో ఉన్నందున ప్రభుత్వం దీన్ని గమనించి నగరం చుట్టుపక్కల సాండ్ బజారును ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన ఇసుకను తక్కువ ధరలకే ఇచ్చేందుకు ఈ సాండ్ బజార్లను నెలకొల్పడం జరిగిందన్నారు. టిజిఎండిసి ఎండి సుశీల్ కుమార్, ఏడి మైన్స్ నర్సిరెడ్డి, ఆర్డీఓ వెంకట్ రెడ్డి, బిల్డర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు పిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్- మల్కాజిగిరి : ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని ఆశ వర్కర్లకు పర్మినెంట్ చేయాలని ఆలోపు మిక్స్ వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని ఈఎస్‌ఐపిఎఫ్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ.అశోక్ ప్రభుత్వా నికి డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి నిర్వహించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ వర్కర్లకు 18000 ఫిక్స్ వేదనం ఇస్తామని ప్రభుత్వం చెప్పిన తర్వాత ఇప్పటివరకు ఇవ్వలేదని వెంటనే ఫిక్స్ వేధనం ఇవ్వాలని, పీఎఫ్ ఈఎస్ఐ రిటైర్మెంట్ బెనిఫిట్ పెన్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది.

బిఆర్ఎస్ కంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని, ఆశాలకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిందన్నారు. ఆశాలకు ఫిక్సిడ్ వేతనం రూ.18,000 నిర్ణయం చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరంచాలని కోరుతూ జిల్లా ఉన్నతాధికారులకు, జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఆశాలు అనేకసార్లు వినతిపత్రాల ద్వారా విజ్ఞప్తులు చేశారు. ఇప్పటికీ నిరంతరం నిరసనలు, పోరాటాలు నిర్వహిస్తున్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికా కె.ఉన్నీకృష్ణన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చలనం లేనట్లు వ్యవహరిస్తుందన్నారు. జిల్లాలో ఆశాలు తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వద్దకు వెళ్లి తమ సమస్యలను చెప్పుకుందాం అంటే జిల్లాలో ఆశా కార్యకర్తలను రాత్రికి రాత్రి ఎక్కడికి అక్కడ అరెస్టు చేయడం సిగ్గుమాలిన చర్య అని, గతంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కార్మికులకు అనేక హామీలు ఇచ్చిందని హామీలను అమలు చేయమంటే ఇచ్చిన మాటలు హామీలను మర్చి అరెస్టులు చేయడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. ఇప్పటికీ దాదాపు 300 మంది ఆశా వర్కర్లని, సిఐటియు జిల్లా నాయకులు రాజశేఖర్ లింగస్వామిను అరెస్టు చేశారు. వాళ్ళని వెంటనే విడుదల చేయాలని సిఐటియు శామీర్‌పేట్ కార్యదర్శి కృష్ణప్ప డిమాండ్ చేశారు.

## కులగణన బీసీలకు ప్రభుత్వం ఇచ్చిన ఆస్తి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మకమని, సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు అని, బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్ట బాధ్యత చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని చందనగర్ డివిజన్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రిజర్వే షన్ కమిటీ చైర్మన్‌లు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సిం హ, మైనారిటీ నాయ కులు షబీర్ అలీ, ఫాయీమ్ కురీషి చిత్రపటానికి పాలాభిషేకం చేసి బాణాసంచా కాల్చి కేక్ కట్‌చేసారు. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ బీసీ కుల గణన ఒక సాహసోపేత నిర్ణయం అని, త్రికరణ శుద్ధిగా లెక్క తేల్చిన ఘనత మన తెలంగాణ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్డినేటర్ రఘునందన్ రెడ్డి, నాయకులు బలింగ్ యాదగిరి గౌడ్, మహిపల్ యాదవ్, విరేశం గౌడ్, కట్ల శేఖర్ రెడ్డి,నరందేర్ గౌడ్, ఉరిటీ వెంకట్‌రావు, మన్నెపల్లి శంబశివరావు, సుదర్శన్, డివిజన్ అధ్యక్షులు అలీ, జహంగీర్, భరత్ గౌడ్, రేణుక, బాష్పక యాదగిరి, మరేళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**మహారాజశ్రీ గుంటూరు 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో**

యం.వి.ఓ.పి.నెం. 1192/2022

బిట్వీన్:

మారెడ్డి సుజాత వగైరాలు ..... పిటీషనర్లు

మరియు

హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, రిప్.బై ఇట్స్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ వగైరాలు ..... రెస్పాండెంట్లు

టు, **ఆర్-1: హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్,** సర్వే నెం. 440, పోలేపల్లి గ్రామం, జడ్చర్ల మండలం, మహబూబ్ నగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్ర (క్రైం వాహనం ఓనరు నెం. TS 06 FS 3456)

**ఆర్-2: గజ్జా నాగరాజు,** తండ్రి. లేటు చంద్రయ్య. నివాస: డోర్ నెం.1-78, పోలేపల్లి గ్రామం, జడ్చర్ల మండలం, మహబూబ్ నగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. (క్రైం వాహనం డ్రైవరు నెం. TS 06 FS 3456).

పై నెంబరు O.Pని పిటీషనర్లు యాక్సిడెంటులో మారెడ్డి చంద్రా రెడ్డి మరణించినందున నష్టపరిహారము కోరుచూ దాఖలు చేయుగా సదరు పిటీషన్‌లో **1 & 2వ రెస్పాండెంట్లు** అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు **ది:03-04-2025** కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం. **10-30** ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది : 03-04-2025

బి.బాలాజీ విశ్వనాథ రెడ్డి,
పిటీషనర్లు తరపు అడ్వకేట్, గుంటూరు

## సీనియర్ సిటిజన్లు, మహిళలు, వికలాంగులకు లోయర్ బెర్త్ కేటాయింపు సులభతరం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సీనియర్ సిటిజన్లు, మహిళలు, వికలాంగుల కొరకు లోయర్ బెర్త్ కేటాయింపు సదుపాయాలను సులభతరం చేయడానికి ముఖ్యమైన చర్యలు తీసుకోనున్నారు. సీనియర్ సిటిజన్లు, 45 ఏళ్ల పైబడిన మహిళలు, గర్భిణీ స్త్రీల కొరకు కేటాయించిన లోయర్ బెర్తులు రాజధాని, శతాబ్ది వంటి రైళ్లతో సహా అన్ని మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వికలాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ కోటా కల్పించనున్నారు. కేంద్ర రైల్వే, సమాచార ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ప్రశ్నకు సమాధానమిస్తూ, సీనియర్ సిటిజన్లు, మహిళలు, వికలాంగులకు లోయర్ బెర్త కేటాయింపు వసతిని అందించడానికి భారత రైల్వేలు చేస్తున్న ప్రయత్నాలను ప్రస్తావించారు. సీనియర్ సిటిజన్లు, 45 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న మహిళా ప్రయాణీకులు, గర్భిణీ స్త్రీలకు బుకింగ్ సమయంలో లోవర్ బర్తలను ఎంపిక చేసుకోకపోయినా, బెర్త్ లభ్యతను బట్టి ఆటోమేటిక్‌గా లోయర్ బెర్తులు కేటాయించబడతాయి. స్లీపర్ క్లాస్‌లో ప్రతి కోచ్‌కు ఆరు నుండి ఏడు లోయర్ బెర్తుల ప్రత్యేక కోటా, ఎయిర్ కండిషన్డ్ 3 టైర్ (3ఎ.సి)లో ఒక్కో కోచ్‌కు నాలుగు నుండి ఐదు లోయర్ బెర్తులు, ఎయిర్ కండిషన్డ్ 2 టైర్ (2ఎ.సి)లో ప్రతి కోచ్‌కు మూడు నుండి నాలుగు లోయర్ బెర్తులు, గరిష్ట సౌలభ్యాన్ని నిర్ధారించడానికి రైలులోని కోచ్‌ల సంఖ్యను బట్టి ఈ నిబంధన అందుబాటులో ఉంటుంది. వికలాంగులకు రాయితీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా లేదా అనే దానితో సంబంధం లేకుండా రిజర్వేషన్ కోటా సౌకర్యం, రాజధాని, శతాబ్ది వంటి రైళ్లతో సహా అన్ని మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఇది వర్తిస్తుంది. ఒకవేళ ప్రయాణ సమయంలో లోయర్ బెర్తులున్న సందర్భంలో, సీనియర్ సిటిజన్లు, వికలాంగులు, గర్భిణీ స్త్రీలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. వీరికి మొదట్లో మిడిల్ లేదాపై (అప్పర్)బెర్తులు కేటాయించబడి ఉండవచ్చు. సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కోసం ప్రయాణీకులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## ఘనంగా టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి పరీక్షల సందర్భంగా ప్రతి సంవత్సరం లాగానే విద్యార్థులకు కొమిరిశెట్టి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఎగ్జామ్ పాడ్, పెన్, పెన్సిల్, జియోమెట్రీ బాక్స్, స్కేల్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎఎస్ఐ ఎండీ రహీం, గాలి నరహరి, రాం భూపాల్ రెడ్, సయ్యద్ అహ్మద్, జ్యోత్స్న, వీణమ్మ, వేంకటేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# మాది రైతులకు మేలుజేసే ప్రభుత్వం : మంత్రి ఉత్తమ్

**విశాలాంధ్ర-హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి అని రాష్ట్ర బడ్జెట్ ద్వారా మరోసారి రుజువైందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రైతాంగం అభివృద్ధి ప్రజల సంక్షేమాన్ని సమపాళ్లలో రంగరించి రూపొందించిన బడ్జెట్ ఇదని ఆయన అభివర్ణించారు. బుధవారం రాష్ట్ర శాసనసభలో ఆర్థిక, విద్యుత్ శాఖామంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వాగతించారు. బడ్జెట్ ప్రసంగం పై ఆయన ఒక ప్రకటనలో స్పందిస్తూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమైన గ్రామీణ సాధికారత, ఆహార భద్రత, స్థిరమైన అభివృద్ధి తో పాటు నీటిపారుదల, పౌర సరఫరాలను పటిష్టవంతంగా మార్చేందుకు ఈ బడ్జెట్ దోహదం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యవసాయం, రైతాంగంపై గల చిత్తశుద్ధికి నీటి పారుదల రంగానికి రూ.23 వేల 373 కోట్లు కేటాయించడమే నిదర్శనమన్నారు. ప్రజా సంక్షేమానికి సైతం బడ్జెట్ కేటాయింపులలో సముచిత స్థానం కల్పించారన్నారు. ముఖ్యంగా పౌర సరఫరాల శాఖకు ఏకంగా 5,734 కోట్లు కేటాయించడం మహదానందంగా ఉందన్నారు. తద్వారా లక్షలాది కుటుంబాలకు ఆహార భద్రత కల్పించినట్లైందన్నారు. అంతే గాకుండా ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా గృహజ్యోతి పథకంలో 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాకు రూ.1,775.15 కోట్లు కేటాయింపు ప్రభుత్వ దార్శనికతకు నిదర్శనమన్నారు.

పేదలకు 4.5 లక్షల ఇళ్ల నిర్మాణాలకు రూ.22,500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం పేదల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. అభయహస్తం పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్ ప్రయాణం, మహాలక్ష్మి పథకం కింద రూ.500 కే గ్యాస్ సిలిండర్ లతో పాటు కొత్తగా తెల్ల రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలు ఆర్థికంగా బలహీన వర్గాల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

## బీసీలను నిరాశపరిచిన రాష్ట్ర బడ్జెట్

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** రాష్ట్ర శాసనసభలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క బుధవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలు బీసీలను నిరాశపరిచిందని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. రూ. 3లక్షల 4 వేల 965 కోట్ల బడ్జెట్లో 56 శాతానికి పైగా ఉన్న బీసీల సంక్షేమా నికి కేవలం రూ.11, 405 కోట్లు మాత్రమే ప్రతిపాదించడం అన్యాయమన్నారు. బీసీలకు స్థానిక సంస్థలలో, విద్యా ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్ బిల్లులు శాసనసభలో చేసి బీసీల విశ్వాసాన్ని చూరగొని అభినందనలు అందుకున్న ప్రభుత్వం బడ్జెట్లో తగిన విధంగా నిధులు కేటాయిస్తుందని ఆశించడం జరిగిందన్నారు. కామారెడ్డి డెకరేషన్‌లో బీసీలకు సంవత్సరానికి రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయలు కేటాయించి బీసీల సంక్షేమానికి కృషి చేస్తామని వాగ్దానం చేసినారని, కానీ గత సంవత్సర బడ్జెట్‌లో రూ.9,200 కోట్లు మాత్రవే ఎటాయించారని ఈ సంవత్సర బడ్జెట్ లోనైనా గతంలోని రూ.10,800 కోట్లు, ఈ సంవత్సరం బడ్జెట్ లోరూ. 20,000 కోట్లు మొత్తంగా రూ.30,800 కోట్లు కేటాయించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తే పట్టించుకోక పోవడం శోచనీయంగా ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ బీసీల సంక్షేమం అభివృద్ధి కోసం బడ్జెట్ ప్రతిపాదన సవరించి బీసీ సంక్షేమానికి నిధులనుపెంచాలన్నారు. రాష్ట్రంలోని చేతి వృత్తిదారులకు కూడా బడ్జెట్‌లో తగిన విధంగా నిధులుప్రతిపాదించలేదన్నారు. చేనేత, గీత, మత్స్య, రజక, క్షౌర, గొర్రెల పెంపకం దారుల,వడ్రంగి,కమ్మరి, కుమ్మరి మొదలైన వారికి తగిన విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బడ్జెట్‌లో నగరాభివృద్ధిని విస్మరించారు : ఎమ్మెల్యే

**విశాలాంధ్ర-దుండిగల్:** విశ్వ నగరాభివృద్ధిని బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించారని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. తెలంగాణ బడ్జెట్ సమావేశంలో భాగంగా బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్‌లో మహానగరాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంపై ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ మహానగరాన్ని నలుమూలల అనుసంధానం చేస్తూ ఎంతోమంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చే హైదరాబాద్ మెట్రోకు బడ్జెట్లో నిధులు కేటాయించలేదని తెలియజేశారు. హైదరాబాద్ నగరానికి ప్రతి సంవత్సరం పదివేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాటలు చెప్పడానికే కానీ చేతల్లో ఉండవని మరో మారు నిరూపిస్తూ హైదరాబాదు నగరానికి నిధులు కేటాయించకపోవడం నగరవాసులను తీవ్రంగా అవమానించడమే. తెలంగాణను పూర్తి ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా మార్చేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శకత్వంలో శంకుస్థాపన చేపట్టిన మల్టీస్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. దీంతో నిరుపేదలకు అందాల్సిన వైద్యం మరింత ఆలస్యం కానుంది. బడ్జెట్‌లో ఉన్న నగరాన్ని విస్మరించి ముఖ్యమంత్రి ఊహల నగరమైన ఫ్యూచర్ సిటీ కేంద్రంగా నిధుల కేటాయింపు కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారంతో ప్రజలను మోసం చేయడానికి ఒక ఎత్తుగడ మాత్రమేగానీ, అభివృద్ధి సంక్షేమం గురించి కాదని ఆయన స్పష్టం చేశారు.

## అనుమతులు లేని క్లినిక్ సీజ్

### జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఉమా గౌరి

**విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి :** మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.సి.ఉమా గౌరి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న క్లినిక్‌లపై దాడులు నిర్వహించారు. బుధవారం జిల్లా పరిధిలోని క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆక్ట్ అమలు పర్యవేక్షణలో భాగంగా జగద్గిరిగుట్టలో శివనాగుల శ్రీనివాస్ నిర్వహిస్తున్న హాసిని ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా మూడు పడకలు, యాంటీబయాటిక్స్, సర్జికల్ ఎక్విప్మెంట్, మల్టీ-పారామీటర్ పేషెంట్ మానిటర్స్, బ్లడ్ సాంపిల్ కలెక్షన్ వెక్యుటైనర్స్ వంటి వైద్య పరికరాలు అనధికారంగా వాడుతున్నారని నిర్ధారించారు. అంతేకాక, ఫార్మ్-డి అర్హత ఉన్న ప్రతీక్ అనే వ్యక్తి నకిలీ జనరల్ ఫిజీషియన్‌గా అవతారమెత్తి అనధికారిగా ఆ క్లినిక్‌ను సందర్శించి, చికిత్సలు అందిస్తున్నాడని గమనించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ, అక్రమంగా ఆలోపతిక్ మందులు అందించడంతో పాటు, ప్రజల జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నట్లు తేలినందున హాసిని ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ సీజ్ చేశారు. డా.సీ.మా గౌరి క్లినిక్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమలో డా.వినోద్, ఉప ప్రోగ్రాం అధికారి (క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం), డిపిఎంఓ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్రం కుట్ర

**విశాలాంధ్ర - జవహర్‌నగర్ :** కాప్రా మండల రైతు సంఘం కమిటీ బుధవారం జవహర్ నగర్ గిరిప్రసాద్ నగర్‌లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింహులు, జిల్లా అధ్యక్షులు డి.జంగయ్య అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించడం జరిగింది. ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మలనర్సింలు, బికేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు ప్రసంగిస్తూ దేశంలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. మోడీ బిజెపి ప్రభుత్వం హాయంలో వ్యవసాయ రంగం పూర్తిగా నిర్వీర్యం అయిపోతుందని అన్నారు. రైతు వ్యతిరేక ప్రభుత్వాల మెడలు వంచిన చరిత్ర రైతులది అన్నారు. దేశంలో మొట్టమొదటి రైతు సంఘం ఏఐకేఎస్ అనేక రైతాంగ సమరశీల పోరాటాలు నిర్వర్తించింది అన్నారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తున్న బిజెపి ప్రభుత్వం రైతాంగానికి బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించాలని వారు కోరారు. మార్చ్ 25, 26, 27న జరగబోయే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నిజాంబాద్ జిల్లాలో జరుగు తృతీయ మహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు. డిహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు కే సహదేవ్, బీసీ సంఘం నాయకులు ఎస్ వెంకటయ్య, ఎన్ఎఫ్‌డబ్ల్యూ. జిల్లా ఉపాధ్యక్షురాలు మోతె రాజేశ్వరి, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు శ్యామల లత, పాల్గొన్నారు. కాప్రా మండల రైతు సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. కాప్రా మండల అధ్యక్షులుగా కన్నెబోయిన ఐలయ్య, ఉపాధ్యక్షులుగా పెరమండ్ల నరసింహ, సిహెచ్ వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా కుసుమల్ల కుమార్, కోశాధికారిగా కే.రాముచారి, సహాయ కార్యదర్శిగా పి.లింగయ్య పాల్గొన్నారు.

## చెరువుల సుందరీకరణ పనులకు శంకుస్థాపన

**విశాలాంధ్ర - శేరిలింగంపల్లి:** మియపూర్ డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు,పెద్దకుడి చెరువు, రామసముద్రం కుంట చెరువు, నాయనమ్మ కుంట చెరువుల సుందరికరణలో భాగంగా నెక్సెస్ సెలక్ట్ మాల్స్ కంపెనీ, ఐటీయుఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ల వారి సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువుల పునర్జీవనంలొ భాగంగా సుందరీకరణ. పునరుద్దరణ పనులకు లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నెక్సెస్ సెలక్ట్ మాల్స్ కంపెనీ, ఐటీయుఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధులతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అరెకపూడి గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 64 చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, చెరువుల సుందరికరణతో స్వచ్ఛమైన వర్షపు జల సిరులను ఒడిసిపడదామని, చెరువుల జలకళతో గ్రామీణ వాతావరణం నెలకొల్పడమే నా ధ్యేయం గా పనిచేస్తానని, చెరువులను కాపాడితే అవి మనల్ని కాపాడుతాయి. జీవ వైవిధ్యం పెరుగు తుంది, పక్షులు వలసలు మొదలు అవుతాయి అని, చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. త్వరలోనే మియపూర్ రూపురేఖలు మారుతాయన్నారు. ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుంది" అని అన్నారు. ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని చెప్పడం జరిగింది, తామర పువ్వులను పెంచి కలుషితం కాకుండా చెరువును సుందరీకరిస్తామని ఎమ్మెల్యే గాంధీ చెప్పారు. చెరువులను సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెక్సెస్ సెలక్ట్ మాల్స్ కంపెనీ హైద్రాబాద్ సెంటర్ హెడ్ విషాంత్ దుగ్గల్, నెక్సెస్ సెలక్ట్ ట్రస్ట్ ముంబయి హర్ష బర్ద, ఐజీయుఎస్ ప్రతినిధులు నికిత్ కుమార్, ఈదర ఫణీంద్ర, ఐటీ సంస్థ ప్రతినిధులు రామ్ బొట్ల, చైతన్య, నెక్సెస్ సెలక్ట్ మాల్స్ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మికులకు ప్రతినెల 7 లోపు జీతాలు చెలించాలి

**విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్:** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే కార్మికులకు ప్రతినెల 7వ తేదీన జీతాలు చెలించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే కార్మికులకు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల జీతలు సమయానికి రాకపోవడం వల్ల నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షాబీర్ అలీకి ఏఐటీయూసీ నాయకులు పాలాభిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నందు పని చేసే కార్మికులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెల జీతం ఆలస్యంగా వస్తుందని, వాళ్ళ ఇల్లు కిరాయిలు ఇతర నిత్యావసరాలకు ఇబ్బంది కలుగుతుందని తెలియజేశారు. జీతభాత్యాల వేతనాల చట్టం ప్రకారం ప్రతి నెల 7వ తేదీ లోపే చెలించాలని వారు గుర్తు చేశారు.కనుక వెంటనే జీతాలు చెలించాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా మున్సిపల్ కార్మికులకు పాదరక్షలు, చీపురులు, మిగతా కిట్ ఇవ్వవాలని కోరారు. ఏఐటీయూసీ మున్సిపల్ రంగం, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఉజ్జయిని హరినాథ్ పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో బీసీలకు నిరాశ

**విశాలాంధ్ర-బషీర్ బాగ్:** రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు 11,404 కోట్లు బడ్జెట్ ప్రవేశపెట్టడం బీసీల దురదృష్టకరమనీ, రాష్ట్ర ప్రభుత్వం బీసీలను చిన్నచూపు చూస్తుందాన్ని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ కులగణన లెక్కల ప్రకారం బీసీలకు బడ్జెట్ కేటాయింపు జరుగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల మొదటి నుంచి కపట ప్రేమ చూపిస్తుందన్నారు. రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు 5 శాతం బడ్జెట్ కూడా కేటాయించలేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బీసీ సబ్ ప్లాన్ హామీని గురించి అసెంబ్లీలో ఊసే లేదన్నారు. రాష్ట్ర మంత్రి వర్గంలో బీసీలకు 9 మంత్రి పదవులు ఇవ్వాలన్నారు. ప్రధానంగా బీసీలల్లో యాదవ, ముదిరాజ్ సామాజిక వర్గాలకు మంత్రి వర్గంలో చోటు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ ఆలోచన విధానాన్ని మార్చుకోకపోతే రాబోయే రోజుల్లోనే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కాంగ్రెస్ పార్టీలో సామాజిక న్యాయం జరగడం లేదన్నారు.

## ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల పెంపు చారిత్రాత్మకం

**విశాలాంధ్ర - మొయినాబాద్ :** ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయానికి పునాదని, ఎస్సీ వర్గీకరణ చరత్రాత్మకమని మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొక్క బాల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు 42 పెంచడం, ఎన్నో ఏళ్ల ఎస్సీవర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాడం చరిత్రాత్మమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తోంది అనడానికి ఈ రెండు బిల్లులే నిద్శనమన్నారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీవర్గీకరణ అంశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెరగని ముద్రవేశారని బొక్క బాల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో దశాబ్దాలుగా ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు. ఈ కేసు రాజ్యాంగ ధర్మాసనం ఎదుటకు వచ్చినప్పుడు మంత్రి దామోదర్ రాజనర్సింహాంతో పాటు ఎస్సీ ఎమ్మెల్యేలను ఢిల్లీకి పంపించి న్యాయపరమైన చిక్కుల్ని తొలగించడంలో సీఎం కీలకంగా వ్యవహరించారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఈ అంశంపై ఏకసభ్య కమిషన్ ను నియమిస్తూ ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. బీసీలకు విద్యాసంస్థల్లో ప్రవేశాలు, నియామకాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేన్లను 42 శాతానికి పెంచుతూఉభయ సభలు తాజాగా ఆమోదం తెలపడం చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని... ప్రజాపాలన ద్వారా పేద ప్రజల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని కూడా చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలిపించుకునేందుకు అందరూ సమయత్తం కావాలని సూచించారు. మరో ఐదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## సునీత, విల్మోర్‌ల రాకకు ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల స్వాగత ప్రదర్శన

**విశాలాంధ్ర-బషీర్ బాగ్ :** సుమారు 8 నెలల పాటు అంతరిక్షంలో చిక్కుకుపోయిన సునీత విలియం, భారీ విల్మోర్‌లను ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు తిరిగి భూమికి స్వాగతించే అద్భుత బ్యానర్లను ప్రదర్శించారు. వారు సురక్షితంగా తిరిగి రావడానికి స్పేస్ ఎక్సచేసిన చారిత్రాత్మక ప్రయత్నాలను గౌరవిస్తూ విద్యార్థులు, అధ్యాపకులు ఈ అద్భుత అంతరిక్ష యాత్రను వీక్షించడానికి ఎదురుచూస్తున్నారని స్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ తెలిపారు. వ్యోమగాముల పట్టుదలను, ధైర్యాన్ని వారు ప్రశంసించారు. స్పేస్ ఎక్స్ ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు అకుంఠిత ప్రయత్నాల వల్ల రెస్క్యూ నౌక వలన ఇది సాధ్యమైనదని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు అంతరిక్ష పరిశోధనల పురోగతి గురించి, శాస్త్ర సాంకేతిక రంగాలను ఎంచుకోవడానికి ఇటువంటి సంఘటనలు వారిని ప్రేరేపించే విధంగా ఉన్నాయని వారు ఉత్సాహంతో తెలియజేశారు. యువ అభ్యాసకులలో అంతరిక్ష శాస్త్రం పట్ల ఉత్సుకతను పెంచడానికి ఈ పాఠశాల ఒక నిదర్శనంగా నిలిచింది. ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన బ్యానర్లతో విద్యార్థుల తల్లిదండ్రులు సెల్ఫీలు దిగి వ్యోమగాములతో కలిసి ఉన్నట్లుగా అనుభూతులను పొందుతున్నారు.

## ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం

**విశాలాంధ్ర - మేడిపల్లి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నూతన హెూటల్ తులిప్స్ గ్రాండ్ నందు బుధవారం ఉదయం ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రఖ్యాత బిల్డర్లు, ఆర్కిటెక్ట్‌లు, పరిశ్రమ నాయకులు అందరూ కలిసి భవిష్యత్తు నిర్మాణానికి సంబంధించిన అత్యాధునిక భావనలను చర్చించారు. రాధ టి.ఎం.టి, సవేరా ఏజెన్సీ వారు తమ అత్యాధునిక టిఎంటి బార్‌లను ప్రదర్శించారు. ఇది నిర్మాణంలో బలం, మన్నికను పునర్నిర్వచిస్తుందని నాణ్యత, విశ్వసనీయతకు కొత్త ప్రమాణాలను స్థాపించడం ఈ కార్యక్రమం ద్వారా సాధ్యమైతుందన్నారు. స్థిరమైన భవన నిర్మాణ పద్ధతులు, పర్యావరణ అనుకూల పదార్థాలు, సాంకేతిక పురోగతులపై చర్చలు జరిగాయి. మెరుగైన రేపటిని నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగడానికి ఈ సమావేశం నిజంగా ఒక మార్పు తెచ్చే దిశగా అడుగులు వేయడానికి ప్రేరణనిచ్చిందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు మార్కెట్ మార్పులు, కొత్త అవకాశాలు, ఎదురుకోవలసిన సవాళ్లు, ప్రాపర్టీ షో నిర్వహణ గురించి చర్చించడం జరిగింది. ఉప్పల్ బిల్డర్ అసోసియేషన్ అధ్యక్షులు శాడగొండ కరుణాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల సత్యనారాయణ, చైర్మన్ రమేష్, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఏంపల్ల అనంత రెడ్డి, సింగిరెడ్డి పద్మారెడ్డి, సవేరా ఏజెన్సీ శంకర్ రెడ్డి, నాగరాజు అసోసియేషన్ సభ్యులు, రాధ టి.ఎం.టి స్టీల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ప్రతులను దహనం చేసిన మాలమహానాడు నాయకులు

**విశాలాంధ్ర-బషీర్ బాగ్:** ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో తీర్మానానికి వ్యతిరేకంగా ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ కమిటీ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ నేతృత్వంలో అసెంబ్లీ చేసిన తీర్మానాల ప్రతులను బహిరంగ తగలబెట్టారు. మాల జాతులకు దెబ్బతీసిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలంగాణలో బొంద పెట్టాలని వర్గీకరణకు మద్దతు ఇచ్చిన అన్ని పార్టీల పైన తిరుగుబాటు చేయలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ కులాల జనాభా లెక్కలు లేవని కానీ 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ వర్గీకరణ చేయడం రాజకీయ కుట్రని విమర్శించారు దీనిపైన ఉన్నత న్యాయస్థానాల్లో సవాల్ చేస్తామని ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అడ్డుకుంటామన్నారు. మాలల పక్షాన చట్టసభల్లో బలమైన గళం వినిపించాల్సిన మాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి గంపగుత్తగా అమ్ముడుపోయారని ఆరోపించారు. మాలలకు తీరని ద్రోహం, వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఇలాంటి ద్రోహులు కూడా జాతి గట్టి బుద్ది చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి సంపు శ్రీనివాసులు, జాతీయ అధ్యక్షులు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్, ఎస్సీ ఎస్టీ అడ్వకేట్ ఫోరం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దిల రాయప్ప, బండి ఈశ్వర్, శ్రీనివాస్, చిప్పరి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఇది తెలంగాణ ప్రజలను మోసం చేసే బడ్జెట్

**విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ :** తెలంగాణ బడ్జెట్‌లో సంవత్సరానికి 70 వేల కోట్ల రూపాయల రెవిన్యూ తగ్గింది అని చెప్తుంటే ఫైనాన్స్ మినిస్టర్ మాత్రం రెవిన్యూలో రాష్ట్రం దూసుకొని పోతుంది అని తప్పుడు లెక్కలు చెప్పి ప్రజలను మోసం చేశారు అని సీనియర్ బీఆర్ఎస్ నాయకులు నగేష్ ముదిరాజ్ మూడులక్షల ఐదువేల కోట్లు బడ్జెట్‌లో అధిక శాతం జనాభా ఉన్న బీసిలకు కేవలం 11 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. సీఎం సన్మానం చేసిన బీసీ నాయకులంతా ఒక్కసారి ఆలోచించండి, ఈ ప్రభుత్వనికి బీసీల మీద ఉన్న వివక్ష, రాష్ట్రంలో బిసిలు అధిక జనాభాలో ఉన్న 11 వేల కోట్లు, మరి ఎస్సీలకు 40 వేల కోట్లు, ఎస్టీలకు 17 వేల కోట్ల ఎందుకు వివక్ష, బీసిలకు కూడా ఎస్సీలతో సమానంగా నిధులు కేటాయించకుండా బీసీలకు తీరని అన్యాయం చేశారు అని అన్నారు. ఇది పక్క బీసీ వ్యతిరేక ప్రభుత్వం మైనారిటీలకు 3 వేల కోట్లు చాలా అన్యాయం అని అన్నారు.

## బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

**విశాలాంధ్ర - కాప్రా :** రాష్ట్ర ప్రభుత్వం తరపున నేడు అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యరంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని, అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎ ఐ ఎస్ ఎఫ్ ) తెలంగాణ రాష్ట్ర నాయకుడు మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు లిసతీష్ కుమార్‌లి ఆరోపించారు. ఈ సందర్భంగా ఎ ఐ ఎస్ ఎఫ్ లితెలంగాణ రాష్ట్ర నాయకులు మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్‌లి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 - 2026 సంవత్సర మొత్తం బడ్జెట్. 3,04,965 కోట్లు. విద్య రంగానికి కేవలం 23,108 కోట్లు (7.57%) నిధులు కేటాయించడం విద్యార్థి లోకానికి త్రివ అన్యాయం చేస్తుంది అని అన్నారు. ప్రజా ప్రభుత్వం లో ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి నోచుకోదా.? ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15% నిధులు కేటాయిస్తాం అన్న మాట ప్రభుత్వం మర్చిపోయిందా. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి నికి 30% నిధులు కేటాయించాలని అఖిల భారత విద్యార్థి సమైక్య డిమాండ్ చేస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయిన ఇప్పటికీ విద్యారంగా సమస్యలు పరిష్కారం కాలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 15 నెలలు కానున్న విద్యాశాఖ మంత్రి లేకపోవడం చాలా విచారకరం. ఇది విద్యా రంగంలో పాలనాపరమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని అన్నారు. మంత్రిని నియమించడం ద్వారా విద్యా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరింత దృష్టి సారించగలుగుతుందని అభిప్రాయ పడ్డారు. కావున తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ బడ్జెట్లో విద్య రంగానికి 30% నిధులు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. లేని యెడల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ హెచ్చరించారు.

## మాస్కో ఫ్యాషన్ వీక్‌లో భారతీయ డిజైనర్లు

**విశాలాంధ్ర శేరిలింగంపల్లి:** మాస్కో ఫ్యాషన్ వీక్‌లో భారతీయ డిజైనర్లు తళుక్కున మెరిశారు. ఈ సృజనాత్మక వేదికలో తమ విశిష్టతను చాటుకున్నారు. ఈ ఈవెంట్ మార్చి 13 నుంచి 18వ తేదీ వరకు మాస్కోలోని మానేజే సెంట్రల్ ఎగ్జిబిషన్ హాల్లో నిర్వహించారు. నాలుగో మాస్కో ఫ్యాషన్ వీక్ రష్యా, అంతర్జాతీయ ఫ్యాషన్ ప్రపంచంలో ఒక ముఖ్యమైన ఈవెంట్‌గా నిలిచింది. ఈ ఫ్యాషన్ వీక్‌లో రష్యా, ఇతర దేశాల డిజైనర్ల తాజా ట్రెండ్స్, వినూత్నతను ప్రదర్శించారు. ఈ షోలో భారతీయ డిజైనర్లు విశేషంగా ఆకట్టుకున్నారు. తమ ప్రత్యేక శైలులు, ప్రపంచ ఫ్యాషన్ రంగానికి చేసిన విశేష కృషి, ఈ ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మాస్కో ఫ్యాషన్ వీక్లో భారతీయ బ్రాండ్ ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఫర్ ఖాదీ - ఖాదీ ఇండియా తమ ప్రత్యేకతను చాటుకుంది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ సమంత్ చౌహాన్ పాల్గొన్నారు. ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనేది భారత ఫ్యాషన్ వ్యాపార అభివృద్ధిని ప్రోత్సహిస్తూ.. దాని ప్రగతికి కృషి చేసే లాభాపేక్షలేని సంస్థ. ఇది 400 పైగా ప్రముఖ భారతీయ డిజైనర్లను ప్రోత్సహిస్తూ భారతీయ ఫ్యాషన్ రంగానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తుంది. ఈసారి ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాస్కో ఫ్యాషన్ వీక్‌లో భారతీయ సంప్రదాయ కళాత్మకతను ప్రపంచానికి ప్రదర్శించింది. ప్రముఖ భారతీయ డిజైనర్లు హస్తకళ ద్వారా భారతీయ సంస్కృతి వైభవాన్ని చాటి చెప్పారు. పర్యావరణ హితమైన, మన్నికైన సహజ ఖాదిని ఆధునిక ఫ్యాషన్తో సమ్మిళితం చేస్తూ ప్రత్యేకమైన, ఆకర్షణీయమైన డిజైన్లను ఆవిష్కరించారు. ఈ ప్రదర్శన ద్వారా భారత ఫ్యాషన్ వారసత్వాన్ని మాత్రమే కాకుండా, స్థిరమైన ఫ్యాషన్, నైతిక ఆచరణలను కూడా ప్రపంచానికి తెలియజేశారు. ఇది ఫ్యాషన్ ప్రియులను విశేషంగా ఆకర్షించింది.

# ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం

**మండలి నుంచి వైసీపీ వాకౌట్**

**ఇది రాజకీయాల్లో డ్రాపౌట్ పార్టీ: పయ్యావుల**

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ద్రవ్య వినిమయ బిల్లుకు ఉభయ సభల్లో ఆమోదం లభించింది. దీనిపై శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. చర్చకు అవకాశం లేకుండా ఉభయ సభల్లో ఒకేరోజు బిల్లును ప్రవేశపెట్టడం సరి కాదన్నారు. నిరసనగా వాకౌట్ చేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ 'కీలకమైన ద్రవ్య వినిమయ బిల్లును అసెంబ్లీ ఆమోదించింది. శాసన మండలిలో ఈ బిల్లుపై గురువారం చర్చించాలి కానీ అజెండాలో లేకుండా మండలిలోనూ బుధవారమే ప్రవేశ పెట్టి, ఆమోదింపజేశారు. చర్చ లేకుండా బిల్లును ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఇంత హడావిడిగా ఆమోదించాల్సిన అవసరమేమిటి? అధికారంలో ఉన్నాం కాబట్టి నచ్చినట్లు చేస్తామంటే సరే... మేము వాకౌట్ చేస్తాం' అని బొత్స సత్యనారాయణ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ వైసీపీ అంటేనే చట్ట సభల్లో వాకౌట్.. రాజకీయాల్లో డ్రాపౌట్ పార్టీ అని ఎద్దేవా చేశారు. కాగా, ఏపీ రాష్ట్ర ఉపాధ్యాయ బదిలీల క్రమబద్ధీకరణ బిల్లు–2025, ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ రెండో సవరణ బిల్లులను మంత్రిలోకేశ్ ప్రవేశపెట్టగా శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

# పేరు గొప్ప... ఊరు దిబ్బ

- డొక్కా సీతమ్మ భోజన పథకంపై నారాయణ విమర్శలు
- తక్షణం కార్మికుల వేతన పెంపునకు డిమాండ్
- లేనిపక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరిక

విశాలాంధ్ర–విజయవాడ(చిట్టినగర్): రాష్ట్రంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉందని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. కార్మికులు చాలీచాలని జీతంతో ఏలా జీవిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. వారికిచ్చే జీతాన్ని తక్షణమే రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం తప్పబోదని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి అధ్యక్షురాలు స్రవంతి అధ్యక్షతన బుధవారం చలో విజయవాడ మహా ధర్నాకు నారాయణ మద్దతు ప్రకటించారు. కార్మికులకు బాసటగా నిలిచారు. సీఎం చంద్రబాబుతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేల పిల్లలకు ఒక పూట భోజనానికి ఎంత ఖర్చు పెడుతున్నారో, ప్రజాస్వామ్యంలో ఉన్న ప్రతి ఒక్కరికి సమాధానం చెప్పాలని నారాయణ సవాల్ విసిరారు. మీకొక న్యాయం... పేద విద్యార్థులకు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మహిళల ఆకలి తెలియడం లేదా అని నిలదీశారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్‌కు క్షేత్రస్థాయి పరిస్థితుల గురించి కనీస అవగాహన లేదని విమర్శించారు. నెలకు రూ.3 వేల వేతనంతో ఒక కుటుంబం జీవించగలదా అని ప్రభుత్వాన్ని నారాయణ ప్రశ్నించారు. ఈ కార్మికుల వేతనాలు పెంచి మహిళలపై తమకున్న గౌరవాన్ని, అభిమానాన్ని చాటాలని హితవు పలికారు. తక్షణమే కార్మికుల వేతనాలు పెంచకపోతే ఉద్యమిస్తామని నారాయణ హెచ్చరించారు.

అంతకు ముందు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేశ్‌బాబు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాన్ని నెలకు రూ.10 వేలు చేయకపోతే పోరాటం తప్పదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థి మెస్ చార్జీలు పెంచకుండా ఈ పథకంపై ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తుందని విమర్శించారు. కార్మికుల వేతనాలు పెంచాలని నారా లోకేశ్‌ను మూడు సార్లు కలిసినా ఫలితం లేదన్నారు. 2019 ఫిబ్రవరిలో వేతనాల పెంపు జీవో విడుదల చేశారని గుర్తుచేశారు. ఆరేళ్లుగా ఆ దిశగా చర్యలు లేవని, తక్షణమే కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమను దోచుకోవద్దని ప్రభుత్వానికి నాయకులు హితవు పలికారు. వీరికి బీమా సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. వేతనాల పెంపుదలపై అసెంబ్లీలో ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రత్యక్ష పోరాటాలు తప్పబోవని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర ఆఫీసు బేరర్లు బుచ్చి బాబు, చాంద్ బాషా, పుల్లారావు, ప్రమీలమ్మ, ఈశ్వరమ్మ, బాషా, లాజర్, కవిత, సులోచన, వేణుగోపాల్ రెడ్డితో పాటు వివిధ జిల్లాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# ప్రతి ఉపాధి కూలీకి ఏడాదికి రూ.12 వేలు

**ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ప్రతి వ్యక్తికి పని కల్పించాలని, పని కల్పించకపోతే ఉపాధి భృతిగా ఏడాదికి రూ.12 వేల చొప్పున అందించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం నేతల బృందం డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య ప్రధానకార్యదర్శి శశిభూషణ్ కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర కార్యదర్శులు బి.కేశవరెడ్డి, కాబోతు ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు చిలుకూరు వెంకటేశ్వరరావు రాష్ట్ర సచివాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామనడం చట్టం స్ఫూర్తికి విరుద్ధమని, ఎట్టిపరిస్థితుల్లో కష్టజీవులు అంగీకరించబోరని తెలిపారు. బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించని ప్రభుత్వానికి ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేసే నైతిక హక్కు లేదని, అనుసంధానం పేరుతో కూలీలకు ద్రోహం తలపెట్టవద్దని కోరారు. వామపక్ష పార్టీల సహకారంతో వ్యవసాయ కార్మిక సంఘాలు, ఇతర ప్రజాసంఘాల దీర్ఘకాలిక పోరాటాల ఫలితంగా 2005లో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చిందని, గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక వలసలు, ఆకలి చావులు పెరుగుతుంటే... పని అయినా కల్పించండి, తిండైనా పెట్టండి అనే నినాదంతో నాడు పోరాటాలు చేసినట్లు గుర్తుచేశారు. దీంతో ఏడాదికి 100 రోజుల పనులు కల్పించేలా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం తీసుకొచ్చారన్నారు. ఇది గ్రామీణ పేదలకు వరమని భావించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘాలు విస్తృత ప్రచారం చేశాయన్నారు. ఈ పథకం ద్వారా పేదలు ఖర్చుచేసే డబ్బు వల్ల దేశం ఆర్థికాభివృద్ధి వైపు పయనం సాగిస్తోందని వివరించారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా అమలు చేయకపోవడంతో వలసలు తీవ్రమయ్యాయని తెలిపారు. మెటీరియల్ కాంపోనెంటును పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, పథకంలో నిధులు పక్కదారి పట్టించరాదని, కూలీల భద్రత కోసమే ఆ నిధులు వినియోగించాలని డిమాండ్ చేశారు. కుటుంబ జాబు కార్డులోని ప్రతి వయోజనుడికి విడిగా జాబ్ కార్డు ఇవ్వాలని, అడిగిన ప్రతి ఒక్కరికీ 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.700 ఇవ్వాలని, యంత్రాలను, కాంట్రాక్టర్లను నిషేధించాలని, వంద రోజులు పనిపూర్తి చేసుకున్న ప్రతి ఉపాధి హామీ కూలికి పథకంలో చూపెట్టిన విధంగా పనిముట్లు ఇవ్వాలన్నారు. పని ప్రదేశాలలో టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని, వేసవిలో మజ్జిగ సరఫరా చేయాలని, రెండు పూటలా పని విధానం తీసివేసి, సమ్మర్ అలవెన్స్ పునరుద్ధణ చేయాలని, మేటీలకు గుర్తింపు కార్డులు జారీ చేసి రోజుకు ఐదు రూపాయలు ప్రోత్సాహకంగా పారితోషకం ఇవ్వాలని కోరారు. చేసిన పనికి పే స్లిప్పులు కచ్చితంగా ఇవ్వాలని, పోస్టాఫీసుల ద్వారా బిల్లులు చెల్లించాలని, వారాలు పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలను తక్షణం విడుదల చేయాలని, పని ప్రదేశంలో మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వడదెబ్బ, గాయాలపాలైతే మెరుగైన ఆరోగ్య సేవలు అందించి కోలుకునే వరకు ఉపాధి వేతనాలు అందించాలన్నారు. ఉపాధి హామీలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ వివక్ష ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రామాల్లో మైక్‌ల ద్వారా పథకం గురించి విస్తృతంగా ప్రచారం జరగాలని, గ్రామసభల్లో పనులు ఎంపిక చేసి బహిరంగంగా వెల్లడించాలని, సామాజిక తనిఖీ పక్కాగా నిర్వహించాలని, ఉపాధి హామీలో రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేసి... అందులో వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధులను, పథకం అమలుకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను చేర్చాలని కోరారు. ఒడిశా ప్రభుత్వం తరహాలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కూలీకి అదనంగా మన రాష్ట్ర ప్రభుత్వం కూడా కొంత మొత్తం కలిపి కూలీలకు ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లను శశి భూషణ్ కుమార్‌కు వివరించినట్లు వారు తెలిపారు. తమ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి...కూలీలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానని శశిభూషణ్ కుమార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# విద్యార్థుల సంఖ్యపై రభస

**మంత్రి లోకేశ్ వర్సెస్ బొత్స**

**మండలిలో అధికార, విపక్షాల మాటల దాడి**

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: పాఠశాలల హేతుబద్ధీకరణపై ప్రశ్నోత్తరాల సమయంలో మండలిలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణకు మధ్య మాటలయుద్ధం జరిగింది. గత ప్రభుత్వ హయాంలో విద్యా ప్రమాణాలు పూర్తిగా వెనుకబడి పోయాయని, నాడు–నేడు పేరుతో విద్యావ్యవస్థను సర్వనాశనం చేశారని టీడీపీ సభ్యులు మండిపడ్డారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని, అందుకు గత ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. మంత్రి లోకేశ్ జోక్యం చేసుకుని గత ప్రభుత్వ విధానాల వల్ల పిల్లలకు నష్టం జరిగిందన్నారు. ఐదో తరగతి పిల్లలు రెండో తరగతి తెలుగు చదవడానికి ఇబ్బంది పడుతున్నారని, తాము విద్యార్థులపై పూర్తిగా దృష్టి పెట్టామన్నారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి... సమస్యలు లేకుండా చూస్తున్నామని తెలిపారు. సాంకేతికను జోడించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా తరగతుల నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు. వచ్చే ఏడాది నుంచి తల్లిదండ్రులకు విద్యార్థుల రిపోర్ట్ కార్డులు పంపిస్తామన్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడానికి గత ప్రభుత్వమే కారణమని లోకేశ్ ఆరోపించారు.

మంత్రి లోకేశ్ వ్యాఖ్యలపై వైసీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లారనడం సరికాదని, మంత్రికి ఈ లెక్క ఎక్కడి నుంచి వచ్చిందో తెలియడం లేదని మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. గత ప్రభుత్వంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లారనడం సరికాదన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి ఏనాడూ 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు బదిలీ అయిన సందర్భం లేదని చెప్పారు. సౌకర్యాలు లేవనడం సరికాదని, సౌకర్యాలపై సభ్యులందరినీ తీసుకెళ్లి స్టడీ టూర్ పెట్టాలన్నారు. 2014–19 మధ్య పాఠశాలలు ఎలా ఉన్నాయి? 2019–24 మధ్య ఎలా ఉన్నాయో పెద్దలతో గ్రామసభలు పెట్టి చర్చిద్దామని, ఒక్కో ప్రభుత్వానికి ఒక్కో విధానం ఉంటుందని చెప్పారు. తెలుగు మీడియంతోపాటు ఇంగ్లీషు మీడియం ప్రోత్సహించాలన్నదే తమ విధానమని బొత్స స్పష్టం చేశారు. ప్రాథమికస్థాయి నుంచి టోఫెల్ విద్య నేర్పించడం, ఇంగ్లీషు మీడియంలో ఐబీ విద్య అందించడం, సెంట్రల్ సిలబస్‌లో భాగంగా సీబీఎస్‌ఈ ప్రవేశపెట్టామని వివరించారు. మొన్న 80 శాతం మంది విద్యార్థులు ఇంగ్లీషు మీడియంలోనే పరీక్షలు రాశారన్నారు. కిందిస్థాయి నుంచి కమ్యూనికేషన్ కోసం అంతర్జాతీయ భాష ఇంగ్లీషును అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఈనెల 20వ తేదీన ఈ అంశంపై చర్చించాలని తాము కోరామని, ప్రస్తుతం ఉద్యోగుల సమస్యలపై చర్చించాలని వాయిదా తీర్మానం ఇచ్చామని వివరించారు. తాను తప్పు మాట్లాడితే రికార్డుల నుంచి తన మాటలు తొలగించాలని, తాము క్షమాపణ చెప్పడమేమిటని బొత్స ప్రశ్నించారు. తొలుత ఉద్యోగుల పెండింగ్ సమస్యలు, పీఆర్సీ అమలుపై వైసీపీ సభ్యులు మొండితోక అరుణ్‌కుమార్, కుంభా రవిబాబు తదితరులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించారు.

**హంద్రీనీవాపై రగడ**

హంద్రీనీవా కాలువకు లైనింగ్ పనులు, ప్రవాహం పెంచడంపై శాసనమండలిలో అధికార, ప్రతిపక్షసభ్యుల మధ్య రచ్చ కొనసాగింది.

హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలని వైసీపీ సభ్యుడు శివరామిరెడ్డి కోరారు. లైనింగ్ చేస్తే భూగర్భజలాలు పెరగవని, ప్రవాహం పెంచే అవకాశం మాత్రమే ఉందని సభ్యుడు తెలిపారు. హంద్రీనీవా ప్రవాహాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచాలన్నారు. హంద్రీనీవాపై వైసీపీ సభ్యులు అవాస్తవాలు చెప్పి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. హంద్రీనీవా ఎన్టీఆర్ కృషి ఫలితమని, దీనిపై రోజంతా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వైసీపీ సభ్యుల ఆరోపణలకు జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు బదులిచ్చారు. హంద్రీనీవా ద్వారా 2025 జూన్ కల్లా రెట్టింపు జలాలు ప్రవహించేలా సీఎం చర్యలు తీసుకున్నారని, హంద్రీనీవా ప్రవాహాన్ని 2200 క్యూసెక్కుల నుంచి 3850 క్యూసెక్కులకు పెంచాలని చంద్రబాబు నిర్ణయించారని చెప్పారు. బడ్జెట్‌లో రూ.3240 కోట్లు హంద్రీనీవాకు కేటాయించామని వివరించారు. ప్రవాహం పెంచి కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని అనేక ప్రాంతాలకు నీటిని అదనంగా తరలిస్తామన్నారు. హంద్రీనీవా కాలువ 216 నుంచి 400 కిలోమీటర్ల వరకు 195 చెరువులు అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయని వివరించారు. గత ఐదేళ్లలో హంద్రీనీవా పనులకు ఒక్క రూపాయి కూడా ఎందుకు ఖర్చు చేయలేదని ప్రశ్నించారు. హంద్రీనీవా కెనాల్‌కు లైనింగ్ వేస్తే రాయలసీమ సస్యశ్యామలమవుతుందన్నారు.

# వైసీపీకి మర్రి రాజశేఖర్ గుడ్‌బై

**ఎమ్మెల్సీ పదవికి రాజీనామా**

**చిలకలూరిపేట ఇంఛార్జ్ పదవి దక్కకపోవడంతో అసంతృప్తి!**

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వైసీపీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎమ్మెల్సీగా కొనసాగుతున్న మర్రి రాజశేఖర్ రాజీనామా చేశారు. ఈ మేరకు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజుకు బుధవారం ఆయన రాజీనామా పత్రం ఇచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన మర్రి రాజశేఖర్‌కు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీ పదవి పొందారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన కొనసాగుతున్నారు. అనంతరం సార్వత్రిక ఎన్నికల సమయంలో చిలకలూరిపేట ఎమ్మెల్యే టికెట్ కోసం ఆయన ప్రయత్నించగా, అందుకు అధిష్టానం నిరాకరించింది. ఇదే సమయంలో ఆయనకు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారు. అయితే వైసీపీ ఓటమి అనంతరం తిరిగి చిలకలూరిపేట ఇంఛార్జ్‌గా తనను నియమిస్తారని ఆశించి భంగపాటుకు గురయ్యారు. చిలకలూరిపేట ఇంఛార్జ్‌గా మాజీ మంత్రి విడతల రజనికి బాధ్యతలను పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అప్పగించారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో రజని ఆధిపత్యం కొనసాగడంతో ఆయన అసంతృప్తితో ఉన్నారు. వైసీపీ సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లోను ఆయన చాలా రోజులు గైర్హాజరయ్యారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై అడుగడుగునా వైసీపీ ఎమ్మెల్సీలు వాయిదా తీర్మానాలు ఇవ్వడం, ప్రశ్నలతో మాటల దాడికి దిగుతున్నప్పటికీ, రాజశేఖర్ సహచర పార్టీ సభ్యులతో కలిసి ముందుకు రాలేదు. ఎట్టకేలకు ఆయన ఎమ్మెల్సీకి రాజీనామా చేశారు. చిలకలూరిపేటకు వెళ్లి వైసీపీ సభ్యత్వానికీ తాను రాజీనామా చేస్తానని, తన రాజీనామాకు గల కారణాలను వెల్లడిస్తానని ఆయన శాసన మండలి లాబీలో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మర్రి రాజశేఖర్‌తో కలిసి ఇప్పటివరకు వైసీపీ నుంచి ఐదుగురు ఎమ్మెల్సీలు వైసీపీని వీడనట్లయింది. ఇంతకుముందు వైసీపీ ఎమ్మెల్సీలు పోతుల సునీత, బల్లి కల్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, జయమంగళ వెంకట రమణ వైసీపీకి రాజీనామా చేసి కూటమి పార్టీల్లో చేరారు. 2014లో టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావుపై వైసీపీ తరపున రాజశేఖర్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున విడదల రజని పోటీ చేసి గెలుపొందారు. తనను కాకుండా, తన సొంత నియోజకవర్గ ఇంఛార్జ్ పగ్గాలను విడదల రజనికి ఇవ్వడంతో అసంతృప్తిగా ఉన్న మర్రి రాజశేఖర్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినట్లు తెలిసింది.

## మారిటైమ్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యం: జనార్దన్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్–2047కు అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో స్వర్ణాంధ్ర 2047 ద్వారా 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు పెంచడంతో పాటు భారతదేశ మారిటైమ్ హబ్‌గా ఆంధ్ర ప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. బుధవారం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జల మార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ అధ్యక్షతన జరిగిన 4వ జాతీయ సాగరమాల అపెక్స్ కమిటీ (ఎన్ఎస్ఏసీ) సమావేశంలో కేంద్ర రోడ్లు, రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర సహాయ మంత్రి శంతను ఠాకూర్, తీర ప్రాంతాల రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంత్రి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

# బ్యాంకులకు 5 రోజుల పని

**ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి: సంతోశ్ కుమార్**

న్యూదిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం, ఐదు రోజుల పని దినాల కోసం బ్యాంకు సంఘాలు చేస్తున్న నిజమైన డిమాండ్లను పరిష్కరించాలని సీపీఎం ఎంపీ సంతోశ్ కుమార్ మంగళవారం ఆర్థిక మంత్రిని కోరారు. రాజ్యసభలో జీరో అవర్ సందర్భంగా ఈ అంశాన్ని లేవనెత్తిన సంతోశ్ కుమార్ తొమ్మిది సంఘాలతో కూడిన యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ మార్చి 24–25 తేదీలలో 48 గంటల బ్యాంకు సమ్మెకు పిలుపునిచ్చిందని, వారి డిమాండ్ల కోసం ఒత్తిడి తెస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని బ్యాంకు ఉద్యోగులు, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని ఉద్యోగులు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారని నొక్కి చెబుతూ, ఈ సమ్మె బ్యాంకింగ్ రంగాన్ని ప్రభావితం చేస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సిబ్బంది కొరత ప్రధాన సమస్యలలో ఒకటి అని ఆయన చెప్పారు. బ్యాంకుల్లో దాదాపు 2.11 లక్షల ఖాళీలు ఉన్నాయని సంతోశ్ అన్నారు. తగినంత సిబ్బంది లేకపోవడం కార్మికుల మానసిక ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తోందని, ఎందుకంటే వారు అధిక భారంతో బాధపడుతున్నారని తెలిపారు. మరో సమస్య బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పని దినాలకు సంబంధించినదని ఆయన అన్నారు. 'ఇది బ్యాంకు ఉద్యోగుల డిమాండ్. దీనిపై ఏకాభిప్రాయం కూడా ఉంది. బ్యాంకు అధికారులు, ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ కూడా దీనికి అంగీకరించాయి. ఇప్పుడు ఈ అభ్యర్థన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ముందు పెండింగ్‌లో ఉంది' అని తెలిపారు. ఈ డిమాండ్‌కు మద్దతుగా, బీమా రంగంలో భారతీయ రిజర్వు బ్యాంకులో కూడా ఐదు రోజుల పని ఉందని ఆయన అన్నారు. 'ఆర్థిక మంత్రి ఈ విషయాన్ని తీవ్రంగా పరిశీలించి నిజమైన ఆందోళనలను పరిష్కరించాలి' అని కోరారు.

# ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

**కేరళకు న్యాయం చేయాలి: సునీర్**

న్యూదిల్లీ: మోదీ ప్రభుత్వం ప్రజారోగ్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని సీపీఐ ఎంపీ పీపీ సునీర్ విమర్శించారు. ఆరోగ్య సంరక్షణ సేవల కోసం అరకొర కేటాయింపులను దుయ్యబట్టారు. జీడీపీ నుంచి కేవలం 2.1శాతమే ఆరోగ్య రంగానికి 2024–25 బడ్జెట్‌లో కేటాయించారని, ఇది అభివృద్ధి చెందుతున్న దేశాల కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సిఫార్సు చేసిన దాని కంటే ఐదు శాతం తక్కువని అన్నారు. సునీర్ బుధవారం రాజ్యసభలో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తీరును తీవ్రస్థాయిలో ఆక్షేపించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కేంద్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని గుర్తుచేశారు. పెరుగుతున్న వైద్య ఖర్చులు పౌరులకు భారంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం కనీస కేటాయింపులు లేవన్నారు. తద్వారా లక్షలాది మందికి తగిన మద్దతు అందే పరిస్థితి లేదని అన్నారు. దేశానికి కేరళలోని ఆరోగ్య సంరక్షణ నమూనా ఆదర్శనీయమని సునీర్ చెప్పారు. కేరళ రాష్ట్రంలో ప్రజారోగ్య మౌలిక వసతులు, రోగాల నియంత్రణకు చర్యలు పటిష్ఠంగా ఉన్నాయని, కోవిడ్–19ని కట్టడి చేసి ప్రపంచ మన్ననలను కేరళ పొందిందన్నారు. కేరళ విజయం దేశమంతటా ప్రతిధ్వనించాల్సింది పోయి ఆ రాష్ట్రంపై కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. న్యాయంగా రావాల్సిన రూ.600 కోట్లను ఇవ్వకుండా కేరళను కేంద్రం ఇబ్బంది పెడుతోందని, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను గాడి తప్పించాలని చూస్తోందని దుయ్యబట్టారు. కోజికోడ్‌లో ఎయిమ్స్ కోసం కేరళ దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తుంటే కేంద్రం పట్టించుకోవడం లేదని, ఇది రాష్ట్రంపై బీజేపీ రాజకీయ కక్షసాధింపునకు నిదర్శనమని సునీర్ వ్యాఖ్యానించారు.

# అసోంలో కొత్త యూరియా ప్లాంట్

**మహారాష్ట్ర జేఎన్‌పీఏ పోర్టుతో అనుసంధానానికి ఆరు లేన్ల నిర్మాణం**

**రూ.2వేల లోపు యూపీఐ లావాదేవీలు చార్జీ రహితం**

న్యూదిల్లీ: అసోంలో రూ.10,601.4 కోట్ల అంచనా వ్యయంతో యూరియా ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.4,500 కోట్ల పెట్టుబడితో జేఎన్‌పీటీ పోర్టుతో అనుసంధానం చేసేలా ఆరు లేన్ల హైవే ప్రాజెక్టుకు అంగీకరించింది. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్ (ఎన్‌పీడీడీ) పున:పరిశీలనకు ఒప్పుకున్నది. చిరు వర్తకుల కోసం తక్కువ విలువగల యూపీఐ లావాదేవీలను ప్రోత్సహించేలా ఇన్‌సెంటివ్ పథకాన్ని, పశు సంవర్థక రంగంలో వృద్ధిని పెంపొందించేలా పున:పరిశీలించిన రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎం)ను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం భేటీ అయింది. అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. అవి,

**నామ్‌రూప్‌లో కొత్త యూరియా కాంప్లెక్స్**

యూరియా ఉత్పత్తిలో దేశాన్ని స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడం కోసం నామ్‌రూప్ అసోంలోని బ్రహ్మపుత్ర వ్యాలీ ఫెర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీవీఎఫ్‌సీఎల్) ఆవరణలోనే కొత్తగా బ్రౌన్‌ఫీల్డ్ అమోనియా– యూరియన్ కాంపెక్స్ ఏర్పాటునకూ కేబినెట్ ఆమోదించింది. దీని వార్షిక సామర్థ్యం 12.7లక్షల మెట్రిక్ టన్నులు. నామ్‌రూప్–4 ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చేందుకు 48 నెలల సమయాన్ని కేటాయించినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (డీపీఈ) మార్గదర్శకాల ప్రకారం నిర్దేశిత పరిమితులకు అనుకూలంగా 18 శాతం మినహాయింపుతో నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్) వాటాలో భాగాస్వామ్యాన్ని కూడా కేబినెట్ ఆమోదించింది. ఉమ్మడి వెంచర్‌లో అసోం ప్రభుత్వం వాటా 40 శాతంగా ఉంటే, బీవీఎఫ్‌సీఎల్‌కు 11 శాతం, హిందుస్థాన్ ఉర్స్‌వారక్ & రసాయన్ లిమిటెడ్ (హెచ్‌యూఆర్ఎల్)కు 13 శాతం, ఎన్ఎఫ్ఎల్‌కు 18 శాతం, ఆయిల్ ఇండియా లిమిటెడ్‌కు 18 శాతం చొప్పున భాగస్వామ్యం ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా దేశీయంగా యూరియన్ ఉత్పత్తి పెరుగుతుందని, ఈశాన్యం, బీహార్, పశ్చిమ బెంగాల్, తూర్పు యూపీ, జార్ఖండ్ అవసరాలు తీరుతాయని ప్రకటన వెల్లడించింది.

**రూ.4,500 కోట్లతో ఆరు లేన్ల హైవే**

మహారాష్ట్ర జేఎన్‌పీఏ పోర్టు (పగోటే)ను చౌక్ (29,219 కిమీలు) అనుసంధానం చేసేలా గ్రీన్ ఫీల్డ్ హై స్పీడ్ నేషనల్ హైవే అధ్వర్యంలో ఆరు లేన్ల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ పచ్చ జెండా ఊపింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.4,500.62కోట్లు అని అధికారిక ప్రకటన తెలిపింది. జేఎన్‌పీఏ పోర్టులో కంటైనర్లు పెరగడం, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి క్రమంలో ఆరు లేన్ల నిర్మాణం అనివార్యమైనట్లు పేర్కొంది. ప్రస్తుతానికి పోర్టు నుంచి ఎన్‌హెచ్–48 జీక్యూ సెక్షన్‌కు, ముంబై–పూనే ఎక్స్‌ప్రెస్‌వే వెళ్లేందుకు 2–3 గంటల సమయం పడుతుంది. పలాస్పే ఫటా, డి పాయింట్, కలంబోలి జంక్షన్, పన్వేల్‌లో ట్రాఫిక్ ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణం. ఈ మార్గాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించేలా కొత్త ప్రాజెక్టు దోహదమవుతుంది. జేఎన్‌పీఏ పోర్టు (ఎన్‌హెచ్ 348) పగోటే గ్రామం నుంచి మొదలయ్యే ఈ ప్రాజెక్టు ముంబై పూనే హైవే (ఎన్‌హెచ్ 48) వద్ద ముగుస్తుంది. మధ్యలో ముంబై –పూనే ఎక్స్‌ప్రెస్ వే, ముంబై–గోవా ఎన్‌హెచ్ 66ను కలుపుతుంది.

**డెయిరీ ఆధునికీకరణకు ఎన్‌డీడీ**

కేంద్ర పథకంగా రివైజ్డ్ నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్ (ఎన్‌పీడీడీ)కి కేబినెట్ ఆమోదం లభించింది. 15వ ఆర్థిక కమిషన్ ఛత్రంలో (2021–22 నుంచి 2025–26 వరకు) రూ.2,790 కోట్ల బడ్జెట్‌తో దీనిని అమలు చేస్తారు. డెయిరీ మౌలిక వసతుల ఆధునీకీకరణ, విస్తరణకు, ఈ రంగ సుస్థిరాభివృద్ధిపై దృష్టి తోనే ఈ పథకాన్ని చేపట్టనున్నారు. ఈ పథకం వల్ల గ్రామీణ జీవనోపాధి మెరుగు కాగలదని, ఉద్యోగాల సృష్టి సాధ్యమవుతుందని, మరింత పటిష్ఠ, స్వయంసమృద్ధి డెయిరీ రంగం అభివృద్ధి కాగలదు. కోట్లాది మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఈ మేరకు అధికారిక ప్రకటన వెల్లడించింది. అలాగే, పశుసంవర్థక రంగానికి ఊతమిచ్చేలా రివైజ్డ్ రాష్ట్రీయ గోకుల్ మిషన్‌కు కేబినెట్ ఆమోదం లభించింది.

**పీ2ఎంకు ఆమోదం**

2024–25 ఆర్థిక సంవత్సరం కోసం 'ఇన్‌సెంటివ్ స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ లో వాల్యూ భీమ్–యూపీఐ ట్రాన్సాక్షన్స్ పర్సన్ టు మర్చెంట్' (పీ2ఎం)నూ కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ పథకం కింద చిరు వర్తకుల కోసం రూ.2000 లోపు యూపీఐ లావాదేవీలు జరుపవచ్చు. అదనపు వ్యయం లేకుండా యూపీఐ సేవలను చిరు వర్తకులు వినియోగించేందుకు ఇది దోహదమవుతుంది. యూపీఐ లావాదేవీలు రూ. 210 లక్షల కోట్లకు చేరుకున్నాయని అధికారిక ప్రకటన తెలిపింది. రూ.2 వేల కంటే తక్కువ విలువ కలిగిన లావాదేవీలకు ఎలాంటి చార్జీ లేదని వెల్లడించింది. ప్రస్తుత యూపీఐ విధానంలో కస్టమర్ బ్యాంక్, ఫిన్‌టెక్ సంస్థ, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్, యాప్ సంస్థ ద్వారా 4 అంచెల్లో లావాదేవీలు జరుగుతున్నాయని పేర్కొంది. రూ.1,500 కోట్లు ఇన్సెంటివ్ రూపంలో చిన్న లావాదేవీలకు చార్జి లేకుండా చేస్తామని ప్రకటన వెల్లడించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.